జులై, 2023
సంపుటి 03, సంచిక 18

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలంగాణ సాహిత్య మాసపత్రిక

కవితా పుష్పకము
మహాంధ్రోదయం
అమృతాభిషేకం
అగ్నిధార
రుద్రవీణ
పునర్నవం
మహాబోధి
బాలలగేయాలు
తిమిరంతో సమరం
ఆలోచనా లోచనాలు
అమృతవల్లి-తెలుగుతల్లి
ధ్వజమెత్తిన ప్రజ
జ్వాలా లేఖిని



"దాశరథి జయంత్యుత్సవ
ప్రత్యేక సంచిక
(22 జులై, 1925)"



రచయిత, ఉద్యమకారుడు

## వట్టికోట ఆళ్వారు స్వామి

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **BHARATHA JAGRUTHI,** Pasham Amruthaaram Residency,
H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar,
Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

## విషయ సూచిక


20 మట్టిలో విరిసిన పారిజాతాన్ని స్పర్శించిన **అరుణ నారద భట్ల** కవిత **"శాంతికాముకుడు"**

06 పువ్వును ఆయుధాన్ని మేళవించిన నిటారైయిన అక్షరానికి **వెల్దండి శ్రీధర్** జోహార్లు **"అక్షరాలు గర్వించే కవి"** కవిత



31 దాశరథి వచనానికి **సంగనభట్ల నరసయ్య** విశ్లేషణా వ్యాసం **"దాశరథి కృష్ణమాచార్య వచన రచనలు"**



07 వీరుని పోరాటానికి **దాశరథి** కథారూపం **"తెలంగాణ అమరవీరుని రక్తాంజలి"**



21 దాశరథి వచన కవితా నిర్మాణంలోని లోతులను విశ్లేషించిన **నరసింహారెడ్డి** వ్యాసం **"దాశరథి వచన కవిత - వస్తు శిల్పాలు"**



27 ఉద్యమ వీరుడు సాయి చందుకు నివాళి వ్యాసం **చిటుకుల మైసూరారెడ్డి**, **"ఉద్యమ గీతిక మూగపోయింది"**



17 మానవ మనస్తత్వం చిత్రించిన **కూరెళ్ల పద్మాచారి** కథ **"జాతస్య మరణం ధ్రువం"**



41 దేవుని రథం ఎక్కాలని పసితనపు ఆకాంక్ష చిత్రించిన **వేముగంటి మురళీకృష్ణ** కథ **"మొత్తానికి రథం బయిలెల్లింది..."**

35 దాశరథి సాహిత్యంలో ప్రతిఫలించిన సామాజిక కోణాలను విశ్లేషించిన **అనిశెట్టి రజిత** వ్యాసం... **"ప్రజాకవి కవితారవి దాశరథి"** ...పేజీ 35

37 అభ్యుదయ పదగామి **ఎస్.వి.**తో తంగేడు ముఖాముఖి

వంచనకు గురవుతున్న సగటు మనిషి కథ.. **కళాగోపాల్** **"దేశం బోతున్న...!"** ...పేజీ 29

బొగ్గు ముక్కలతో ధిక్కారాన్ని తెలిపిన కవిత్వానికి, **నాంపల్లి సుజాత** అక్షర రూపం **"జయహెూ దార్శనికుడా.!!"** ...పేజీ 10

**కావ్య శరధికి** పద్య ప్రణతి చెప్పిన **రామశర్మ** ...పేజీ 26

దాశరథి యాత్రాస్మృతిని అవలోకనం చేస్తున్న **సాగర్ల సత్తయ్య** వ్యాసం... **'నేటి తరానికి స్ఫూర్తి పాఠం - దాశరథి "యాత్రాస్మృతి"** ...పేజీ 53

సినీ గీతకర్తగా, గేయకర్తగా దాశరథిని ఆవిష్కరించిన **భానుప్రకాశ్** వ్యాసం... **"గేయవీణా తంత్రి! దాశరథి!!"** ...పేజీ 45

**దోరవేటి** వ్యాసంలో దాశరథి పద్య నిర్మాణ కుశలత **"ఆధునిక పద్య విద్యాస్ఫూర్తి కేంద్రం - దాశరథి"** ...పేజీ 11

దడ రేపిన గజల్ పైన **సూరారం శంకర్** గజల్ **"మహాకవి దాశరథి"** ...పేజీ 09

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

# మూర్ఛన

**దాశరథి**




దొంతరలైన మబ్బులకు త్రోవలు చూపెడి మించుకాగడా
చెంత మనోజ్ఞ కావ్యము రచించు కవిన్ ననుజూచి భావనా
సంతతి నాగసర్పముల చాడ్పున వచ్చి నటించుచుండ వా
యింతును రుద్రవీణ! నటియింతును పశ్చిమ దిక్తటమ్ములన్

కుంతలముల్ కపోలములకున్ దగులన్, నయనాంచలమ్ములన్
దొంతరలై నవాశ్రువులు తొన్క ప్రతీక్షణలో నిశాదివం
బెంతయు వంతతో కినియు నిద్దమతిన్ ప్రియురాలి గూర్చి ప
ల్కింతును రుద్రవీణపయి ఈహిత సాంత్వన గేయమాలికల్

చింతల తోపులో కురియు చిన్కులకున్ తడిముద్దయైన బా
లింత యొడిన్ శయించు పసిరెక్కల మొగ్గనువోని బిడ్డకున్
బొంతలు లేవు కప్పుటకు; బొంది హిమంబయిపోవు నేమొ? వా
యింతును రుద్రవీణ పయి నించుక వెచ్చని అగ్నిగీతముల్

గొంతుకలెండి, డొక్కలకు కొంచెము గంజియు లేకపోయినన్
పంతము నెగ్గగావలెను; ప్రాణము పోయినగూడ సమ్మె గా
వింతు మటంచు ఆకట తపించెడి పేదల గూర్చి నేను మ్రో
గింతును రుద్రవీణ, పలికింతును విప్లవ గీతికావళుల్.

*('రుద్రవీణ' కావ్యం నుండి)*

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య మాస పత్రిక

జులై, 2023

సంపుటి 03 సంచిక 18



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# తెలంగాణ జాతివాది దాశరథి

"దాశరథీ మనోజ్ఞ కవితాశరధీ" అని సినారెతో స్తుతించబడ్డ మహాకవి దాశరథి. జలపాతం కావ్యాన్ని అంకితం చేస్తూ తన గౌరవాన్ని ప్రకటించారు సినారె. చీకటి ఖండం అని నిరసించబడిన తెలంగాణకు ఒక జాతిభావం కల్పించిన మహాకవి దాశరథి. తన సమాంతర సాహిత్యంలో పద్యరచన మీద నిరసన వెల్లువెత్తింది. "పద్యాల నడుములు విరగ్గొడతామని" నినాదప్రాయ ప్రకటనలు వెలువడినాయి. పద్యం కేవలం ఫ్యూడల్ భావజాలానికి సంకేతం అనే భావన ప్రబలిపోయింది.

దాదాపుగా అదే సమయంలో గంటమెత్తిన దాశరథి పద్యం ఎంత సజీవమో నిరూపించారు. గంగా ప్రవాహంలాగా పద్యాన్ని ఉరికించారు. వచన కవితలో చెప్పిన అభ్యుదయ భావాలన్నీ పద్యంలో తిరుగులేని విధంగా పలికించారు. ఆయన ఉర్దూకవి మగ్దూం లాగా తన కలం అంగారం శృంగారం సమానంగా పలుకుతుందని తన కవితా లక్షణం తెలియజేశారు. సౌందర్యాన్ని పలికించిన కలం నుండి నిప్పులను కురిపించారు. "నా గీతావళి ఎంత దూరం ప్రయాణంబౌనో అందాక, ఈ భూగోళమ్ముకు అగ్గిపెట్టెద" అని హుంకరించారు. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అని పలికించిన దాశరథి కృష్ణమాచార్య పద్యపాదం తెలంగాణ ప్రజలను కదిలిచింది. "తెలంగాణము రైతుదే ముసలి నక్కకు రాచరికమ్ము దక్కునే" అని పిడికిలించిన దాశరథి విప్లవం అంటే ఏమిటో తెలియజేశారు. కేవలం కవిత్వం రాయడం మాత్రమే కాకుండా కార్యాచరణలో కూడా తన సత్తా చూపించిన ధీర కవి ఆయన. నిజాం రాజును ఎదిరించి జైలు శిక్ష అనుభవించాడు. వట్టికోటతో కలిసి ఆయన గడిపిన జైలు జీవితం ఉద్యమకారులకు గొప్ప స్ఫూర్తి. అగ్నిధార కురిపించినా, రుద్రవీణ వాయించినా, తిమిరంతో సమరం చేసినా దాశరథి ఒక ప్రత్యేకమైన వాణితో తన లేఖినిని నడిపించాడు. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22న వరంగల్ జిల్లా చిన్న గూడూరులో జన్మించారు. కవితారథిగా నిలిచిన దాశరథి పిన్నప్రాయంలోనే ఆంగ్ల సంస్కృతం హిందీ ఉర్దూ మొదలైన భాషల్లో పట్టు సాధించారు. తెలంగాణ జాత్యాభిమానానికి కవిత్వాన్ని ఆయుధంగా ఎంచుకున్నారు. "నవభారత యువకులారా, కవులారా, కథకులారా భవితవ్యపు హవనానికి హోతలు నూతన భూతల నిర్మాతలు మీరే"నని విజయగీతిక ఆలపించారు. 1944లో ఓరుగల్లులో సారస్వతపరిషత్తు ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కవి సమ్మేళనాన్ని భగ్నం చేయడానికి రజాకార్లు పన్నిన కుట్రను భగ్నం చేశారు.

దేవులపల్లి రామానుజారావు, సురవరం ప్రతాపరెడ్డి లాంటి ఉద్దండులతో కలిసి ఆయన కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. రజాకార్లు పందిరి కాలబెడుతున్నా అగ్నిజ్వాలలో నిలబడి సింహమై కవనగర్జన చేశారు.

ఆ సంవత్సరంలోనే చారిత్రాత్మకమైన మానుకోటలో సభ జరిపి చిన్న గూడూరు కాలినడకన వెళ్లిన దాశరథిని అక్కడే నాటి ప్రభుత్వం అరెస్టు చేసింది. నెల్లికుదురు స్టేషనులో బంధించింది. అక్కడ నుండి వరంగల్‌కు కాలినడకన తీసుకెళుతుండగా దాశరథి తప్పించుకున్నారు. భారత స్వాతంత్ర్యానికి ముందు 1947 ఏప్రిల్ నుండి 16 నెలల పాటు జైలు జీవితం గడిపారు. 1948లో దాశరథితో పాటు మరో 30 మంది ఖైదీలను వరంగల్ నుండి నిజామాబాద్ జైలుకు తరలించారు. అక్కడ ఆయన లేఖిని నుండి వెలువడిన పద్యాలు ఇప్పటికీ అజరామర స్ఫూర్తివంతంగా నిలిచిపోయాయి. ఆయన ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్స్పెక్టర్‌గా, ఆకాశవాణి ప్రయోక్తగా ప్రభుత్వ ఉద్యోగాలు చేశారు. సినీ కవిగా దాశరథి ప్రత్యేకమైన బాణి సార్వజనీనకమైన ప్రజాకర్షణ ఆయన పాటల్లో కనిపిస్తుంటుంది. ఆయన వీణపాటకు ప్రసిద్ధులు. ఈ గీతాలకు పద్యాలకు తోడుగా ఆయన ఎన్నో వచన ప్రక్రియలు సృజించారు. కథలు, విమర్శనా వ్యాసాలు, యాత్రాస్మృతి లాంటి అనేక ప్రక్రియలు ఆయన కలంలో కొత్త నిర్మాణాన్ని సంతరించుకున్నాయి. తర్వాత 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి ఆయన దానికి అధ్యక్షుడిగా ఉన్నారు. సారస్వత పరిషత్తు స్థాపకులలో ఒకరిగా పని చేశారు. ఈ విధంగా బహుముఖీన ప్రతిభామూర్తి దాశరథి తెలంగాణకు అత్యంత గౌరవనీయుడు. తెలుగు వారందరికీ అభిమాన పాత్రుడు.

నరుడు నరుడు కావాలనే ఆయన తపన. అనాథల పక్షాన ఆగర్భ శ్రీమంతులతో ఆయన చేసిన యుద్ధం, నిరంకుశ ప్రభుత్వాలకు ఒక ప్రశ్నగా నిలిచిన ఆయన వ్యక్తిత్వం ప్రపంచ సాహితీలోకానికే ఆదర్శం.

తెలంగాణ జాగృతి ఆ మహాకవి స్మరణలో నిజామాబాదులో ఆయన గడిపిన జైలు ఆవరణలో ఆయన విగ్రహం ఆవిష్కరిస్తుంది. అదే జైలులో ఆయనతో గడిపిన వట్టికోట విగ్రహం కూడా ఆవిష్కరణ కానున్నది. తెలంగాణ జాగృతి నిర్వహిస్తున్న తంగేడు మాస పత్రిక ఈసారి దాశరథి ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాం. ఆయనకు చేదోడు వాదోడుగా ఉన్న మరో తెలంగాణ మహాకవి సినారె జన్మదినం కూడా ఈ నెలలోనే కావడం మన అదృష్టం. జాతికి స్ఫూర్తినిచ్చిన మహాకవులను గౌరవించడం మన కర్తవ్యం.

జై తెలంగాణ! జై జాగృతి!!

కవిత కల్వకుంట్ల

కవిత

# అక్షరాలు గర్వించే కవి



డా॥ వెల్దండి శ్రీధర్, 98669 77741



వెన్నెలను రక్తాన్ని రంగరించిన
పూవును ఆయుధాన్ని మేళవించిన
నిలువెత్తు నిటారైన అక్షరం

నిజాం మీదికి పద్యాల పిడికిలి
రసహృదయుల మీదికి పాటల
తేనియలను విసిరిన సున్నితపు కైజారు

పదునైన బహుభాషా పాండిత్యం
స్వేచ్ఛను కాంక్షించే అగ్నిధార
పాటల పడవలో రసస్తీరాలను
ముట్టిన మాటల మంత్రజాలం

వీణ పాటలకు నడకలు నేర్పిన
భక్తి గీతాలకు పల్లవులు అల్లిన
కన్నెవయసు మనసులను కొల్లగొట్టిన
గాలిబ్ గీతాల సౌకుమార్యపు ప్రవాహం

గోడల్నే కాగితాలుగా
అక్షరాల్నే ఆయుధాలుగా
మలుచుకున్న గాయపడిన కవి సింహం

ముసలి నక్కను
రాచరికం నుంచి పడదోసిన
తెలంగాణము రైతుదే అని నినదించిన
ధ్వజమెత్తిన రుద్రవీణ

ఆ చల్లని సముద్ర గర్భంలోని
మణిమాణిక్యాలను బడబాగ్నిని
దోసిలితో పట్టి దగ్ధమైన బతుకులను
సాహిత్యపు డప్పు మీద మోగించిన
సిసలైన తెలంగాణ కవి

నాటి కథ

# తెలంగాణ అమరవీరుని రక్తాంజలి

పోరాట వీరుల మీద నాటి జైల్లో జరిగిన హింసను చిత్రించిన కథ...



శ్రీ దాశరథి

రక్తం కారుస్తున్న పశ్చిమాకాశం కిటికీలోనుంచి భయంకరంగా కనిపిస్తున్నది. తన దవడల్లో నించి కారుతున్న రక్తాన్ని చేతితో తుడుచుకున్నాడు విశ్వం. రెండో చేతితో తుడుచుకున్నాడు. రెండు అరచేతులూ దగ్గరగా పెట్టిచూచుకున్నాడు. దవడల్లోనించి నెత్తురు చుక్కలు రాలాయి. దోసిట్లో నెత్తురు, గుడ్డల నిండా నెత్తురు. కిటికీలో నెత్తురు. ఎక్కడో లోపలనుంచి వస్తోంది రక్తం- పర్వత గర్భం నుంచి వచ్చే నది మాదిరి.

వెనక్కు తిరిగిచూచాడు విశ్వం. చీకటిగది (dark cell) తలుపు మూసేసి వెళ్ళిపోతున్నాడు కాపలా జవాన్. ఆ చిన్నిపాటి కిటికీలో పశ్చిమాకాశపు నెత్తుటి వెల్తుర్లూ ఎంతోసేపు ఆగలేక పోయినై. చీకటి చొచ్చుకొని వచ్చింది.

నెలరోజులు కస్టడీలో నానా హింసలూ పెట్టి, రహస్య స్థావరాల భోగట్టా సేకరించ శక్యం కాక విశ్వాన్ని సెంట్రల్ జైలుకు పంపివేశాడు డి.యస్.పి. ప్రతిరోజూ సాయంత్రం ఆకాశం దవడలో నెత్తురు, తన దవడల్లో నెత్తురు. ఇవాళ తుదిరోజు తుదిపాటు కసి తీరాకొట్టి జైలుకు పంపించేశారు. ఇహ రేపటి నుంచి రక్తం కనిపించదు.

హహహహా! చీకట్లో తనకు తానే నవ్వుకున్నాడు. దవడల్లో నుంచి వచ్చే నెత్తురు కనిపించకుండా చీకటి అడ్డంవచ్చింది.

ఏకాంతంలో, నిశ్శబ్దంలో, చీకటిలో కళ్లు మూసుకున్నాడు విశ్వం. చీకట్లో మళ్ళీ నవ్వాడు. పోలీసు బలగం తనముందు వోడిపోయింది. తన వొంటిలోనించి జారిపోయిన ప్రతి చుక్కా గెలిచింది. విరిగిన ప్రతి కీలూ గెలిచింది. గెరిల్లాల రహస్య స్థావరం సురక్షితంగా వుండిపోయింది. హహ్హహ్హ.

ఎన్నడూ లేనంత లోతుగా నిద్రపోయాడు విశ్వం. సూర్యగోళాన్ని తనవైపు లాక్కుంటున్నాడు. సూర్యుని చుట్టూ తిరిగే గోళాలన్నీ తన చుట్టు ప్రదక్షిణం చేస్తున్నై. బ్రహ్మాండపు లా అండ్ ఆర్డర్ పల్టీ కొట్టింది. ఇంక్విలాబ్ ! జిందాబాద్ ...!

చర్చిలూ, ట్రూమనూ ఆటం బాంబులతో నైజాం ఇంట్లో విందారగిస్తున్నారు. నల్లగొండ పల్లెటూళ్ళల్లో తల్లీ పిల్లా ఆకలి మంటల్తో 'ఇంక్విలాబ్' మంత్రం జపిస్తున్నారు.

నైజాం రాక్షసి నోట్లో నరనరంలో తిరుగుబాటు, రోమ రోమంలో విప్లవం కదులుతున్నది. జ్వరం! నైజాం రాజుకు జ్వరం! సన్నిపాతం, ఉన్మాదం, స్వతంత్ర హైద్రాబాద్!

డొక్క వెన్నంటిన పేదరైతు కళ్ళల్లో మిరుగుళ్ళను వూది వూది మంట చేసి కాగడా వెలిగించి కింకోటి శిఖరానికి నిప్పు ముట్టిస్తున్నాడు విశ్వం. నైజాం నరాల్లో చొరబడి రక్తాణువులకు తిరుగుబాటు బోధిస్తున్నాడు. నరాల నెప్పుల్ని సర్దుకోడానికి కత్తితో కండల్ని కోసుకుంటున్నాడు నైజాం. తెగిపోయిన కండరాలు నవ్వుతున్నాయి. హహ్హహ్హహ్హ.

నరాల్లో విశ్వం, విశ్వం వెంట విశ్వం.

చీకటిగదిలోకి వెలుతుర్లు తొంగితొంగి చూస్తున్నాయి. విశ్వం ఆవులించి లేచాడు. ఎండిపోయిన నెత్తురు చారల్ని తడుముకున్నాడు.

"బ్యారక్కులోకి పదండి" అన్నాడు కాపలా జవాను. విశ్వం చరచరా అతనివెంట నడిచాడు.

వీళ్ళంతా యెవరు?! వందలమంది బందీలు, కవులు, గాయకులు, విద్యార్థులు, రైతులు, కూలీలు, జమీందార్లు, షావుకార్లు, స్త్రీలు, వీళ్ళే దేశం. దేశమంతా రాజద్రోహులే? దేశాన్ని జైల్లో కట్టేశాడు నైజాం. ఈ జైళ్ళు పిడికిల్లైపోతై. ఆ గోడలు వీళ్ళను అడ్డలేవు. ఈ పోలీసుల కాపలా ఆగదు.

"మే యేడు వందలున్నాం, భయపడకేం!"

"అతని చేయి విరుచుకుంది నైజాం రాక్షసి"

"ఇతని కాలు నమిలేసింది."

"వీడి డొక్కలో ఏడుమాట్లు

నాటి కథ

కాల్చారు.''

"ఇతని భుజం యెగిరిపోయింది.''

"నీ దవడకు దెబ్బతగిలిందా?''

విశ్వం నిర్ఘాంతపోయాడు. తన దగ్గరనించి చాలా కొద్ది రక్తాన్నే తాగాడు నైజాం. వీళ్ళంతా బిందెలతో తాగించారు రక్తం. అమితంగా తాగి తందనాలాడు తున్నాడు నైజాం. తల తిరుగుతోంది. ఇహ కక్కేస్తాడు, పడిపోతాడు. ఈ రక్తం జీర్ణంకాదు. ఇమడదు.

విశ్వం జైలు సాంతం గబగబా తిరిగి చూచాడు. ఏడువందల మందికి వొకేవక నీళ్ళ పంపు. ఇందరూ స్నానం చేయాలి, గుడ్డలు వుతుక్కోవాలి. తాగాలి. అన్నిటికీ సరిపుచ్చుకోవాలి! కొండ దోమ కరిచిందా జ్వరం తప్పదు. నిజామాబాదు జైలు అచ్చంగా నరకం నీళ్ళనిండా పచ్చగా పాకుడు, క్రిములు. నీళ్ల లాగే మర వారానికి రెండుసార్లు చెడుతుంది. ఆ రోజుల్లా దప్పితో, ఆకలితో యేకాదశి గడపాలి. రెండు జొన్న రొట్టెలు ఆహారం. వాటిల్లో సున్నం, మన్ను, గడ్డి, ఇసుక. లోపల వుడకదు రొట్టె. పైన మాత్రం మాడుతుంది. పప్పు పులుసులో దుర్వాసన, పురుగులు, చెత్త. ఈ రెండు రొట్టెలు, గంటెడు పులుసుతో విటమిన్లన్నీ లభించాలి?

డిసెంట్రీ, మలేరియా, డయేరియా!

**నిజామాబాదు జైలు అచ్చంగా నరకం నీళ్ళనిండా పచ్చగా పాకుడు, క్రిములు. నీళ్లలా గేమర వారానికి రెండుపార్లు చెడుతుంది ఆ రోజుల్లా దప్పితో, ఆకలితో యేకాదశి గడపాలి. రెండు జొన్న రొట్టెలు ఆహారం. వాటిల్లో సున్నం, మన్ను, గడ్డి, ఇసుక. లోపల వుడకదు రొట్టె. పైన మాత్రం మాడుతుంది. పప్పు పులుసులో దుర్వాసన, పురుగులు, చెత్త.**

మందులు ఇండియా ప్రభుత్వం ఆపిందట. క్యూగ్ సల్ఫ్ సైతం లేదు. మండిపోతున్న ఎండకాలంలో మజ్జిగేది? లాట్రిన్‌ల నిండా రక్తం మడుగులు. దుర్గయ్య చనిపోయాడు డిసెంట్రీతో పాపం! పెళ్ళాం పిల్లలు జైలు గేటుముందు రెండు రాత్రులు యేడిచారు. శవం సైతం దొరక లేదు వాళ్ళకి,

బాధలకు భయపడకండి. గుండె బండ చేసుకోవాలి. ధైర్యం తెచ్చుకోవాలి. చావు చాలా చవక. బ్రతుక్కు బ్లాక్ మార్కెటు ధర. మనశ్శాంతికి, ఉత్సాహానికి 'వందేమాతరం' పాడుకుందాం.



"వందేమాతరం పాడావా చంపేస్తాం''

"నీకేం! మేం పాడుకుంటే?''

"హిందూ ప్రార్ధన మేం వినం''.

"ఇందులో హిందూ సమస్యే లేదు.''

"కాంగ్రెస్ కమ్యూనిస్ట్ అంతా హిందూలే''

"ఇదే మతోన్మాదం''

"ఖామూష్..''

"అసలు నీవీ బ్యారక్కులో యెందుకు?''

"ఇందులోనే వుంటా''

"అయితే మేం పాడుకుంటాం''

"ఏదీ పాడు, చూస్తా''

"వందే...'' పెళ్ళుతుంది విశ్వం దవడ మీద బలంగా కొట్టాడు ముస్లిం క్రిమినల్. మళ్ళీ సాగింది ఆగి పోయిన రక్తం, అర చేతితో తుడుచుకున్నాడు విశ్వం. క్రిమినల్ కళ్ళు యెర్ర గా వున్నాయి. బాగా తాగాడు. జైల్లో సారాయి?? జైలు అధికార్లే తాగించారు. ఏదో కుట్ర.

"ఇంక్విలాబ్ జిందాబాద్!'' విశ్వం గర్జించాడు. విశ్వం దవడ మీద మళ్ళీ కొట్టాడు క్రిమినల్. వెనకనుంచి క్రిమినల్ గూబ బద్దలైంది.

"హిందువులు నన్ను చంపుతున్నారు, రాండి! రాండి!'' అని గట్టిగా అరిచాడు క్రిమినల్,

"మేం సహాయంచేస్తాం'' లాఠీలతో, ఇనపసీకులతో ముస్లిం గుండాలు జైల్లోకి ప్రవేశించారు నిరాటంకంగా జైలుగేట్లన్నీ తెరుచుకున్నై. బారక్కు తలుపుల తాళాలు విడివడినై.

"పోలీస్! పోలీస్'' అని పిలుస్తో బ్యారక్కు అవతలకి పరిగెత్తాడు విశ్వం. ఫట్ విరుచుకోపడ్డాడు విశ్వం. తల మీద లాఠీ దెబ్బపడింది.

గూండాలు ఇనప సీకులతో, కర్రలతో బంధితుల్ని కొడుతున్నారు.

"వందేమాతరం-''

"అల్లాహెూ అక్బర్''

"ఇంక్విలాబ్-''

"సారే తకబీర్''

కల్లోల, కోలాహలం. నిరాయుధుల్ని, నిర్బంధితుల్ని, నిరపరాధుల్ని

నాటి కథ

కొడుతున్నారు. పడిపోయిన విశ్వాన్ని తొక్కుతూ గూండాలు పరుగెత్తి వస్తున్నారు. అరచేతితో తలమీది గాయం అదుముకున్నాడు విశ్వం. లేచి నుంచున్నాడు. ఘోరం జరుగుతున్నది. అనేకులు నేలకు వొరుగుతున్నారు.

"ఎదిరించి చావండి. ఇంక్విలాబ్ జిందాబాద్!" గర్జించాడు విశ్వం. గూండాల లాఠీలు రక్తం తాగుతున్నై. విశ్వం వొకగూండా నడుం మీద దూకాడు. వాడి లాఠీ గుంజుకున్నాడు. విసరడం ప్రారంభించాడు.

"లాఠీలు గుంజుకుని ఎదురు దెబ్బ తీయండి" అరిచాడు విశ్వం. పళ్లాలు, గ్లాసులు విసురుతున్నారు బందీలు, వాటి తాకిడికే గూండాల బుర్రలు గింగురుమంటున్నై. విశ్వం లాఠీ దెబ్బలకు ముగ్గురు పడుకున్నారు గూండాలు. మళ్ళీ ఆరుగురు గూండాలు విశ్వాన్ని చుట్టేశారు. ఇనపసీకుల దాడికి విశ్వం లాఠీ ఎగిరిపోయింది. ఫెట్! విశ్వం తలమీద ఇనపసేకు దెబ్బపడ్డది. కూలిపోయాడు విశ్వం. పిడుగు పడ్డటయింది. పడిపోయినవాణ్ణి కసి తీరా కొట్టి పారిపోయారు గూండాలు.

"దప్పి, దప్పి, ఇంక్విలాబ్" అంటున్నాడు విశ్వం. నీళ్లు లేవు. బ్యారక్కు నిండా రక్తం పరుచుకుంది. విశ్వం రక్తంలో దొర్లుతున్నాడు.

"గూండారాజ్ ముర్దాబాద్" యేడు వందల మంది యేక కంఠంగా అరిచారు. "ఇంక్విలాబ్ జిందాబాద్". విశ్వం నెత్తురులో దొర్లుతున్నాడు. దప్పి, దప్పి, నీళ్ళు లేవు, మందు లేదు.

"హహ్హహ్హహ్హ" పెద్దగా నవ్వాడు విశ్వం.

బ్యారక్‌లో రాజకీయ ఖైదీలు నలుగురు విశ్వం చుట్టు మూగారు. చీకటి!

"నవ్వుతావేం విశ్వం?"

"నైజాం వోడి పోయాడు"

"డైలెమా కమ్ముకుంటున్నది విశ్వానికి"

"దోసిట్లో నెత్తురు నింపుకోండి"

"విశ్వం!"

"హహ్హహ్హహ్హ"

"అట్లా నవ్వుతావేం?"

"మనం గెలిచాం..."

ఆకాశం నోరు తెరిచింది. నోటి నిండా నెత్తురు. విశ్వం వొంటి నిండా నెత్తురు రెండు వందల మంది నిస్సహాయుల రక్తంతో రంగులద్దుకున్న జైలుగోడల మీద సూర్యకిరణాలు మెరుస్తున్నాయి. నిరాయుధుల్ని హింసించిన గూండాల రాజభక్తికి ధైర్యసాహసాలకు అందిస్తున్నాడు అన్నాడు నైజాం కింగ్ కోటలో. భవిష్యత్తు దొంగచాటుగా తొంగితొంగి చూస్తున్నది నైజామును మ్రింగాలని.

నెత్తురు అంటిన రెండు అరచేతుల్నీ దగ్గరగా చేర్చుకుని పడి వున్నాడు విశ్వం. విశ్వం. దోసిట్లో కన్నీళ్ళు కార్చారు మిత్రులు.

నవ్వుతున్నాడు విశ్వం ఆకాశంలో సూర్యగోళం అతనిచుట్టూ నృత్యం చేస్తున్నది.

ప్రాగాకాశంలో రక్తాంజలి.

*సేకరణ : సంగిశెట్టి శ్రీనివాస్*

కవిత

# మహాకవి దాశరథి



**సూరారం శంకర్, 99489 63141**

నిప్పులకే చెమట చిచ్చు రగిలించెను దాశరథీ!
తెలంగాణ సృజన ఖ్యాతి వెలిగించెను దాశరథీ!

అడుగడుగున అగ్నిధార అణువణువున రుద్రవీణ
ప్రళయాగ్నుల ప్రణవంతో కెరలించెను దాశరథీ!

వడవడ వణికే రాతల నెగడుల పెనుఘాతంతో
నిరంకుశుల గుండెల్లో దడ రేపెను దాశరథీ!

చూపుకు సౌమ్యుడు కానీ, పట్టుదలకు రారాజు!
మోదుగు పూవుల జ్వాలల చెలరేగెను దాశరథీ!

ఒకటా రెండా శంకర్! తన కవనపు కృతి రేఖలు!
గజలై తెలుగున తెగువను కుప్పించెను దాశరథీ!

క
వి
త



# జయహో దార్శనికుడా.!!



నాంపల్లి సుజాత, 98480 59893

నవయువ కవీ..
దాశరథీ..!
మా మది ఫలకంపై
నువ్వెప్పటికీ చెరగని యాది.
మొదటిసారి తెలంగాణా తల్లిని
'కోటి రతనాల వీణా'
అన్నావు..!

నిరంకుశ నైజామ్
దాష్టీకాన్ని నిలువునా పాతరెయ్యాలనీ
పల్లె పల్లెనా పద నినాదమై
ఎలుగెత్తిన వైతాళికుడివి..!

గాయపడిన కవి గుండెల్లోంచి
పెల్లుబుకిన పద తూటాలే అవ్వి..!
తొలిదశ ఉద్యమం నుంచీ..
మలిదశ వరకే కాదు,
ఎప్పటికైనా
ప్రేరణ నింపే అక్షర శరాలవ్వి..!

తెలంగాణ విమోచన కోసం
ఆకులనీ బాకులుగా..
చీమలనీ చిరుతలుగా
కన్నీళ్ళనీ నిప్పుకణాలుగా
మార్చిందీ నువ్వే..!

దాశరథీ..!
కవితా పయోనిధీ..!!
నీ కలం నుంచి ఎగిసిపడిన
అగ్నిధారల ధగధగలే
రాచరికపు అరాచకాన్ని తుదముట్టించి
ఘోరీ కట్టించినయ్..
ఏక కాలంలోనే అంగారాన్నీ
శృంగారాన్ని ఒలికించిన
యోధుడవు..!

దాశరథీ..!
పాటల పయోనిధీ!!
పద్యాన్నే పదునైన ఆయుధంగా
మలచుకొని
ఆధిపత్యపు కోరలు పెకిలించిన
ధీశాలివి!
"ముసలి నక్కకు రాచరికం బేలనంటూ
దిగిపోవోయ్.. తెగిపోవోయ్..!"
అని గర్జించిన కొదమ సింహం
నువ్వేనోయ్ మా దాశరథీ..!!

రామాయణ కుటుంబంలోంచి
వచ్చావ్ అయినా..
మహాభారత యుద్ధాన్నే చేసావ్
కష్టాలను సుఖాలను
ఏకరీతిన స్వీకరించిన స్థితప్రజ్ఞుడివి.!

స్వేచ్ఛా..
సమానత్వాలనే స్వప్నించావ్
అందుకే
కరకు రాతి జైల్లల్లో మగ్గిపోయావ్
బొగ్గు ముక్కలతోనే
కారాగార ప్రాకారాలకు ధిక్కారాలను
అద్దినవ్ .!

మీ కాలంలో నేను పుట్టలేదు గానీ,
ఆ గడ్డమీదే జన్మించాను
మీ జ్వాలల దగడుని
దగ్గరనుంచీ అందిపుచ్చుకున్నాను
మీ ఆకాంక్షల్లోంచి
ఉదయించిన తెలంగాణాకు
ఇప్పుడు పునర్నవం..!!
దాశరథీ..! త్రికాలాల దార్శనికుడా
నీకు జయహో..!!

వ్యాసం

# ఆధునిక పద్య విద్యాస్ఫూర్తి కేంద్రం - దాశరథి

సందర్భోచిత పద్యాలని విప్పి చెప్పిన వ్యాసం...




దోరవేటి
89788 71961


'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించిన తారకమంత్రం. తెలంగాణ సాధనలో విజయపతాకం. నవయువ కవితాశరధి దాశరథి సంధించిన బ్రహ్మాస్త్రం!

అభ్యుదయ కవిగా తిమిరంతో సమరం చేసినా; తెలుగువాళ్ళంతా ఒక్కటిగా ఉండాలంటూ మహాంధ్రోదయ గీతమాలపించినా; ప్రేమ సరస్సులో గాలిబ్ గీతాలతో ఓలలాడినా; ఆలోచనా లోచనాలతో లోకం తీరుకు ఎక్సరేలు తీసినా; మహాబోధినిచ్చి, అహింసపై ధ్వజమెత్తినా; చలనచిత్ర గీతాలలో సాహితీ సుగంధం వెల్లివిరిసేలా చేసినా దాశరథి ప్రధానంగా, ప్రాథమికంగా పద్యకవి. ప్రజల నాలుకల మీద నర్తించి, వట్టికోట హృదయ ఫలకం మీద ముద్రించి, జైలుగోడలకు విప్లవ ప్రకంపనలను రుచి చూపించిన తెలుగుతేజం- తెలంగాణ తేజం... దాశరథీ కృష్ణమాచార్య.

తెలుగు సాహిత్యంలో చెరగని సంతకం దాశరథి కలం నుండి వెల్లువెత్తిన పద్యసంపద అగ్నిధారగా కురిసింది. రుద్రవీణగా నినదించింది; మహాంధ్రోదయమై మార్మోగింది; అమృతాభిషేకమై అలరించింది; మహాబోధిగా నిలిచింది; దాశరథీ శతకమై సందేశాన్నందించింది.

ఆయన పద్యం అగ్నికన్నా తేజోవంతమైంది. గాలికన్నా వేగవంత మైంది. సముద్రం కన్నా ఉద్వేగభరిత మైంది. భూమికన్నా సంయమనశీలమైంది. ఆకాశం కన్నా విశాలమైంది. ప్రకృతిలో లయమైన ప్రేమాస్పదమైంది.

## అగ్నిధార...

1949లో విడుదలైన దాశరథి తొలి ఖండకావ్యం అగ్నిధార. చండూరు సాహితీమేఖల వారు ప్రచురించిన ఈ గ్రంథం 48 కవితలతో తెలుగువారి హృదయాల మీద చెరగని ముద్ర వేసింది. నిజాం నిరంకుశత్వాన్ని నిలదీసిన ఒక బొగ్గుముక్కగా నిలిచి, జైలుగోడలను గడగడలాడించిన పద్యాలు ఇందులో ముకుటాయమానమై నిలిచినాయి.

*'ఓ నిజాము పిశాచమా కానరాడు*
*నిన్ను బోలిన రేడు మాకెన్నడేని*
*తీగెలను త్రెంచి అగ్నిలో దించినావు*
*నా తెలంగాణ కోటి రత్నాల వీణ!'*

('రతనాల వీణ' అంటుంటారు చాలామంది. అట్లా పలికితే యతిభంగం, గణభంగం అవుతుంది.)

తెలంగాణ కల (నిజాం పాలన విముక్తి) సాకారమైన తర్వాత (1949న) విడుదలైన ఈ గ్రంథానికి దేవులపల్లి రామానుజరావు ముందుమాట నందించినారు.

*'ప్రాణములొడ్డి ఘోర గహనాటవులన్*
*పడగొట్టి, మంచి మా*
*గాణములన్ సృజించి, యెముకల్*
*నుసి జేసి పొలాలు దున్ని భో*
*షాణములన్ నవాబునకు స్వర్ణము*
*నింపిన రైతుదే! తెలం*
*గాణము రైతుదే! ముసలి నక్కకు*
*రాచరికమ్ము దక్కునే?!'*

అంటూ ప్రజల గొంతుకయై గర్జించి నాడు కవీంద్రుడు.

'అంతర్నాదం' అనే ఖండిక దాశరథీ మహోగ్రపర్జన్య గర్జనకు విశ్వాంతరాళమై నిలిచింది...

*'నా గీతావళి యెంత దూరము*
*ప్రయాణంబౌనొ; అందాక ఈ*
*భూగోళంబున కగ్గి వెట్టెదను నిప్పుల్*
*వోసి హేమంత భా*
*మా గాంధర్వ వివాహమాడెదను;*
*ద్యోమణ్యుష్ణ గోళమ్ముపై*
*ప్రాగాకాశ నవారుణాస్త్ర జలధారల్*
*చల్లి చల్లార్చెదన్!!'*

అంటూ ఆవేశానికి అక్షరాన్ని తొడిగి ఆర్తుల, దు:ఖితుల, తాడిత, పీడిత జనం పక్షాన నిలిచి నిజాం పాలనపై విరుచుకుపడ్డాడు.

తొలి కావ్యంతోనే తన కవితాశక్తిని లోకం నిబిడాశ్చర్యంలో మునిగి తననే వీక్షించేలా చేసుకున్న అనుపమాన ప్రతిభాసంపన్నుడు దాశరథి.

ఈ ఖండకావ్య సంపుటిలో ఐదు లయానుగుణమై కవితలు (గేయాలు)

ఉన్నాయి. వాటిలో ప్రముఖమైంది ప్రశ్నార్థకం శీర్షిక (?)తో ఉన్న 'ఆ చల్లని సముద్రగర్భం' ఒకటి.

ఈ గ్రంథాన్ని- జైలులో తన ప్రాణాలు కాపాడిన ప్రాణమిత్రుడు, తన పద్యాన్ని ప్రాణంగా ప్రేమించిన మిత్రుడు, ఉద్యమం కోసం ప్రాణాలర్పించడానికి వెనుకాడని మిత్రుడు వట్టికోట ఆళ్వారు స్వామికి అంకితం ఇస్తూ- మిత్రుని కోసం కంఠం ఇవ్వగలవాడు- మంచికి పర్యాయపదం- పదమూడవ ఆళ్వారు (ఆళ్వారులు 12 మంది) మా వట్టికోటకు.. అంటూ పేర్కొనడం వారిద్దరి అనుబంధానికి తీయని జ్ఞాపకం.

**రుద్రవీణ....**

నిరుపేదల బీదరికాన్ని నిశ్శేషం చేయడం కోసం కోటిరాగాల 'రుద్రవీణ'ను మ్రోగించి, తెలంగాణ తల్లికి అంకితం చేసినాడు దాశరథి. ఈ కావ్యం 1950లో ప్రభవించింది. 16 కవితా ఖండికలతో 30 పేజీలలో ముద్రితమైన అలఘు కీర్తిగన్న లఘుకృతి 'రుద్రవీణ'. ఇది 1950లో ముద్రితమైంది. 'స్వతంత్ర' తదితర పత్రికలో ప్రచురింపబడిన ఖండకావ్య సంపుటి ఇది. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' పద్యాలు ఇందులోని అంకిత పద్యాలే. అందులో నుండి ఒకటి-

*'వేస్తంభముల గుడి వ్రాయించుకొన్నది*
*నాచేత ఏకశిలా చరిత్ర*
*వీర రుద్రమదేవి వినిపించుకొన్నది*
*నాచేత జన్మజన్మాల కథలు*
*పోతన్న కవి కలబోయించుకొన్నాడు*
*నాచేత నేటి ఆనాటి కవిత*
*మునునూరి కాపన్న మ్రోయించు కొన్నాడు*
*నాచేత క్రాంతివీణాచయమ్ము*
*నాకు తల్లివి నీవు, నే నీకు సుతుడ;*
*నల్ల నాటికి నేటికి ననుదినమ్ము*
*మ్రోయుచున్నావు నా గళమ్మున, కలాన*
*నా తెలంగాణ! కోటి రత్నాల వీణ!'*

దాశరథి అనుక్షణం పేదల, ఆర్తుల దు:ఖితుల అభ్యున్నతి కోసం పరితపించి నాడు. అందుకోసం నిజాం రాజునే కాదు, దేవుని రాతనూ ప్రశ్నించినాడు.

*ఈ కొరగాని లోకమున కిప్పుడె నిప్పు రగిల్చి, కాల్చి, నా*
*లో కదలాడు నూహలకు రూపమొసంగి పునస్సృజింతు న*
*ట్లాకట గుందు పేదలకు బ్రహ్మ లిఖించిన కొంటె వ్రాత లో*
*వ్యాకరణమ్ము లేదు! రసభంగిమ కానగరా దదేలనో!*

దేశమంతా స్వాతంత్ర్య గీతాలాపనలో ఓలలాడుతుంటే తెలంగాణ ఇంకా నిజాం రాజు ఉక్కుపిడికిలిలో విలవిలలాడు తుండటాన్ని సహించలేని ఈ మహాకవి నిజాం రాజును 'ముసలి నక్క' అంటూ ఆక్షేపించడం ఆనాటి జనసామాన్యం సంధించిన ప్రశ్నగా గుండె లోతుల నుండి ఈవిధంగా దూసుకొచ్చింది.

*'తరతరాల స్వప్నాల సుందరఫలమ్ము*
*స్వైర భారతభూమి చూపడెనా లేదా!*
*విషము గుప్పించినాడు; నొప్పించినాడు*
*మా నిజాం రాజు జన్మజన్మాల బూజు!*
*(ముక్త భూమి)'*

'అగ్నికుంకుమ' శీర్షికలో ఒక కూలీ వనిత కష్టాన్ని చూసి, ఆవేదనతో ఈవిధంగా స్పందించినాడీ కవిసింహం...

*'వ్రాసి వ్రాసి పొత్తమ్ములు మాసి, నా క*
*లమ్ములో సిరా ఇంకి రక్తమ్ము పోసి*
*అరుణ తరుణాక్షరాల కావ్యాలు కూర్చి*
*ఆకలికి మాడిపోయెద నీకొరకయి'*

రక్త రంజితమ్మయిన ప్రాచీ దిశను చూసి రుద్రవీణా తంత్రిని నిర్నిద్రంగా మీటిన హృదయ కవీంద్రుడు దాశరథి- రైతుల గాథను ఇలా నినదించినాడు...

*'నాగటిచాళ్ళలో*
*నడిచే రైతులారా!*
*మీ నిశ్శబ్ద గళాలు పాడిన*
*గీతారహస్యాలను*
*బధిర లోకానికి వినిపించే*
*నా రుద్రవీణ, ఇదో!'*

అన్న ఆ మహా కవితారథి దాశరథి శరధి వంటి ఆక్రోశం ఆలోచించదగినది.

'మహాంధ్రోదయం'

*'చిమ్మచీకటిలో తూర్పు సెమ్మె మీద*
*దివ్వె యొక్కటి వెలిగించి రువ్వినావు*
*వెలుతురుల బాకు నాకాశ వీధిలోన*
*ఎవరవయ్యా? ప్రగాఢ సాహిత్యమూర్తి!'*

అంటూ చేయెత్తు మనిషి సురవరం ప్రతాపరెడ్డి మహాశయునికి దాశరథి చేయెత్తి జేకొడుతూ అంకితమిచ్చిన గ్రంథం 'మహాంధ్రోదయం'.

1955లో విడుదలైన ఈ కావ్యం (ఖండకావ్య సంపుటి)లో మొత్తం 20 ఖండకావ్యాలున్నాయి. తెలంగాణ












రచయితల సంఘం ఈ పుస్తకాన్ని ముద్రింపజేసింది. తెలుగువాళ్ళందరూ కలిసి స్వాతంత్ర్య ఫలాల ననుభవించాలన్న ఆకాంక్ష ప్రతిఫలిస్తుంది. ఐనా, తెలంగాణ అస్తిత్వం, ఇక్కడి సామాజిక, రాజకీయ పరిస్థితులకు సంబంధించిన ఖండకావ్యాలున్నాయి. తెలంగాణ, కోటి గొంతుకలు, మంగళగీతి, పూలలో జ్వాలలు, తెలంగాణ విముక్తి, తెలంగాణ తల్లి, కాపయనాయకుడు, మూర్ఛన, మంజీర, సాహిత్య సామ్రాజ్యము.. మొదలైనవి.

తొలి ఖండిక 'తెలంగాణ'లో

*'కోటి తెలుగుల బంగారు కొండ క్రింద*
*పరచుకొన్నట్టి సరసులోపల వసించి*
*ప్రొద్దు ప్రొద్దున అందాల పూలు పూయు*
*నా తెలంగాణ తల్లి కంజాత వల్లి!'*

అంటూ అందమైన నాలుగు తేటగీతులతో తెలంగాణ తల్లిని అర్చించినాడు దాశరథి.

'మహాంధ్రోదయం' కవితలో పద్యం చాలామంది తెలుగువాళ్ళకు కంఠపాఠం...

*'నేనురా తెలంగాణ నిగళాలు తెగ్రదొబ్బి*
*ఆకాశమంత యెత్తరచినాను*
*నేను రాక్షసి గుండె నీరుగా పద్యాలు*
*పాడి, మానవుని కాపాడినాను*
*నేను వేస్తంభాల నీడలో నొక తెల్గు*
*తోట నాటి సుమాలు దూసినాను*
*నేను పోతన్న చిందిన సుధా విప్రుష*
*మ్ములు నా కలమ్ములో బోసినాను*
*కోటితమ్ముల కడ రెండు కోట్ల తెల్గు*
*టన్నలను గూర్చి వృత్తాంత మందజేసి*
*మూడు కోటుల నొక్కటే ముడి బిగించి*
*పాడినాడ మహాంధ్ర సౌభాగ్యగీతి!'*

(కొంతమంది 'తెగగొట్టి' అని పలుకుతారు. ఆయన పుస్తకంలో 'తెగ్రదొబ్బి' అనే ఉంది.)

దాశరథి సువిశాల హృదయానికి ఇది ప్రతీక. ఆయన అస్తిత్వానికి అద్దం. తెలంగాణను రాక్షస పాలన నుండి విముక్తం చేయడం; అద్భుతమైన పద్య సృజన గావించడం; పోతన ఒరవడిని సాధించడం; తెలుగువాళ్ళ నందరినీ ఒక్క గొడుగు కింద చూడాలనుకోవడం.. తదనంతరకాలం ఆయన మనసును కొంత కకావికలం చేసినా, ఆజీవనం ఆ ఆంధ్ర కవితా సారథి తన సిద్ధాంతాలను కాపాడుకున్నాడు.

'మంగళ గీతి' కవితలో మంగళాంగుడైన సర్వమంగళుని గురించిన పద్యం హృద్యంగమంగా ఉంటుంది-

*'మంగళగీతి పాడెద హిమాచల శృంగ సరత్ సూరాపగా*
*భంగ తరంగ రంగముల*
*పాదములూని నటించు బాల సా*
*రంగధరున్ వినీల చికురమ్ములలో ధరియించినట్టి భ*
*స్మాంగుని ఫాలనేత్రము నవాగ్ని కణమ్ముల జిమ్ము దారులన్'*

సారంగధరుని (జింకను ధరించిన చంద్రుని) వినీల చికురమ్ములలో (నల్లని వెంట్రుకలలో) ధరించిన పరమశివుని మూడోకన్ను కొత్త నిప్పురవ్వలను చిమ్మే దారిలో హిమాలయ శిఖరినుండి ప్రవహించే దివ్యగంగ అభంగ తరంగాల మీద నర్తిస్తుండగా మంగళగీతం పాడుతానని వర్ణించడం ఈ కవితాశరధికే చెల్లుతుంది. సంప్రదాయాన్ని, అభ్యుదయాన్ని రెండు కళ్ళు చేసుకొని సమసమాజ దృష్టితో గమించిన దార్శనికుడాయన.

సాహిత్యంలో శాంతి సామ్రాజ్య స్థాపన కోరుతూ-

*'ఏనాడెవ్వడు కత్తితో గెలువలే దీవిశ్వమున్; ప్రేమ పా*
*శానన్ కుట్టుము నాలుగుంబది ప్రపంచాలన్; మహాత్ముండిదే*
*జ్ఞానోద్బోధము సేసె, నెవ్వడు వినెన్? సాహిత్య సామ్రాజ్య మం*
*దైనన్ కొంతగ శాంతి పాడుకొననిమ్మా! నీకు పుణ్యంబుగున్'*

(సాహిత్య సామ్రాజ్యము)

1336-37 ప్రాంతంలో ఓరుగల్లును మహమ్మద్ బిన్ తుగ్లక్ నుండి విముక్తి చేసిన కాపయ నాయకుడంటే దాశరథికి ప్రత్యేకాభిమానం. 'కాపయ నాయకుడు' శీర్షికలో....

*'ఎవ్వడవీవు? నీదు గళమే ఒక 'ఖం'గను కంచుగంటయై*
*రువ్వె భయంబు శాత్రవుల రుగ్ణమనంబులలో సతంబు; మా*
*బువ్వకు లేని పేదలకు బొజ్జలు నింపినవాడ వీవు; ని*
*న్నెవ్విధి కాలదేవి మరపించెనురా? చరితార్థ జీవి నిన్'*

అంటూ చరిత్ర విస్మరించిన మహాపురుషుని కీర్తిస్తాడు. (రుగ్ణ = రోగగ్రస్థమైన మనసులు- అనే అరుదైన ప్రయోగం గమనించదగినది.)

ఇంత విశిష్ట కావ్యానికి సుప్రసిద్ధ పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు సుదీర్ఘ పీఠిక లిఖిస్తూ- "మూర్తీభవించిన తెలుగుతనమే దాశరథి. అతడు మహాంధ్రోర్వర నున్న తెలుగువారి కందరికి మంగళాశాసనముగా సమర్పించుచున్న ఉపద" అంటూ మహాంధ్రోదయానికి కితాబిచ్చినాడు.

## అమృతాభిషేకం...

1953లోనే తెరసం (తెలంగాణ రచయితల సంఘం) అధ్యక్షులుగా బాధ్యతలను తలకెత్తుకున్న దాశరథి ఆ వేదిక నుండి చారిత్రాత్మకమైన ఘట్టాలెన్నో ఆవిష్కరించినాడు. 1959లో విజయవాడ క్వాలిటీ పబ్లిషర్స్ ప్రచురించిన 'అమృతాభిషేకం' బెజవాడ గోపాలరెడ్డి గారికి అంకితమీయబడింది. ఇది వర్ణన ప్రధానమైన ఖండ కావ్య సంపుటి. మొత్తం 17 శీర్షికలు గల ఈ గ్రంథంలో దాశరథి కవన విశ్వరూపం దర్శనమిస్తుంది. ఇది పాతకొత్తల మేలు కలయిక.

కాదేదీ వర్ణన కనర్హమన్న రీతిలో సాగిన ఈ గ్రంథంలో చీకటిని గురించి 'తామసి' శీర్షికలో...

*'ఇరులు నిశాసతీ భుజములెక్కి, శిరమ్మున నిక్కి, తారకా*
*తరుణి కపోల పాళికలు తాకి, విహాయస వీధి ప్రాకి, చం*
*దురుపయి సోకి, భూమిధర దుర్గమ వీధుల దూకి, మెల్లగా*
*ధరపయి కాలుమోసిన వుదారములై హరినీలకాంతులన్'*

అంటూ చీకటి విస్తరించిన విధం అంత్యానుప్రాసలతో మనోజ్ఞంగా చిత్రించినాడు. అట్లాగే గ్రీష్మం నుండి వర్షఋతువులోకి ప్రవేశించడాన్ని 'జలద సరస్వతి'ని చేసి ఈవిధంగా ఆరాధించినాడు-

*'అదిగో! పశ్చిమవార్ధి సాచిన కరంబై మేఘమే వచ్చుచు*
*న్నది, మార్తాండుని చేయి పట్టుకొని పంతంబార కొంపోవుచు*
*న్నది; గ్రీష్మాతప తప్యమాన జన చింతాస్వాంతముల్ శాంతిలున్*
*గద! నీలాంబుధర ప్రమోదకర తద్గర్జాని నాదమ్ములన్'.*

ఈ గ్రంథంలోని చివరి శీర్షిక 'అమృతాభిషేకము'తో తన కవితాంజలితో తెల్గు శారదకు ఇట్లా అమృతాభిషేకం చేసినాడు...

*'పూలతో పండ్లతో నవ నాళికేర*
*జలముతో శుక పిక కలకలము తోడ,*
*అరుగుదెంచె నుగాది సుందరి, మహాంధ్ర*
*కవిత కమృతాభిషేచనోత్సవము జరుప'*

**మహాబోధి...**

దాశరథి కలం నుండి జాలువారిన శాంతి సందేశ కావ్యం 'మహాబోధి' దీన్ని తెలంగాణా రచయితల సంఘం ప్రకటించింది.

నిజాం రాష్ట్ర ఏకైక ముఖ్యమంత్రి శాంతి సౌజన్యమూర్తి డా॥ బూర్గుల రామకృష్ణారావుగారికి ఈ గ్రంథాన్ని అంకితం గావిస్తూ దాశరథి సుదీర్ఘ అంకిత పద్యాల సమర్పణతో పాటు సంప్రదాయ షష్ఠ్యంతాలు కూడా రచించినాడు.

*'రాజ్యపాలనమున ప్రజా రక్షణమున*
*సాహితీరంగమున కళాసరణిలోన*
*సార్వభౌమత్వము గడింప జాలి తీవు*
*కృష్ణ రాయడవే రామకృష్ణరాయ!'*

అంటూ మనసారా వినుతించినాడు.

అందుకు తగినట్లే చక్కని చిక్కని పద్యంతో తన కృతజ్ఞతలను చాటుకున్నాడు బూర్గుల-

*'నీ కవితా ప్రశస్తి రజనీకర చారు మయూఖ పుంజముల్*
*ప్రాకెను యావదాంధ్రమున ప్రాజ్ఞులు మెచ్చగ బౌద్ధగాథలన్*
*గైకొని యల్లినట్టి నవ కావ్య వధూటిని సాదరంబుగా*
*నా కిడినావు, ధన్యుడను నవ్యత దాశరథీ! కవీశ్వరా!'*

మహాబోధి సందేశాన్ని ప్రకటించే పద్యం....

*'అజ్ఞాన పశుచ్ఛేదన*
*యజ్ఞమ్మున గాక లోకు లన్యోపాయా*
*భిజ్ఞత గడతేరుదురే?*
*విజ్ఞుడు బుద్ధుండు, వాని వినుడు శుభంబౌ'*

**దాశరథీ శతకము...**

'దాశరథీ శతకము' పేరు వినగానే ఎవ్వరికైనా గుర్తొచ్చేది కంచర్ల గోపన్న విరచిత భక్తి మందారమైన దాశరథీ శతకమే. అదే మకుటంతో, అదే పేరుతో మన దాశరథి కృష్ణమాచార్య రచించిన సామాజిక శతకమిది. ఇందులో సమకాలీన సామాజికాంశాల మీద సునిశిత విమర్శ, వ్యంగ్యం కనిపిస్తుంది. చాలా విషయాలు ఇప్పటికీ ఎంతో తాజాగా అనిపిస్తాయి. చూడండి...

*'ఎవ్వడు గట్టిగా అరచు; నెవ్వడు మోసము సేయజాలు; నిం*
*కెవ్వడు కాళ్ళు పట్టుకొనియే క్షణమాత్ర గ్రహించు జుట్టు; నా*
*డివ్వసుధా స్థలిన్ గణుతికెక్కు దురంధరు డంచు- వానికిన్*
*తవ్వలకొద్ది రవ్వలుగ దాశరథీ! కరుణాపయోనిధీ!'*

అంటూ అవకాశవాదులను అందలమెక్కించే స్థితిని ఎండగడతాడు.

*'ఓటుకు పచ్చనోటు నిడ నోపిన వాడె ప్రశాసకుండగున్*
*నోటున కోటు నమ్ముకొని నోటికి తాళము వేసుకొన్న మా*
*బోటి దరిద్ర మానవుల పొట్టను పెట్టుకొనంగవచ్చు, నా*
*తాటకి నెట్లు కూల్చెదవొ? దాశరథీ కరుణాపయోనిధీ!'*

ఓట్ల పాట్లు, నోట్ల పోట్లు ఈనాటివి గావని నమ్మక తప్పని నిజం. ఆ ఎన్నికల తాటకిని సంహరించుమని ఆ దాశరథినే ప్రార్థించినాడు.

తన దాశరథి శతకానికి ఫలశ్రుతి వంటి ఆకాంక్షను ఈ పద్యంలో గమనించవచ్చు...

*'డబ్బును మట్టి బెడ్డ వలె, డాంబిక వృత్తిని పాతగుడ్డగా,*
*గుబ్బల సౌరు రబ్బరునకున్ సరిగా, అధికార వాంఛితున్*
*బెబ్బులిగా, కళావిదుని పెద్దగా చూచెడి మంచి కాలమున్*
*దబ్బున తెచ్చిపెట్టగదె! దాశరథీ కరుణాపయోనిధీ!'*

ఇటువంటి మంచికాలం కోరుకోవడం ఈనాటికీ కొనసాగుతున్నది. మొన్నటి దాశరథి శతకకర్త గోపన్న కాలంలో, నిన్నటి దాశరథీ శతకకర్త దాశరథి కాలంలో, నేటి అభినవ దాశరథి (దోరవేటి) కాలంలో, రేపటి మరో దాశరథి (?) కాలంలో... మనం ఆశాజీవులం. ఈ చర్విత చర్వణ పరిస్థితులలో పావులం!

సినిమా పాటల్లో సాహిత్యం గుబాళింపజేసినా, తిమిరంతో సమరం ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం స్వీకరించినా, ఆస్థాన కవిగా దర్జా ఒలకబోసినా, కవిసింహ, మహాకవి, అభ్యుదయ కవితా చక్రవర్తి, కళాప్రపూర్ణ, ఆంధ్ర కవితా సారథి... అనే బిరుదులెన్ని వహించినా, దాశరథి ఉనికి, ఉన్నతి పద్య కవిత్వంతోనే ముడివడి ఉన్నాయనేది నిర్వివాదాంశం. తల్లి ఒడిలో తెలుగును, తండ్రి జడిలో సంస్కృతాన్ని, సర్కారు మదర్సా బడిలో ఉర్దూను.. త్రివేణీ సంగమంగా చేసుకొని కవితా త్రివిక్రముడుగా ఎదిగిన దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ ఆధునిక పద్యచిహ్నం. నాలాంటి కవులకెందరికో స్ఫూర్తి కేంద్రం.

*'పేదల దీనదు:ఖితుల వేదన జూచిన నోర్వలేక, మ*
*ర్యాద నతిక్రమించిన యరాచకతన్ దునుమంగ 'అగ్ని' ధా*
*రా' దమన క్రమంబుగ ధరాతలి నెల్లను గాల్తునన్న సం*
*పాదిత విక్రమోజ్వలన భాసుర! దాశరథీ నమోస్తుతుల్!'*

కవిత

# సుధీ దాశరథీ



మరుమాముల దత్తాత్రేయ శర్మ, 94410 39146

దాశరథీ సుధీ! ఘననిదాఘ పరీవృతమైన గమ్యమున్
కౌశలమొప్పగా నెగడి కాంతులు నింపితి వెంతవింత? స
త్యాశయ సాధనామయ మనంత ప్రభావిభవంబు నవ్య భ
వ్యాశుగ పద్యదీధితుల యగ్నులురాల్చితి విందుకా కవీ?

ఓకవీ! రసవీధుల ఊహలందు
తేలిపోవుచు సౌందర్యతీర్థమాడు
కావ్యకన్యల చెక్కిళ్ళ కళలదీర్చు
కొనక నీకేల కొరకంచుకొనలవెతలు?

నీగీతావళి ఎంత దూరము ప్రయాణించున్ యథాకామివై
భూగోళమ్మున కగ్గిపెట్టితివిగా భూపాలముల్ పాడుచున్
జేగీయంబుగ పద్యమల్లెదవు గాసింబొందు ఈజాతికిన్
రాగార్ద్రీమయ రుద్ర వీణనవ జాగ్రత్తేజ మందించుచున్.



దిక్కులొక్కటిజేసి తెలుగుతెగువజూపి
        రాజుబూజును దుల్పు తేజమీవు
నిప్పు జెండానెత్తి కుప్పించియెగసిన
        భాషకందని ప్రజా ఘోషవీవు
అంగారమొకకంట శృంగార మొకకంట
        కురిపించి మరపించు గుణివినీవు
వేదనల్ దిగమింగి వేకువల్ ప్రకటించు
        గరళకంఠునిబోలు కవివినీవు

నీవు కలగన్న తెలగాణ నిలిచెచూడు
వేలరాగాల రతనాల వీణయగుచు
నీవు స్వప్నించు నీనేల నెగ్గనేడు
భరతజాతిని శాసించు ప్రతిభతోడ

కవితాపుష్పక మెక్కి నిల్చితివి ధిక్కారమ్ములే శ్వాసగా
నవిరామమ్ముగ నగ్నిధారలిటులాహ్వానించి తున్మేషివై
నవనీతంబిడ వాగ్మధూదయపు ప్రజ్ఞారాశి మంథించు చ
వ్యవధానంబుగ కావ్యసత్ఫలము మాకందించు నీకంజలుల్.

సాహితీ శిఖరం

1971 నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత

# సముద్ర కవి...

# పాబ్లో నెరుడా





పాబ్లో నెరుడా 1904 జూలై 12న జన్మించాడు. ఆయన ఒక స్పానిష్ కవి, రాజకీయ నాయకుడు. చిలీ దేశస్తుడు. ఇతనిని నోబెల్ పురస్కారం 1971 లో వరించింది. అంతర్జాతీయ శాంతి బహుమతి (1950), స్టాలిన్ శాంతి బహుమతి (1953) ఈ రెండు బహుమతులు పాబ్లో నెరుడాను వరించాయి. ఇతని అసలు పేరు నెఫ్తాలి రికార్డో రేయిస్ బసాల్టో. పాబ్లో నెరుడా అన్నది ఇతని కలం పేరు. తరువాతి కాలంలో తన పేరును పాబ్లో నెరుడాగా మార్చుకున్నాడు. సముద్రం ఇతని కవిత్వంలో అంతర్భాగం. అందుకే ఇతనిని సముద్ర కవి అనికూడా అంటారు. నెరూడా తండ్రి తన కొడుకు రచనలను, సాహిత్యంపై ఆసక్తిని వ్యతిరేకించాడు. అయితే అతను భవిష్యత్ నోబెల్ బహుమతి విజేత గాబ్రియేలా మిస్ట్రాల్‌తో సహా ఇతరుల నుండి ప్రోత్సాహాన్ని అందుకున్నాడు. 18 జూలై 1917న, 13 సంవత్సరాల వయస్సులో, అతను స్థానిక దినపత్రిక లా మనానాలో తన మొదటి రచన, "ఎంటూసియాస్మో వై పట్టుదల" ("ఉత్సాహం మరియు పట్టుదల") అనే వ్యాసాన్ని ప్రచురించాడు పాబ్లో నెరుడా పదేళ్ల వయసులో కవిత్వం వ్రాసిన నెరుడాసర్రియలిజం, చరిత్ర సంఘటనలు, రాజకీయ ప్రణాళికలు, జీవిత చరిత్ర, ఉద్వేగభరితమైన ప్రేమ కవితలు వ్రాసినాడు. ఆకుపచ్చటి సిరాతో తన రచనలు చేసిన 'నెరుడా' కోరికకు, ఆశకు చిహ్నంగా దానిని భావించినాడు. 1971లో నోబెల్ బహుమతిని అందుకున్న 'పాబ్లో నెరుడాను చిలీ జాతీయ కవిగా పరిగణిస్తారు. 1923లో, అతని మొదటి పద్య సంపుటి, క్రెపస్క్యూలారియో (బుక్ ఆఫ్ ట్విలైట్స్), ఎడిటోరియల్ నాస్సిమెంటోచే ప్రచురించబడింది, తరువాతి సంవత్సరం వెయింటె కవితాస్ డి అమోర్ వై ఉనా కాన్సియోన్ డెస్పెరాడా (ఇరవై ప్రేమ కవితలు మరియు ఎ డెస్పరేట్ సాంగ్) ద్వారా ప్రచురించబడింది. అతని రచనలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. కొలంబియన్ నవలా రచయిత గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్ ఒకప్పుడు అతన్ని "ఏ భాషలోనైనా 20వ శతాబ్దపు గొప్ప కవి" అని అభివర్ణించాడు. ప్రసిద్ధ విమర్శకుడు హెరాల్డ్ బ్లూమ్ తన పుస్తకం ది వెస్ట్రన్ కానన్‌లో పాశ్చాత్య సంప్రదాయానికి కేంద్ర రచయితలలో ఒకరిగా నెరూడాను చేర్చాడు. 1971లో, నెరూడాకు నోబెల్ బహుమతి లభించింది. మరుసటి సంవత్సరం, స్ట్రూగా పోయెట్రీ ఈవినింగ్స్‌లో నెరూడాకు ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ రీత్ అవార్డు లభించింది. ఆయన 1973 సెప్టెంబరు 23న మరణించాడు. 'పాబ్లో నెరుడా' అంత్యక్రియలలో వేలాదిమంది చిలియన్లు ప్రభుత్వ నిర్బంధాల్ని, కర్ఫ్యూ ఆజ్ఞలను ధిక్కరించి పాల్గొన్నారు. నెరూడా తన జీవితంలో ఎక్కువ భాగం సీతాకోకచిలుకల పట్ల ఆకర్షితుడయ్యాడు. 1976లో, దక్షిణ అమెరికాలోని హెలికోనియస్ జాతికి చెందిన ఒక ఉప-సమూహానికి అతని పేరు పెట్టారు. అతని గౌరవార్థం మెర్క్యురీపై ఉన్న ఒక బిలం నెరుడా అని కూడా పిలువబడుతుంది.

కథ

# జాతస్య మరణం ధ్రువం

మనిషి భావుకతకు ప్రతిరూపం...



కూరెళ్ల పద్మాచారి
98855 87783

ఎప్పటిలాగానే ఊహలకు రెక్కలు తొడిగి ఆనందంగా బైక్ మీద స్కూల్ కి వెళ్తున్న నాకు సెల్ ఫోన్ మోగడంతో ఈ లోకం లోకి వచ్చిపడ్డాను. అన్నయ్య నుండి ఫోన్. ఏమయ్యుంటుందా అని బైక్ నడుపుతున్న తోటి ఉపాద్యాయున్ని పక్కకు ఆపుకొమ్మన్నాను. ఫోన్ లిఫ్ట్ చేశాను. పిడుగులాంటి వార్త.అమ్మ లేస్తలేదు, హాస్పిటల్కు తీసుకెళ్తున్నామని. ఒక్కసారిగా గుండెలయతప్పి కొట్టుకుంటున్నది. కాకుల గుంపు అరచుకుంటూ తలమీదినించి వెళ్లిపోతున్నది.

వెంటనే సార్ను వెళ్లిపొమ్మని చెప్పి ఎదురుగా వస్తున్న ఆటోని ఆపి ఎక్కాను. నా పరిస్తితి తెలీని ఆటో నెమ్మదిగా వెళ్తున్నది. తొందరగా వెళ్ళమని ఆటోవానికి చెప్పి ఇంతలోనే ఏమయ్యుంటుందని అమ్మ ఆలోచనల్లో మునిగిపోయాను.

**ఆటోవాడు కూడా నా పరిస్తితి కనిపెట్టి నేరుగా హాస్పిటల్కు తీసుకెళ్ళాడు. హడావిడి లో అతనికి ఏమిచ్చానో కూడా తెలియదు. అన్నయ్య, తమ్ముడు మెయిన్ గేట్ ముందే కలిశారు. కుండపోత కన్నీళ్ళ తాలూకు ఆనవాళ్ళు స్పష్టంగా కనిపించాయి.**

ఉదయం ఆరు గంటలకు అమ్మ ఫోన్ కాల్ తోనే మెలకువ వచ్చింది. రెండు రోజుల నుండి వెన్నులో నొప్పి వస్తున్నదట. ఎప్పుడూ వచ్చే గ్యాస్ నొప్పే కదా అని సీరియస్గా తీసుకోలేదట. ఈ రోజు ఎక్కువ కావడంతో హాస్పిటల్ తీసుకెళ్తానేమోనని నాకు ఫోన్ చేసింది. పరీక్షల టైమ్ కావడంతో లీవు దొరకడం కష్టంగా మారింది. వెంటనే తెలిసిన హాస్పిటల్కి వెళ్ళి డాక్టర్ అపాయింట్మెంట్ తీసుకొని అమ్మకు ఫోన్ చేశాను. వెంటనే తమ్ముడికి కూడా ఫోన్ చేసి అమ్మను డాక్టర్కి చూపించమని చెప్పి స్కూల్కి వెళ్తున్న సమయంలోనే ఈ ఫోన్. అమ్మ జ్ఞాపకాలతో మనసు మూల్గుతున్న సమయంలోనే మరోసారి ఫోన్ మోగింది. ఈ సారి కూడా అన్నయ్యే. మాటలో వణుకు స్పష్టంగా తెలుస్తుంది. అమ్మ చనిపోయిందనే పిడుగులాంటి వార్త. గాలి స్తంభించింది. నా గుండె చప్పుడు నాకే డీజేలా వినిపిస్తుంది. అప్రయత్నంగా కన్నీటి చుక్క చెంపల మీదకు దుమికింది. అప్పటిదాకా వేగంగా వెళ్తున్న ఆటో స్లోమోషన్లో వెళ్తున్నట్లనిపించింది. తోటి ప్రయాణికులు ఏదో జరిగిందన్నట్లు సానుభూతి చూపులు చూశారు.

గత ఇరవై రోజులుగా అమ్మ మనసేమి బాగాలేదు. నాన్న చనిపోయి ఇరవై ఏండ్లయ్యిది. అప్పటికే మా అందరి పెళ్ళిళ్ళయి సంసారంలో పడిపోయాము. నాన్న కట్టిన ఇల్లు ఉన్నప్పటికీ ఒంటరిగా ఉండడం ఇష్టంలేక ఒంతులవారిగా అందరి దగ్గర ఉంటూ వచ్చింది. కన్నతల్లికి పదిమంది పిల్లలు భారం కారు. కానీ పదిమందికి ఒక్క తల్లి భారమవుతున్న ఈ రోజుల్లో అమ్మ ఇరవై ఏండ్లు ఎవరికీ తను ఇబ్బంది కాకుండా ఓపికతో నెట్టుకొచ్చింది.

అందరూ ఆడోల్లేనా అనే వైరాగ్యంలో పుట్టింది అమ్మ. నాలుగవ సంతానంగా కూడా ఆడదే పుట్టిందని వడ్లగింజ నోట్ల వేసి పురిట్లోనే చంపమన్నాడట తాత. కళ్ళల్లో నీళ్ళు నింపుకున్న అమ్మమ్మ భర్త నిర్లక్ష్యాన్ని బిడ్డకు తాకనీయకుండా పెంచింది. నాలుగవ తరగతి వరకు పుట్టింటిలో చదువుకున్న అమ్మ పెళ్లికావడంతో మెట్టినింటికి మారింది. ఆ తరువాత ఆరుగురు మగసంతానంతో అభిమానమే ఆస్తులుగా ఎదిగింది. నాన్నకు విదుషీమణిగా మారింది. నాన్న కూడా అమ్మను బాగా చూసుకునేవాడు.

ఆటో స్పీడ్ బ్రేకర్ దగ్గర కుదుపులతో నెమ్మదిగా వెళ్తున్నది. దగ్గరకు వచ్చేశాం. ఆటోలో నుండే ఇంటికి ఫోన్ చేసి భార్యాపిల్లలను నేరుగా హాస్పిటల్కు వచ్చేయమని చెప్పాను. ఆటోవాడు కూడా

నా పరిస్థితి కనిపెట్టి నేరుగా హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు. హడావిడిలో అతనికి ఏమిచ్చానో కూడా తెలియదు. అన్నయ్య, తమ్ముడు మెయిన్ గేట్ ముందే కలిశారు. కుండపోత కన్నీళ్ళ తాలూకు ఆనవాళ్ళు స్పష్టంగా కనిపించాయి. సరాసరిగా అమ్మ బెడ్ దగ్గరికి పరిగెత్తుకు వెళ్ళాను. యముడి లోహపు గంటల్లా గుండెలు ధనధన కొట్టుకుంటున్నాయి. జీవితంలో బద్ధకమంటే తెలియని అమ్మ అచేతనంగా పడుకొని ఉన్నది. అప్పటి దాకా బిగపట్టిన కన్నీళ్ల చెలియలికట్టను తెంపుకొని సునామీగా మారింది. ఎలా క్రమశిక్షణ తో బ్రతకాలో నేర్పిన అమ్మ ఎలా చనిపోవాలో కూడా చెప్పినట్లయ్యింది. ఉదయమే నిద్రలేచిన అమ్మ నాకు ఫోన్ చేశాక తలస్నానం చేసి, చందనం బొట్టు పెట్టుకొని, దేవునికి దీపం పెట్టుకొని, మంచం మీద వాలి అలాగే స్వర్గ దారి పట్టింది.చివరగా చేసుకున్న టిఫిన్ మీద అమ్మ పేరు లేదేమో! పొయ్యిమీద గిన్నెలో అలాగే మిగిలి ఉన్నది. నూకలు చెల్లాక ఎంత ప్రయత్నం చేసినా ముద్ద దిగదు కదా!

ఈలోగా దగ్గరి బంధువులు ఒక్కొక్కరు రావడం మొదలయ్యింది. మంజు, పిల్లలు వచ్చారు. కొత్తవాళ్లు వచ్చినప్పుడల్లా ఏడ్పుల స్థాయి పెరుగుతున్నది. అమ్మ పార్థివ దేహాన్ని ఇంటికి మార్చడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రైవేట్ అంబ్యులెన్స్ వాళ్ళు చుట్టుముడుతున్నారు.

**కడుపున పుట్టిన్న పిల్లలు సమాజంలో మెచ్చదగిన స్థానంలో ఉన్నారంటే అందుకు అమ్మ నేర్పిన క్రమశిక్షణే తోడయ్యింది. అబద్ధం చెప్పడం, అలసత్వం అమ్మ సహించేది కాదు. ఎక్కివచ్చిన నిచ్చెన మెట్లను ఎప్పటికీ మర్చిపోవద్దని పదే పదే చెప్పడమే కాకుండా తాను కూడా ఆచరించేది. అమ్మ మాటలు అప్పుడప్పుడూ కఠినంగా కూడా ఉండేవి. గాయపడ్డ మనసుతో కసిగా పైకి ఎదగడం కోసం ఆ మాటలు ఉపయోగ పడ్డాయి.**

నా చిన్నతనం నాకు బాగా జ్ఞాపకం ఉన్నది. అమ్మ ముఖం ఎప్పుడూ పసిమి ఛాయతో కడిగిన ముత్యంలా ఉండేది. వీలుదొరికినప్పుడల్లా ఆధ్యాత్మిక పుస్తకాలను చదువుతుండేది. నాతో కూడా చదివించేది. మూఢనమ్మకాలను ఎక్కువగా నమ్మేది కాదు. కట్నకానుకలని కోడళ్లను ఇబ్బంది పెట్టిందీ లేదు. ఏ తెల్లవారు జామున నిద్ర లేచినా మిషన్ కుడుతూ చిరునవ్వుతో చూసే అమ్మ ముఖమే ఇప్పటికీ నాకు గుర్తు. అమ్మ పెంచిన మల్లెలు, చామంతులు, మందారాలు పెరట్లో నవ్వుతూ ఉండేవి.

అమ్మ విగత శరీరాన్ని అంబులెన్స్ నుండి ముందరి వరండాలోనికి మార్చారు. చుట్టుపక్కలవాళ్లు బోరుమన్నారు. అమ్మతో అనుబంధాన్ని ఒకరినొకరు చెప్పుకుంటున్నారు. అందరి మాటల్లో అమ్మ ఆత్మాభిమానమే చర్చకు వస్తున్నది.

అవును... అమ్మ ఎవరికీ లొంగి బ్రతకలేదు. తన పిల్లల్ని కాపాడుకనేందుకు గద్దనైనా ఎదిరించే తల్లికోడిలా ఎన్నో ప్రతికూలతలను ఎదిరించింది. పెళ్ళైన కొత్తలో భర్త వైపు దగ్గరిబంధువుల వివక్షకు గురయినది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల జెండా ఎగురవేసినందుకు అత్తా ఆడబడుచుల నిర్లక్ష్యానికి ఎర అయింది. కాకుల మధ్య కాకిలా అరవాలి గాని కోకిలలా అరిస్తే మిగతా కాకులన్నీ పొడిచి చంపుతాయన్న సామెత అమ్మ విషయంలో నిజమయ్యింది. వాళ్ళ కపటప్రేమల కబంధ హస్తాల నుండి నాన్నను విడిపించి అతనిలో ఆత్మగౌరవాన్ని నింపడానికి అమ్మకు తాతలు దిగివచ్చారు. ఆరుగురు పిల్లలతో గౌరవంగా బతకాలంటే సొంత గూడు వుండాల్సిందేనని నాన్నను ఆ వైపుగా నడిపించి, ఇంటి నిర్మాణంలో



కథ

తానూ ఒక కూలీ అయింది.

అమ్మను చివరి చూపు చూసేందుకు బంధువుల తాకిడి ఎక్కువయ్యింది. నిద్రపోతున్నట్లున్న అమ్మ పార్థివ దేహాన్ని చూసి కన్నీళ్లొత్తుకున్నారు. అమ్మ పడిన కష్టాలు, ఎదుర్కొన్న విషయాలు తలచుకొని ఆమె వ్యక్తిత్వాన్ని నిలువెత్తుగా ఆవిష్కరించారు. రావలసినవారు, చూడవలసినవారందరు వచ్చేశారని దహన సంస్కార ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. బకెట్ల కొద్ది నీళ్ళు వాకిల్లోకి మోస్తూ చివరి స్నానానికి సిద్ధం చేస్తున్నారు.

కడుపున పుట్టిన పిల్లలు సమాజంలో మెచ్చదగిన స్థానంలో ఉన్నారంటే అందుకు అమ్మ నేర్పిన క్రమశిక్షణే తోడయ్యింది. అబద్ధం చెప్పడం, అలసత్వం అమ్మ సహించేది కాదు. ఎక్కివచ్చిన నిచ్చెన మెట్లను ఎప్పటికీ మర్చిపోవద్దని పదే పదే చెప్పడమే కాకుండా తాను కూడా ఆచరించేది. అమ్మ మాటలు అప్పుడప్పుడూ కఠినంగా కూడా ఉండేవి. గాయపడ్డ మనసుతో కసిగా పైకి ఎదగడం కోసం ఆ మాటలు ఉపయోగపడ్డాయి. పక్షి పిల్లలు స్వేచ్ఛగా ఎగరడం కోసం గూడులో ముండ్లను తెచ్చిపెడు తుందట తల్లి పక్షి. పిల్లలకు ఆ ముళ్ళే కనిపిస్తాయి. ఆ ముళ్ళ పునాదుల మీద ఎదిగిన పిల్లలను చూసి తల్లి సంతోషిస్తుంది.

నలుగురు పట్టి అమ్మను అమాంతంగా లేపి ఇంటిముందు అరుగు మీద స్నానానికి కూర్చోపెట్టారు. అమ్మ లక్కలందరూ ఒక్కసారిగా గొల్లు మన్నారు. అందరి కళ్ళల్లో నయాగరా జలపాతాలే. నా జ్ఞాపకాల ఎత్తిపోతలతో అమ్మ స్నానం చేస్తున్నది. పాత బట్టను వదిలించి పాడిచీరను కట్టించారు. డప్పుసప్పుళ్ళు అందరి గుండెల్లో వైరాగ్య భావాన్ని తట్టిలేపు తున్నాయి. బలంగా ఉన్న నలుగురు పాడె మీద పడుకో పెట్టారు. అమ్మకు ఇంతటితో ఇంటి ఋణం తీరిపోయింది. రాయితీసి, పునాదులు వేసిన ఇంటి నుండి వల్లకాటిలో బూడిద కావడానికి సిద్ధమయింది. శివ నామ స్మరణతో ఐదుగురం అన్నదమ్ములం పాడెను పట్టుకొని పైకి లేపినాము. తమ్ముడు కావిడితో ముందు నడుస్తున్నాడు. అనుబంధాన్ని బాధ్యతగా భావించుకుంటే అమ్మ ఎప్పటికీ భారం కాదు. బతికినంత కాలం అమ్మను బాధ్యతగా ఎలా పంచుకున్నామో, ఇప్పుడు అమ్మ బరువును కూడా. అమ్మకు గోడుగోడున ఏడ్చే ఆడబిడ్డలు లేరు. ఆడ పిల్ల మీద ప్రేమతో ఆరుగురు మగపిల్లల్ని కన్నది. విసిగిపోయి కుటుంబ నియంత్రణ చేయించుకున్నదట.

చివరి యాత్ర మొదలయ్యింది. వాడ వాడంతా బారులు తీరి కన్నీటి పర్యంతమయ్యింది. ఈ లోకంలో బతికినందుకు నలుగురిని సంపాదించు కొమ్మంటుంది వైరాగ్యం. అమ్మ వందలకొద్ది గా సంపాదించుకుంది. తన భావజాలంతో ఒక సామ్రాజ్యాన్ని నిర్మించిన అమ్మ అన్నీ వదిలి శివ సాయుజ్యంలోనికి వెళ్తున్నది. చలికాలం కావడంతో ఆకాశం తొందరగానే మసక బారుతున్నది. పెద్దలు ఎంత తొందర పెట్టినా శ్మశానం చేరేసరికి చీకటి పడింది. దింపుడు కళ్ళం దగ్గర యథాలాపంగా ఆపి చెవిలో పేరుపెట్టి పిలుస్తున్నారు. అమ్మకు వినిపిస్తున్నదా? అమ్మ ఇప్పుడైనా తిరిగివస్తే బాగుండు. చేసిన తప్పుల్ని సరిచేసుకొనే అవకాశం ఇస్తే బాగుండు. ఇంటివాళ్లు ఒక్కరొక్కరుగా కాళ్ళకు మొక్కుతున్నారు. నన్నూ మొక్క మన్నారు. "అమ్మా! నీ కడుపున పుట్టినందుకు గర్వపడుతున్న. ఇంకొక జన్మంటూ ఉంటే నాకు కూతురుగా పుట్టమ్మా!" అని మనస్ఫూర్తిగా దండం పెట్టుకున్న. బేగరి అమ్మకాళ్ళకు కట్టిన దారాన్ని తెంపి ఈ లోకంతో ఉన్న బంధాన్ని శాశ్వతంగా తెంపేశాడు. మూతబడ్డ కనురెప్పల వెనుక నుండి అమ్మనన్నే చూస్తున్నట్లున్నది. నన్ను లోకానికి పరిచయం చేసిన అమ్మ మానసిక ఒంటరిని చేసి వెళ్లిపోతున్నది.

బేగరోళ్ళ హడావిడి ఎక్కువయ్యింది. దహన కార్యక్రమాల తంతు వారి చేతుల్లోకి వెళ్ళిపోయింది. అమ్మను పేర్చిన కట్టెలమీద పడుకోబెట్టారు. వచ్చినవారు ఎడమచేత తంగేడు ఆకు తెంపి కాష్టం లో వేస్తున్నారు. కొద్దిమంది పక్కనున్న కట్టెలను తీసి తమవంతుగా బేగరి చేతికి అందిస్తున్నారు. అమ్మ ముఖం ఒక్కటి బయటకు కనిపిస్తున్నది. చివరి కట్టెను అన్నయ్య చేత అమ్మ ముఖం మీద పెట్టించారు. అంటే అదే అమ్మ చివరి చూపు. ఇంక ఎవరికీ కనిపించదు. తమ్ముడు భుజాన నీళ్ళ కుండతో చుట్టూ తిరుగుతున్నాడు. చిల్లులు పడ్డ కుండను వెనుక వారగా కింద పడవేశాడు. జ్ఞాపకాల శకలాలు చిందరవందరగా పరుచుకున్నాయి. బేగరి అందించిన కొరివితో తల అంటించి వెనక్కు తిరగకుండా ముందుకు సాగిపోయాడు.

అయిపోయింది. అంతా అయి పోయింది. చీకటిబడ్డ మనసులతో అందరూ వెనుతిరిగారు. ఒంటరిగా ఈ లోకం లోకి వచ్చిన అమ్మ ఒంటరిగానే మిగిలిపోయింది. ఈ చావులూ, పుట్టుకలూ, బంధాలు, అనుబంధాలు అన్నీ కూడా గీతలో చెప్పినట్లు నశ్వరమైనవే కదా! ఇలా శ్మశాన వైరాగ్యంలో ఉండగానే మళ్ళీ ఫోన్ మోగింది. ఎవరో ఏమిటో అని లిఫ్ట్ చేశాను. దూరపు బంధువులకు ఎవరికో అమ్మాయి పుట్టిందట.. "జననం మరణం కఠోర సత్యం" అనే లైఫ్ ఇన్సూరెన్స్ స్వరం దూరం నుండి లీలగా వినిపిస్తుంది.

**బేగరోళ్ళ హడావిడి ఎక్కువయ్యింది. దహన కార్యక్రమాల తంతు వారి చేతుల్లోకి వెళ్ళిపోయింది. అమ్మను పేర్చిన కట్టెలమీద పడుకోబెట్టారు. వచ్చినవారు ఎడమచేత తంగేడు ఆకు తెంపి కాష్టంలో వేస్తున్నారు.**

కవిత

# శాంతికాముకుడు



**అరుణ నారదభట్ల, 97050 15207**



ఆకాశాన్ని స్పర్శించానంటాడు
మాయలకు లొంగనివాడిలా
తానే అన్నింటా ఉన్నానంటాడు
ఉద్వేగం నిద్దుర లేచినప్పుడల్లా ఉవ్వెత్తున అగ్నిధారైనవాడు

గుండెలనిండా ధైర్యాన్ని మనసునిండా నమ్మకాన్ని
హిమపాతమంత ఉల్లాసంగా దాచుకుని
దాష్టీకాలను దౌర్జన్యాలను ఏకరువు పెట్టిన
అక్షర యోధుడు

తిమిర మేఘమాలికలకు చితిముట్టిస్తూ
వెలుగువానల గుట్టు తెలిసిన తాత్వికుడు
ఆలోచనాలోచనలో నావై నావికుడైనవాడు

రసరమ్య భావవీచికలల్లి
సరస శృంగార వీర రసాలను అక్షరాలకద్ది
పాటకు మాధుర్యాన్నద్దిన కవితాధార అతడు

వాయులీన తరంగమై అంతర్నాదమై
భాస్కరులను బడబాగ్నిని
వసంతాలనూ వయ్యారాలను సిరాగా మార్చి
కవిత్వమై వ్యాపించి
విశ్వ మనుగడను సుభిక్షం వైపు నడిపించాలని
కలలుగన్న శాంతికాముకుడు

అంతశ్శోధనలో వెదికి వెదికి
వేణువును అల్లుకున్న భక్తుడు
సినీగీతమాలికై పాటై పద్యమై సాగుతూ
కోటి రతనాల వీణన వెలువడి రాగమైన అతడు
ఈ మన మట్టిలో విరిసిన పారిజాతమే!!

వ్యాసం

# దాశరథి వచన కవిత - వస్తు శిల్పాలు

**సోషలిజం ఆకాంక్షను వ్యక్తం చేసిన దాశరథి వచన కవితా విశ్లేషణ...**



ఏనుగు నరసింహారెడ్డి
89788 69183

దాశరథి వచన కవిత్వంలో వస్తువంతా విప్లవం, అభ్యుదయం, కాల్పనికత నుండి పుట్టినవే. సాంప్రదాయకత, కాల్పనికత, అభ్యుదయశీలతగా దాశరథి కవితా వస్తువును అధ్యయనం చేసారు, దాశరథిపై పరిశోధన చేసిన యలమర్తి చంద్రమౌళిగారు. నిజానికి దాశరథి కవితా గమనాన్ని నిశితంగా గమనించినట్లయితే ఆయన కవిత్వంలో విప్లవం, అభ్యుదయం, కాల్పనికతను ప్రధానంగా గమనించవచ్చు. అయితే దాశరథి విప్లవధోరణి ఒక దశలో ఆగిపోగా అభ్యుదయం, కాల్పనికత కడదాకా ఆయన వెన్నంటి నడిచాయి.

**విప్లవం...**

దాశరథి కవిత్వంలో విప్లవ ధోరణి 1948 వరకు సాగింది. ఈ కాలంలో అగ్నిధార మాత్రమే ప్రచురించబడింది. అగ్నిధారలో పద్యమే ప్రధానమయింది కాబట్టి ఆయన వచన కవిత్వంలో విప్లవధోరణి నిడివిలోనూ, కవితల సంఖ్యలోనూ తక్కువేనని చెప్పాలి. దాశరథిలో తిరుగుబాటు ధోరణికి కారణం నిజాం ప్రభుత్వం, అందులోని పరిస్థితులు, వాటికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు సాయుధ పోరాటమే నడిపారు. దాశరథి కూడా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. కానీ ఆయన మీద మార్క్సిస్టు భావజాల ప్రభావం చాలా తక్కువ. భారతీయ సాంప్రదాయ ముద్రే ఆయన మీద ఎక్కువగా పనిచేసింది. ఈ కారణం వల్లనే మద్రాసు రాష్ట్రపు తెలుగు కవులంతా ఆ పాటికే గేయం, వచనం బాట పట్టగా దాశరథి పద్యాలు రాస్తూ వచ్చాడు. అయితే పద్యాలకు మాత్రమే పరిమితం కాకుండా వచన కవిత్వం కూడా రాసాడు.

మొదటే చెప్పుకున్నట్లు దాశరథి రాజ్యానికి వ్యతిరేకి, విప్లవ వాది. తొలినాళ్ళలో కమ్యూనిస్టు, అంటే పేదల పక్షపాతి అని వేరుగా చెప్పపనిలేదు. శ్రామిక జాతి అభ్యున్నతికోసం, నిరుపేదల పురోగతికోసం తన వాక్కును ధారపోసాడు.

'తరతరాల దరిద్రాల
బరువులతో కరువులతో
క్రుంగి క్రుంగి
కుమిలి కుమిలి
కష్టాలకు నష్టాలకు
ఖైదులకూ కాల్పులకూ
సహనంతో, శాంతంతో
బలిపశువై తలవాల్చిన
దీన పరాధీన జాతి
శ్రమిక జాతి
దెబ్బతిన్న బెబ్బులివలె
మేల్కొన్నది'. (శ్రమికజాతి, అగ్నిధార)

అంటాడు. దాశరథి అవగాహన లోతైనది. ఎక్కడా వాచ్యంగా మార్క్సిస్టు పడికట్టు పదాలను వాడకుండా ఘర్షణ స్ఫురించే విధంగా కవిత్వం చెబుతాడు. ఆయన కాలానికి మార్కెట్ శక్తులు అప్పుడప్పుడే ప్రారంభమవుతున్న విధానాన్ని కూడా కనిపెట్టాడు. విశ్వ విపణి వీధుల్లో చావు చాలా చౌకయిందంటాడు. బ్రతుకు బ్లాక్ మార్కెట్ ధర, వ్యాపారులు ప్రపంచాన్ని తుంచుకొని పాలిస్తున్నారని సరికొత్తగా చెబుతాడు. మంచినీళ్ళకంటె పల్చగా పేదల రక్తం వాడుకొన్న ధనికులను తూర్పారబడతాడు. ఇక విప్లవం తథ్యమని నినదిస్తాడు.

'చెలియలికట్టలు దాటిన
ప్రళయ కాల జలధివోలె
తిరుగుబాటు పరుచుకుంది.
విశ్వరుద్ర ఫాలంలో
విప్లవాక్షి విరిసింది
పరతంత్ర ప్రజాకోటి
ప్రళయవృష్టి కురిసింది
ప్రజాద్రోహి వర్గానికి
లయకాళిక శ్రమికజాతి'
(శ్రమికజాతి అగ్నిధార)

పై కవితను గమనిస్తే ఆయన మార్క్సిస్టు దృక్పథం అవగతమవుతుంది. Continuous struggle between have and have not will end with the victory of have not అన్న కార్ల్ మార్క్స్ మాటను 'ప్రజాద్రోహి వర్గానికి లయకాళిక శ్రామిక జాతి' అని సంక్షిప్తీకరించాడు.

'దిక్కులేని పేదవాళ్ళ
డొక్కలతో పిక్కటిల్లు
ఆకలి మంటలలో
నరనరాల పరుగెత్తే
మెరుపుతీగల' (అదుగో, అగ్నిధార)

గురించి

'చిరఖేదం విరమించుక
బ్రతికేమా?
కడుపునిండ గంజినీళ్ళు
గతికేమా?
సౌఖ్యానికి సఖ్యానికి
వెతికేమా
ఏమో!' (ఖేదం, అగ్నిధార)

అని వగచినా, ఆయన స్పష్టమైన అవగాహన

'అనాదిగా సాగుతోంది
అనంత సంగ్రామం
అనాథుడికి, ఆగర్భ
శ్రీనాథుడికి మధ్య' (అనంత సంగ్రామం, అగ్నిధార)

అనే నడిగడ్డ, అనలదాహం, దీపావళి, ఖేదం, ఇల, ప్రాగ్భూమి, నిరుపేదా, అదుగో, శ్రమికజాతి, కవితాకోపం వంటి కవితల ద్వారా శ్రామికజాతి దైన్యాన్ని, విప్లవ ఆవశ్యకతను ప్రబోధించాడు. పేదల, ధనికుల మధ్య అనివార్యమైన సంఘర్షణ మార్క్స్ చెప్పినట్లు ఎప్పుడు సుఖాంతమవుతుందోనని ఎదురు చూసాడు దాశరథి. 'అన్నార్తులు, అనాథలుండని ఆ నవయుగమదెంత దూరం?' అని సమ సమాజాన్ని తలపోసాడు. ఆయన సమసమాజంపై గట్టి నమ్మకంతో 'రానున్నది ఏది నిజం ఒకటే సోషలిజం' అని నినదించాడు. ఆ సమాజంకోసం ప్రజలే ధ్వజమెత్తాలని ప్రబోధిస్తాడు.

'గత కలహాల మీద
గతం సలహాల మీద
కాంతిని కనబడనివ్వని
గాఢాంధకారాల మీద
శాంతిని వినబడనివ్వని రణఘీంకారాల మీద
ధ్వజమెత్తిన ప్రజ
ఆ ప్రజ నిజమైన ప్రజ' (ధ్వజమెత్తిన ప్రజ)

అయితే దాశరథి యథార్థవాది. విప్లవమంటే పిస్తోలు పట్టడం మాత్రమే కాదంటాడు. 'విప్లవమంటే అర్థం తెలియని వాడికి పిస్తోలు పట్టినవాడే విప్లవ వాది. విప్లవమంటే అర్థం తెలిసిన వాడికి పిస్తోలుకు గురయినవాడే విప్లవవాది' అంటాడు.

**అభ్యుదయం...**

తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమయినాక దాశరథి విప్లవ కాంక్ష కొంత చల్లారి అభ్యుదయవాదం మొగ్గతొడిగింది. 1948 నుండి 1956 వరకు ఆయన అభ్యుదయ రచనలు చేసాడు. ఆయన అభ్యుదయంలో భాగంగానే మహాంధ్రాకాంక్ష బయల్పడింది. తెలుగు ప్రజల ఏకీకరణ, అభివృద్ధి ఆయన ఆకాంక్షగా మనకు అర్థమవు తుంది. బహుశా! దాశరథికి కమ్యూనిస్టుల నినాదం 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' ఎంతో నచ్చి ఉంటుంది. అందుకే ఆయన ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును కాంక్షిస్తూ మహాంధ్రోదయ కావ్యమే రాసాడు. అయితే అది ప్రధానంగా పద్యకావ్యం. కానీ అడపాదడపా తెలుగు వారి ఐక్యతకు భంగం కలిగిందనుకున్నప్పుడు, ప్రతి రాష్ట్రావతరణ దినోత్సవానికి ఆయన కవిత్వం రాసాడు. అందులో కొన్ని వచన కవితలున్నవి. ఆంధ్రప్రదేశ్ అవతరణకు పులకరించిన దాశరథి తన కవితాకాంక్ష నిజమయిందని ఆనందించాడు. అయితే 1969లో జై తెలంగాణ, 1972 జై ఆంధ్ర ఉద్యమాలు ఎగిసిపడి సమసిపోయిన పిదప ఆయన సమైక్యాంధ్రము అనే కవిత రాసాడు

'రెండు శతాబ్దాల పిదప
నిండుగ ఒక్కటైన నేల
రెండు దశాబ్దాల లోనే
రెండవునని భయపడుటా?
రణం పెంచు మతంలాగ
రాజకీయమీనాడు
రాక్షసిలా మనపైకే
కక్షగట్టి కూర్చున్నది
.................................
కమ్మని నా తెలంగాణ
తొమ్మిది జిల్లాలేనా?
బహుళాంధ్రకు తెలంగాణ
పర్యాయపదం కాదా?'

(సమైక్యాంధ్రము, తిమిరంతో సమరం)

దాశరథి ఉన్నత విద్య అంతా స్వాతంత్ర్యానంతరం సాగింది. ఉద్యోగం, సినిమా పాటలు, ఆంగ్ల సాహిత్యాధ్య యనం ఆయనలోని అభ్యుదయ కోణాలను ఆవిష్కరించాయి. ప్రపంచ శాంతి, శ్రామిక జాతి అభ్యుదయం, ప్రపంచ విప్లవాలకు ఆలంబన దాశరథి వచన కవిత్వంలో కనిపిస్తుంది. శ్రీశ్రీలాగే దాశరథికీ చరిత్రంతా చీకటి కోణాలమయంగా కనిపించింది. అందుకే ఈ ధరిత్రి అమ్మల పొదిలో

'ఈ చరిత్ర చీకటి గదిలో
ఈ ధరిత్రి అమ్ముల పొదిలో
తైల దీపం వెలుతురులో
వెదికి వెదికి వేసారినా
లభించేది కనిపించేది-
పెద్దల







విద్యావంతుల
తరతరాల బూజుల
వట్టి పాత గాజుల
విలువలు' (రుధిర దీపిక, రుద్రవీణ)

అంటాడు. పునర్నవంలోని యుగాంతర రేఖలులో కూడా చరిత్రలో చోటు చేసుకున్న దురాలోచనలను చూస్తాడు. పునర్నవంలో హిట్లర్, లూథర్, పోప్‌ల చర్చ చేస్తాడు. తెలంగాణ పరిధి దాటి విశ్వశ్రామికుల బాధలన్నీ తన కవితా వస్తువులుగా భావించాడు. 'అనాథ విశ్వశ్రామిక మూర్తీ! ఆగామియుగ పరివ్యాప్త కీర్తి' అని శ్రామికుడే భవిష్యత్ నాయకుడని ప్రకటిస్తాడు.

చరిత్రలో జీవించే వాళ్ళను, కేవలం కొత్తదనానికి పరుగు పెట్టేవాళ్ళను దాశరథి ఏక పక్షంగా సమర్థించడు. ఆయన సమన్వయవాది. మార్క్సిస్టువాది అయినప్పటికీ మూర్ఖపు పిడివాదం ఆయనవద్ద లేదు.

'గతాన్ని కాదనలేను
వర్తమానం వద్దనబోను
భవిష్యత్తు వదులుకోను
కాలం నా కంఠమాల'

అంటాడు. సమన్వయదృక్పథాన్ని ఆయన నిర్భయంగా ప్రకటిస్తాడు.

'ఎర్రజెండ పట్టుకొని
ఎగసిపోవు వాడితోటి
పచ్చ జెండ పట్టుకొని
పరుగు తీయు వానితోటి
మైత్రీబంధం కూర్చే
మహాశక్తి నాకుంది'

జీవితంలో ఒక దశకు వచ్చాక, పరిణతి పెరిగాక మనిషిలో వివేచన పెరుగుతుంది. పరిపక్వతతో కూడిన ప్రాపంచిక దృక్పథం ఏర్పడి తీరుతుంది. దాశరథి కూడా ఇందుకు మినహాయింపు ఎలా అవుతాడు? ఆయన కత్తికంటే కలం గొప్పదని చెప్పకుండా ఎలా ఉంటాడు. అందుకే

'కత్తిబట్టి గెలిచినట్టి
ఘనుడగు వీరుండెవ్వడు?
మెత్తని హృదయం ధాటికి
తుత్తునియలు కానిదెవడు?

> **దాశరథి ఉన్నత విద్య అంతా స్వాతంత్ర్యానంతరం సాగింది. ఉద్యోగం, సినిమా పాటలు, ఆంగ్ల సాహిత్యాధ్యయనం ఆయనలోని అభ్యుదయ కోణాలను ఆవిష్కరించాయి. ప్రపంచ శాంతి, శ్రామిక జాతి అభ్యుదయం, ప్రపంచ విప్లవాలకు ఆలంబన దాశరథి వచన కవిత్వంలో కనిపిస్తుంది. శ్రీశ్రీలాగే దాశరథికీ చరిత్రంతా చీకటి కోణాలమయంగా కనిపించింది.**

అజ్ఞానపు అడుసు కడిగి
అసలు విషయ మెరుంగుడి
ఘర్షణలో ఏనాటికి
హర్షం లభియింప బోదు'

అని జ్ఞానబోధ చేస్తాడు. ప్రపంచంలో మార్పు తప్పదని దాశరథి నమ్ముతాడు. మారనిది శునకవాలంతో సమాన మంటాడు.

'భయ్యా!
పిరికివాడు కత్తిబట్టి
నరుకుటకై వస్తాడు
మూర్ఖుడు హింసించబోయి
ముందుతాను చస్తాడు
బుద్ధుడు చిరునవ్వు చిలికి
ముగ్ధుల గావిస్తాడు.
మారినపుడె అది కాలం
మారనిది శునకవాలం' (నైలునది

బాలులతో, తిమిరంతో సమరం)

### కాల్పనికత...

దాశరథి కాల్పనిక కవిత్వం హృదయాల్ని కట్టిపడేస్తుంది. ఆయన కాల్పనిక కవిత్వాన్ని ప్రధానంగా ఎలిజీలుగా, పర్వదిన కవితలుగా, శృంగార కవితలుగా అర్థం చేసుకోవచ్చు. పోరాట కాలపు కవిత్వాన్ని మినహాయిస్తే మిగతా కాలపు కవిత్వంలో ఈ కాల్పనికతే దాశరథిని కవిగా మహోన్నత స్థానంలో నిలబెడుతుంది. దాశరథి సాత్వికుడు, స్నేహశీలి, కదిలిపోయే స్వభావం గలవాడు. అందుకే ఆయన ఎన్నో స్మృతి కవితలు రాసాడు. ఇష్టులు, ఆత్మీయులు, మహా నాయకులు మరణించినపుడు తట్టుకోలేని దుఃఖంలో ఎలిజీలు రాసాడు. వట్టికోట ఆళ్వారుస్వామి, సురవరం ప్రతాపరెడ్డి, గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ, జేమ్స్ మిరిడిత్‌లపై స్మృతి కవిత్వం రాసాడు. వట్టికోట ఆళ్వారు స్వామి దాశరథికి స్నేహితుడు, సహచరుడు. నిజామాబాద్ జైలు పద్యాలన్నీ ఆయనే గోడమీద బొగ్గుతో రాసి ప్రచారం కల్పించాడు. ఆయన మరణం కవిని కదిలించింది. ఆయనలోని ఔన్నత్యాన్ని ఎత్తి కవిత్వీకరించింది.

'అతన్ని మృత్యువు ప్రేమించింది.
మృత్యువు వంటి రాకాసి శూర్పణఖకు
అతడంటే ఇష్టం కలిగింది
రాముడి తెలివితేటలు లేని
అమాయకుడు ఆళ్వార్!
మృత్యువుకు బలైపోయాడు!'

అని దుఃఖంతో తన తొలి కవితా సంకలనం అగ్నిధారను అంకితం చేసాడు.

'మూగపడిన తెలంగాణ
మూల్గిన తొలినాటి ధ్వని'

అని సురవరంపై గౌరవంతో రాసాడు.

దాశరథి ప్రతి పర్వదినానికి కవిత్వం చెప్పేవాడు. వివిధ మాధ్యమాలు ఉగాది, సంక్రాంతి, దీపావళిలాంటి పండుగలకు రాష్ట్రావతరణ దినోత్సవానికి నిర్వహించిన సమ్మేళనాలలో చదవడం కోసం రాసిన అనేక కవితలు తదనంతర కాలపు సంకలనాల్లో చోటు చేసుకున్నవి. మధుర క్షణం, జ్వాలా సుందరి, రుధిర సుమాలు, వసంత గీతి, సుస్వాగత శుభగీతం, వసంతచక్రం, ఉగాది నగారా, ఆశాజీవి, అమని పాట, ధూమ పతాకం, ప్రగతి పథాన జగతి, వర్తమాన నర్తనశాల, పరిణామం, సంక్రాంతి గోరింట మొ॥ కవితలు ఆయన శుభకామనకు అద్దం పడతాయి. పండగపై కవిత్వం రాసి మెప్పించడం ఎంత కష్టమో కవులందరికీ తెలిసిన విద్యే. అయితే దాశరథి తన కవిత ఎక్కడా తేలిపోకుండా అటు పదాలతోనూ ఇటు కొత్త ఊహలతోనూ

బిగితో అల్లేవారు. ఒక దీపావళి కవితలో

'యుద్ధాల అబద్ధాలు గెలవ్వు
శాంతి సహనాల సత్యం గెలుస్తుంది
పైన పటారాలు నిలవ్వు
నిజమైన కవిత్వం నిలుస్తుంది'

అంటాడు. ఒక ఉగాది కవితలో

'నాకు ముకుళాల మీద, వకుళాల మీద
నవ నందన సుందర మందారాల మీద
వర్తమాన, కళామయ నర్తనశాల మీద
భవిష్యద్భాగ్యోదయ దినాల మీద
అంతులేని విశ్వాసం ఉంది' అని

ప్రకటిస్తాడు.

బాల్యం వస్తువుగా అనేక కవితలు వచ్చాయి. బాల్యంపై కవిత్వం రాయని కవి కూడా లేక పోవచ్చు - కానీ బాల్యం వస్తువుగా ఆంగ్లంలో డిలాన్ థామస్ కవిత్వం, హిందీలో సుభద్రకుమారి చౌహాన్ కవిత్వం, తెలుగులో శ్రీశ్రీ కవిత సరసన సగర్వంగా నిలబడదగ్గ కవిత దాశరథి రాసాడు. దాశరథి బాల్యాన్ని అసలు బతుక్కి ఆనందపు పొలిమేర అని నిర్వచిస్తాడు. బాల్యమంటే 'నిశ్శబ్దంగా నితాంత జీవిత లతాగ్రాన పూచే నిర్మలమైన ఎర్రరోజాప్రసూన మంటాడు. బాల్యాన్ని అడ్డు పెట్టుకొని సోషలిజాన్ని కూడా నిర్వచించాడు దాశరథి.

'ఉన్నదాన్ని ఉన్నవాళ్ళందరిలో పంచి
ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి
ఉజ్వలంగా ఆటల్లో పాటల్లో పడి
ఊరంతా తిరగడం ఎంత బాగుంటుంది?
అంతకంటే సామ్యవాదం ఏమిటి
అంతకన్నా ప్రజాస్వామ్యం ఎక్కడ'

అంటాడు. ఇంకా

'నీడలు లేని మెత్తని వెన్నెలలో
ముళ్ళులేని పువుతీవెల ప్రక్కగా
దుర్గంధం లేని మనసు కుళ్ళాజాలంలో
బాల్యం అనే నౌక మీద పయనించే
దివ్య సమయాలు మళ్ళీ వచ్చేనా?'
అంటూ పులకిస్తాడు.

అగ్నిధార, రుద్రవీణ వరకు పద్యం రాసిన దాశరథి, పునర్నవం నుండి వచనం వైపు మళ్ళాడు. 'ఉషస్సంధ్య'లో మంచికీ, చెడుకూ మధ్య జరిగే సంఘర్షణతో మంచిది అంతిమ విజయమని ప్రబోధించాడు. 'కిరణ శకలం'లో అణు బాంబును వ్యతిరేకిస్తాడు. 'యుగాంతర రేఖలు'లో ప్రపంచరాజకీయాల్ని చర్చకు పెడతాడు. 'తుది శిశిరం' ఒక యుద్ధ వ్యతిరేక కవిత. మస్తిష్కంలో లేబరేటరీ' అత్యాధునిక లక్షణాలున్న కవిత. 'ప్రణవంలో త్రివర్గాలు' సామాన్యుల్ని కీర్తిస్తుంది. ఓరుగల్లు శిల్పాల విధ్వంసాన్ని చూసి చలించి 'రాతిపూలు' అనే గొప్పకవిత రాసాడు. జ్యోతిష్చక్రం, ప్రత్యూష ఘంటిక, అశ్వదీపం, రాజహంసలు, శాంతిబాల, వెన్నెల పాట ఈ కోవలో పేర్కొనదగిన కవితలు.

దాశరథి కాల్పనిక సౌకుమార్యానికి అద్దం పట్టే కవితలు పావురాళ్ళు. విశ్వ మానవ విజయ గీతిక, జ్యోతి పలికించిన గీతి, ఓసీ మూసీ. పావురాళ్ళ స్వభావాన్ని సరళ సుందరమైన వచనంలో చెబుతూ

'సంకుచిత ధరాగోళము
వంకజూసి హసిస్తాయి
దయామయని వడిలోపల
కిరాతకుని వలలోపల
సమానముగ పడిపోయే
అమాయకపు పక్షులవి' అంటాడు.

దాశరథి ప్రణయ కవిత్వం వచనంలో తక్కువే. గజళ్ళలో, రుబాయిలలో ప్రేమ భావాలను పొదిగాడు. నిజానికి తెలుగు వచన కవిత్వంలో ప్రేమ ఒదుగుతుందా అని అనుమానం కలుగుతుంది. ఎందు కంటే దాశరథి ప్రణయ కవిత్వ మంతా గాలీబు అనువాదంలో, ఇతర ఉర్దూ, ఫారసీ కవుల తెనిగింపులోనే ఉంది. మధుజ్వాల, మళ్ళీ మ్రోగిన మంజీరం లాంటి కొన్ని స్వతంత్ర వచన కవితలు మాత్రమే దాశరథి ప్రేమతత్వాన్ని పట్టిస్తాయి. అవి కూడా ఉర్దూ స్పర్శను కలిగే ఉన్నాయి చూడండి.

'ఎంత న్యాయం ఉన్నదే? ఈ
విభజనంలో ఓ ప్రియా!
ఎంత ధర్మం ఉన్నదే
ఈ పంపకంలో ఓ ప్రియా'

(మధుజ్వాల, ఆలోచనాలోచనాలు)

'ఆమె-అల్లరి గాలి ఆఘ్రాణించిన పుష్పం
ఆమె-స్త్రీత్వం జార్చిన నవరక్త బాష్పం
ఆమె-కవి కలం నుండి దూకిన
కమ్మని గజల్
ఆమె-ఎవ్వరూ విడదీయలేని పజిల్'
(మళ్ళీ మోగిన మంజీరం,
ఆలోచనాలోచనాలు)

**దాశరథి వచన కవితా శిల్పం...**

కవిత్వమంటే ఏమిటనే విషయంలో సాహిత్యకారులలో ఏకాభిప్రాయం లేనట్లుగానే శైలీ, శిల్పాల విషయంలో కూడా ఎవరి అభిప్రాయం వారిదే. దాశరథి రంగాచార్యులు అన్నట్లు కవిత్వం అంతా ఆవేశ ప్రధానమైనది. అందుకే అన్న కృష్ణమాచార్యులు "కవిత్వం రాసాడు కాని కథ నవలల జోలికి రాలే"దంటాడు. వచన కవిత్వం విషయానికి వస్తే అది తెలుగులో అభ్యుదయ సాహిత్య ధోరణిలో వచ్చింది. కుందుర్తి వచన కవిత్వాన్ని ఉద్యమంగా నడిపించాడు. కుందుర్తి ప్రకారం 'వచనగేయం యొక్క ప్రధాన లక్షణాలు నిరాడంబరత, నిరలంకారత కాదు గాని, అనవసర అలంకార భారరాహిత్యం, అలాగే వర్ణనాధిక్యతకు స్వస్తి, కథా భంజనం కానంత వరకే అలంకారాల వర్ణనల స్వీకరణ, కవితలో సారళ్యం, సూటిగా హృదయానికి తాకే విధంగా శబ్దాల కూర్పు, తెలుగు నుడి కారపు సొంపులను, రస పోషణను తగినంత వినియోగించుకోవడం, అన్నింటికంటే కవిత తెలుగు ప్రజల సంభాషణ స్థాయికి

**బాల్యం వస్తువుగా అనేక కవితలు వచ్చాయి. బాల్యంపై కవిత్వం రాయని కవి కూడా లేక పోవచ్చు - కానీ బాల్యం వస్తువుగా ఆంగ్లంలో డిలాన్ థామస్ కవిత్వం, హిందీలో సుభద్రకుమారి చౌహాన్ కవిత్వం, తెలుగులో శ్రీశ్రీ కవిత సరసన సగర్వంగా నిలబడదగ్గ కవిత దాశరథి రాసాడు. దాశరథి బాల్యాన్ని అసలు బతుక్కి ఆనందపు పొలిమేర అని నిర్వచిస్తాడు.**

వ్యాసం

దగ్గరగా రావడం!' ఈ నిర్వచనం ప్రకారం అవసరమైన చోట మాత్రమే అలంకారాలు, వర్ణనలు వాడాలి. సరళంగా, సూటిగా ఉండే పదాల వినియోగం - ముఖ్యంగా కవిత ప్రజల సంభాషణ స్థాయికి రావడం. ఈ లక్షణాలన్నీ ఏ కవీ యథాతథంగా పాటించపోయినప్పటికీ వీటిని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. అయితే ఇంతటి సారళ్యంతో కవిత్వాంశను సాధించడం చిన్న విషయం కాదు. అందులో దాశరథి ఘన విజయం సాధించారు. కొంచెం అటు ఇటుగా కుందుర్తి కాలానికే చెందిన వాడైన దాశరథి కుందుర్తి కంటే బలమైన వచన కవిత్వం రాసాడు.

కవిత్వం మీద, వచన కవిత్వం మీద కూడా దాశరథికి కొన్ని స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. కొత్తదనం కవిత్వానికి మూలధనం అంటాడు దాశరథి.

'రోజా కనబడే నక్షత్రాల్లోనే
రోజా కనబడని కొత్తదనం చూచి
రోజా పొందని ఆనందానుభూతి.
పొందడం అంటేనే కవిత్వం'

భవిష్యత్తుకు స్వాగతం చెబుతూ జీవంలేని ఫ్రీవర్సు రావద్దంటాడు. దాన్ని బట్టి వచన కవిత మరింత బలంగా ఉండాలని కోరుకుంటాడు. అందుకు ఆయన వచన కవిత్వమే సాక్షి.

దాశరథి కవిత్వంలో మధురమైన పద గుంభనం పాఠకుల్ని కట్టిపడేస్తుంది. చమత్కారం ఆయన కవితా రహస్యం. అంత్యప్రాస సహజంగా అతుక్కుపోతుందీయన కవిత్వంలో. రిథమ్ ఆయన వచన కవితలో కూడా అప్రయత్నంగా పరుచుకపోతుంది. సూటిగా సాగే శుద్ధ వచన కవితల్లో కూడా చెక్కు చెదరని కవిత్వాంశ ఆయన సొంతం. అనుకోకుండా పడే పదచిత్రాలు, అలంకారాలు, అప్రయత్న సమాసాలు ఆయన వచన కవిత్వానికి వన్నెలద్దాయి.

'జ్యోతి పలికించిన గీతి' నిజానికి అంత సౌమ్యమైన వస్తువు కాదు. సాయం వేళ పనులు చేసుకొని ఇంటికి వెళుతున్న యువతుల మీద పట్నం గుండాలు దాడి చేసి మానాపహరణ చేయబోతే ఆ యువతులే అపరకాళికలై పోరాడారట. ఆ సందర్భాన్ని కూడా సహజ సిద్ధమైన కవితా పారిభాషిక పదాలతో చెబుతాడు దాశరథి.

'జాబిల్లి తన తట్టలోని నక్షత్రాలు
పారబోసింది
జంకుతూ పశ్చిమ దిశగుహ లోకి
పారిపోయింది
అవతరించాడు ప్రాగ్దిశలో జగజ్జ్యోతి
కవి రచించాడు వీర నారీమణుల
విజయగీతి'
(జ్యోతి పలికించిన గీతి)

ఒక ఉగాది కవితా పదాలు చూడండి

'నయన శయనాగారంలో నుంచి
నడచి వస్తుంది నవవర్షసుందరి
హిమచేలాంచలం ఎగిరిపోతుంటే
ఎంత పొంకంగా ఉంది ఆ మనోహరి'
(పరిణామ పర్వం)

ప్రాస వల్లనో, సందర్భం వల్లనో, ధ్వని కారణంగానో చమత్కరించడం దాశరథికి బాగా తెలుసు. ఆయన్ను వేదికల మీద చూసిన వారికిది ఇంకా బాగా తెలుసట. అయితే కవిత్వంలో ఆయన చమత్కారం తక్కువేమీ కాదు. రుబాయీలు రాసి చదివీ ఉన్నందున ఆయన వచన కవిత్వానికి కూడా ఆ ఛాయ తగులుతూ ఉంటుంది. నేనంటాను అంటూ

'కళ్ళెం ఉన్నది మన చేతిలో
గుఱ్ఱం మాత్రం పడగోతిలో
దప్పిక తీరదని నేనంటాను
నీళ్ళే అందని మన నూతిలో'

(నేనంటాను) అంటాడు. ఇలాంటి భావ చమత్కారాలే కాకుండా చిన్న చిన్న విరుపులతో రక్తి కట్టిస్తాడు. ఆనాడు కాళిదాసు ఒకటంటే ఈనాడు కాళిదాసు మరొకటంటాడని చమత్కరిస్తాడు.

దాశరథి వచనంలో అడుగడుగున అంత్యప్రాస ఉంటుంది. తొలిరోజుల్లో అది వచన కవిత్వ లక్షణంగా కూడా ప్రచారమై తర్వాత తిరస్కారానికి గురయింది. దాశరథి కవిత్వంలో ప్రాస ఎక్కడా తెచ్చిపెట్టుకున్నట్లుండదు. ఒకచోట

'మువ్వన్నెల బావుటా
నవ్వుతోంది అంతటా
హిమాలయం ముంగిట
సముద్రాల నందట' (వైజయంతిక)

అంటాడు.

ఒకచోట

'పచ్చగన్నేరు పువ్వులోన అందం
పచ్చలహారంలోనైనా శూన్యం'

(ఇంద్రధనుః కిరీటం) అంటాడు,

మరోచోట

'గాలికి ఆరే జ్వాలల వేలా?
కావలసినది హృదయజ్వాల
జీవితమంతా ఆరని తపన
చేయించును కవితో నవరచన'
(వెలుగు పాట)

వచన కవితలో లయకు ప్రాధాన్యత లేదు. అయితే కవికి పరంపరగా ఒక లయ వెన్నంటి వస్తుంది. దాశరథికి కూడా అది ఒక రకంగా సాంప్రదాయ ముద్రే. డా॥ సినారె చెప్పినట్లు ఒకనాటి ప్రయోగమే కాలం గడిచిన పిదప సంప్రదాయమవుతుంది. లయను వ్యతిరేకిస్తూ అత్యాధునిక కవులు రాస్తున్న కవిత్వంలో కూడా అంతు చిక్కని ఒక దీర్ఘలయ ఉంటుంది. దాన్ని గుర్తించడానికి ఇంకా విశాలమైన దృష్టి కావాలి. దాశరథి వచన కవితల్లో అప్రయత్న లయను అడుగడుగునా గమనించవచ్చు.

**దాశరథి కవిత్వంలో మధురమైన పద గుంభనం పాఠకుల్ని కట్టిపడేస్తుంది. చమత్కారం ఆయన కవితా రహస్యం. అంత్యప్రాస సహజంగా అతుక్కు పోతుందీయన కవిత్వంలో రిథమ్ ఆయన వచన కవితలో కూడా అప్రయత్నంగా పరుచుకపోతుంది. సూటిగా సాగే శుద్ధ వచన కవితల్లో కూడా చెక్కుచెదరని కవిత్వాంశ ఆయన సొంతం. అనుకోకుండా పడే పదచిత్రాలు, అలంకారాలు, అప్రయత్న సమాసాలు ఆయన వచన కవిత్వానికి వన్నెలద్దాయి.**

‘శివాలయావరణంలో
నవనవలాడే ఆకుపచ్చ కొమ్మల్లో
విచ్చుకున్న పచ్చ గన్నేరు సుమదళాన
వచ్చి కురిసింది తొలి మంచుసోన
చిరుబుట్టనిండా గన్నేరుపూలు
సిగనిండా ఇంద్రధనుశ్శకలాలు
జవ్వని పూజకు వెళుతోంది
స్వాగతం చెబుతోంది నంది’
(సంక్రాంతి గోరంటలు)

పై కవిత వచనంలో ప్రారంభమయింది. మొదటి నాలుగు పాదాలలో ఒక్కో పాదం నిడివి ఒక్కోలాగ ఉండడం గమనించవచ్చు. చివరి నాలుగు పాదాల్లో మొదటి రెండు పాదాలకు ఒక నిడివి చివరి రెండు పాదాలకు ఒక నిడివి ఏర్పాటై గేయ లక్షణాన్ని సంతరించుకుంది.

‘చూసినడు
చూసినడు
మళ్ళువిత్తి మల్లెలు వెతక్కు
అమృతం అనుకొని రుధిరం గతక్కు
అశాశ్వతమైన ధనరాశిని
శాశ్వతమని భ్రమపడి చితక్కు
చూసినడు
చూసినడు’ (కాలం వేసినగాలం)

ఇది కూడా స్వచ్ఛమైన వచన కవిత, గేయలక్షణాన్ని సంతరించుకుంది

దాశరథి కవిత్వానికి నిజమైన అలంకారం సూటిదనం. ఎలాంటి డొంక తిరుగుడూ లేకుండా ఆయన చెప్పే కవిత్వం చూడండి.

‘కరగని దొకటే కళాసంపద
తరగని దొకటే దయా సంపద
విరగని దొకటే విమల హృదయము
మరుగున పడనిది మంచి యొక్కటే
ఒడిపోనిది ఓరిమి ఒకటే
వీడిపోనిది వినయమొక్కటే
బెదిరి పోనిది చెలిమి ఒక్కటే
చెదిరి పోనిది ప్రేమ ఒక్కటే
జీవితమంతా ఊయలలూపే
కైపు యొసగునది కైతమొక్కటే’
అవునా కాదా?!

‘తొలగవలె దారిద్ర్య రేఖ వెలుగవలె
సాభాగ్యరేఖ
కర్షకులు, కార్మికులు, కవులు
కలిసి కృషి చేయుదురుగాక’ (రజత వైజయంతిక)

దాశరథి కవిత్వంలో భాష, ఊహలు కలిసి నడుస్తాయి. ఏదీ ముందుకురకదు. ఏదీ వెనకబడదు. విద్వాన్ విశ్వం చెప్పినట్లు ‘భావం త్రోసుకు పోవాలిగానీ, పదాలు వేరుగా వినిపించరాదని. రెండూకలగలసి రసధునిని ప్రబుద్ధం చేయాలి’ అన్న మాట దాశరథి అక్షరాలా పాటించాడు. ఆయన ఊహలు కూడా గొప్పవి. గోడలు పెడితే వెలుతురు ఆగనట్లు తెలంగాణ స్వాతంత్ర్య కాంక్ష ఆరదంటాడు. బాల్యం లోని నీడలు లేని మెత్తని వెన్నెలను వూహిస్తాడు. నరకం భూలోకం లోనే అనుభవించిన వాడు యముని మొహాన ఉమ్మినట్లంటాడు.

వస్తువు ప్రజలది. శిల్పం ఆయనది. ఆయన కవిత్వం తెలంగాణ మట్టిది.


## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

వ్యాసం

# ఉద్యమ గీతిక మూగపోయింది

తెలంగాణ గాయకుడు సాయి చందుకు నివాళి..


చిటుకుల మైసారెడ్డి
94905 24724


ఉద్యమ గీతిక మూగపోయింది. తెలంగాణ పాట దుఃఖిస్తుంది. సాంస్కృతిక, సాహిత్య ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. పాటల ఊట ఆగింది. నదిలో చెలిమే ఎండిపోయింది. పాటల ఇసుక తుఫాన్ గుండె ఆగింది. ఉద్యమ పాటల వేగు చుక్క నింగికెగిసింది. నడిచే తొవ్వ పాట ఏది అని అడుగుతున్నది. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు సాయి పాట కోసం క''న్నీళ్ళ' ప్రవాహం. ఉద్యమాల పాట చలించిన రోజు. తెలంగాణ ఉద్యమం స్వర ప్రవాహం ఆగింది. పాటల పేగుబంధం దూరమైంది.

పాలమూరు మట్టి బిడ్డ, కవి గాయకుడు సాయిచంద్ హఠాన్మరణం తీవ్ర విషాదం నింపింది. తెలంగాణ ఉద్యమంలో తమ్ముడు సాయిచంద్ పాట గొప్ప స్ఫూర్తి. స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం తన గొంతుక పాటై ఊపిరిలూదింది.

ఉగ్రూతలూగించింది. ఉద్యమ వేగుచుక్క వెదజల్లిన పాటల జ్వాల. జనహిత ఆకాంక్షల ఉద్యమ పాట పూదోట. ప్రగతి పల్లవి.. సంక్షేమ రాగం సాయి నోట చైతన్య పాట.

ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో తన పాట విజయం కంకణం కట్టుకుంది. అద్భుతమైన గొంతు మాధుర్యం. జే గంటలు మోగించే స్వర గీతిక. గంభీర గానం.

ఎంతో భవిష్యత్ ఉన్న కవి గాయకుడు సాయి చంద్ మరణం తెలంగాణ యావత్తును శోక సముద్రంలో ముంచింది. మలి దశ ఉద్యమంలో తన మాటల తూటాలతో ఆట పాటలతో.

తెలంగాణ ఉద్యమంలో ప్రజల్ని కదిలించాడు. పాటగా పాలమూరు బిడ్డ సాయి చంద్ ప్రాణం పోసుకున్నడు. పాటే ఊపిరిగా కవిగా ఉద్యమ కాలాన్ని ఉగ్రూతలూగించారు. అమరచింత కన్న బిడ్డ. ఉవ్వెత్తున సాగుతున్న తెలంగాణ ఉద్యమ సమయంలో సాయిచంద్ గళం తెలంగాణ గళం అయింది.

"రాతి బొమ్మల్లో కొలువైన శివుడా రక్త బంధం విలువ నీకు తెలియదురా" అంటూ అమరుడు శ్రీకాంత్ చారిని యాది చేసుకుని సందర్భంలో సాయి చంద్ పాడిన మిట్టపల్లి సురేందర్ రాసిన పాట తెలంగాణ హృదయాల్లో నిలిచింది.

ఆ పాట విన్న జనం కన్నీళ్లు పెట్టుకుంది. తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఊరూరా తన గొంతు ఉద్యమ గీతిక అయింది. లక్షలాది మంది జన సభల్లో సాయి పాట ఉద్యమ పౌరుషాన్ని నింపింది. పల్లె పల్లెన తన చైతన్య పరిచింది. ఉద్యమ సమయంలో తన గళం తెలంగాణ యాసను, గోసను వినిపించింది.



తన పాట మాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఊపుతెచ్చిన తెలంగాణ ఉద్యమ గాయకుడు. తెలంగాణ పునర్నిర్మాణంలో సైతం ప్రజలను చైతన్యపరుస్తున్న తన గుండె ఆగిపోవడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. తెలంగాణ ఒక గొప్ప గొంతుకను కోల్పోయింది. ఉద్యమంలో, పునర్నిర్మాణంలో తన పాటతో ఎంతో ప్రజల్ని ఉత్తేజపరిచారు. ధూం ధామ్ సభల్లో తన పాటతో చైతన్య పరిచారు.

సాయిచంద్ స్వగ్రామం వనపర్తి జిల్లా అమరచింత. 1984 సెప్టెంబర్ 20న మణెమ్మ, వెంకట్రాములు దంపతులకు జన్మించాడు. చిన్నప్పటి నుండే

ఉద్యమాల ఓనమాలు నేర్చాడు. తన గొంతు విభిన్నంగా ఉంటుంది. అద్భుతమైన గళం సాయిచంద్ సొంతం. దళిత సామాజిక ఉద్యమాలతో పాటు తెలంగాణ ఉద్యమంలో ముందున్నాడు.

"రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా.. రక్తబంధం విలువ నీకు తెలువదురా.. నుదుటి రాతలు రాసే ఓ బ్రహ్మదేవా.. తల్లి మనసేమిటో నీవు ఎరుగవురా" అంటూ గొంతెత్తి తెలంగాణ బాధను వినిపించిన కంఠం తెగిపోయింది.

ఉద్యమ పాట సాయిచంద్ ఇక లేడన్న వార్త తెలంగాణ ప్రజల్ని తీవ్రంగా కలచివేసింది.

రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా సాయిచంద్ ఉన్నత స్థాయికి ఎదిగే దశలో గుండె పోటు యువ గళాన్ని మింగింది.

ఉద్యమ పాటల కోట చిన్నబోయింది. మలిదశ ఉద్యమంలో తన స్వరం ఉద్యమ స్వరాలై నలుచెరుగులా వినిపించాయి.

కేసీఆర్ సభల్లో లక్షలాది జనాన్ని సాయి చంద్ తన పాటతో గంటల తరబడి కదలకుండా ఉత్తేజపరిచారు.

రాష్ట్రం ఏర్పాటు అయిన తరవాత బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రగతి పాలనకు పట్టు కొమ్మలై.. గులాబీ పరిమళాల ప్రగతి గీతిక. బీ.ఆర్.ఎస్ పార్టీ ఉద్యమ పాట గొంతుకై నినదించాడు.

రాష్ట్ర స్థాయి పదవి ఉన్న కూడా ఒక కళాకారుడిగానే ఎక్కువ గౌరవం తెచ్చి పెట్టింది. అదే అభిమానం ఆత్మీయతతో వేలాది మంది తరలివచ్చారు. లాంఛనాల కన్న గొప్ప గౌరవం దక్కింది. లక్షలాది జనం మదిలో నిలిచాడు.

ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ సాధారణ వ్యక్తిలాగా కడసారి చూపు కోసం ఎలాంటి బందోబస్తు హడావిడి లేకుండా సామాన్య జనంలా వచ్చి సాయి చంద్‌ను చూసి భావోద్వేగానికి గురై కంట తడి పెట్టారు. సాయి భార్య రజనీని ఓదార్చి నేనున్నా బిడ్డా అంటూ భరోసా ఇచ్చారు. తండ్రి వెంకట రాములను ఓదార్చారు.



మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, కళాకారులు, ఉద్యమ కారులు, సాహిత్యకారులు, అభిమానులు పెద్ద ఎత్తున కదిలి వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. అంటే పాట రూపంలో బతికే ఉన్నావు.

ఒక కళాకారుడు మరణించాక ఇంతటి గొప్ప గౌరవం పొంది తెలంగాణ ప్రజల ఆత్మీయ ప్రేమ సంపాదించాడు.

నీ మరణం తట్టుకోలేక తెలంగాణ రాష్ట్రమంతా తల్లడిల్లింది. కేటీఆర్, హరీష్, వేముల ప్రశాంత్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బాల్క సుమన్, దేశపతి శ్రీనన్న, రసమయి బాలకిషన్, ఎర్రోళ్ల శ్రీనివాస్ కంటతడి పెట్టారు. సాయి మరణం విని కవిత తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

అభిమానులు, ఉద్యమ కారులు, కళాకారులు కన్నీళ్లు పెట్టుకున్నారు. సాయి చంద్ మరణం విన్న తెలంగాణ సమాజం అంతా విషణ్ణవదనంతో ఎక్కడిక్కడ నివాళులు అర్పించారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు టీవీలు, సోషల్ మీడియాలో సాయిచంద్ మరణం దృశ్యాలే. జోహార్ సాయిచంద్ అంటూ సందేశాలు. తెలంగాణ ప్రతి ఇంట్ల గాయకుడు సాయిచంద్ మరణం గురించి అయ్యో బిడ్డ అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

పల్లా రాజేశ్వర్ రెడ్డి, బాల్క సుమన్, రసమయి బాలకిషన్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మిట్టపల్లి సురేందర్, తాడబోయిన విజయ్ లతో పాటు వేలాది ఉద్యమకారులు, కళాకారులు అభిమానులు సాయిచంద్ దహనసంస్కారాలు పూర్తయ్యే వరకు ఉండి. పాడెను మోసి.. ఆత్మీయ తమ్ముణ్ణికి కడసారి కన్నీటి వందనాలతో వీడ్కోలు పలికారు.

రాతి బొమ్మల్లో కొలువైన శివుడా..
రక్తబంధం విలువ నీకు తెలియదురా..
పాటతో ఆఖరి చితి మంటల్లో....
జోహార్లు సాయి చంద్...

కథ

# దేశం బోతున్న...!

మస్కట్‌లో భారతీయుల కష్టాలు...




కళా గోపాల్
91826 45239


"నీకెన్నిసార్లు చెప్పినా నెత్తికెక్కుత లేదు. పెండ్లి జేసుకోరా మనమడా. నా అసోంటి ముసలవ్వకు నీ పెండ్లాం జెర రెక్కకు, బొక్కకు ఆసరా ఉంటుంది. దినాం తెల్లారితే పొలాలపొంటి పోవుకుంట పని జేత్తుంటే కండలు కరిగి ఎండిన సొరచేప లెక్క అయిపోతున్నవు. గా పొలం కుదవబెట్టి మనూర్లె అందరు పొల్లగాండ్ల లెక్క నువ్వు సుత దేశం బోతే ఏమైతది? ఇక్కడి ఆమ్దానీ అంతా పొలాల ఎరువులకు, కూలీలకే పోవట్టే. ఇగ పైసలెక్కడియి. ముందు ముందు ఏం జమాయిస్తవు. గిట్ల అట్టి చేపోలె తయారైతే ఇగ నీకు పిల్లనెవడ్డిరు. నేనెప్పుడు నీ పెండ్లి జూస్తు!" అంది గంగవ్వ పొద్దుపొద్దున్నే తయారయి పొలం పనులకు వెళ్తున్న మల్లేష్‌తో.

తల దువ్వుకుంటూ ఆలోచనలో పడ్డాడు మల్లేష్. అవ్వ పోరుతున్నది నిజమే. ఎండనక, వాననక దినాన్ని చెమటచుక్కలుగా మార్చి ఆరుగాలం శ్రమపడితే వచ్చే పైసలు తిండికి, వ్యవసాయ పనులకు, ఉన్న నాలుగు పశువుల మేతకే సాలుతలేవు. మొన్ననే దుబాయ్, మస్కట్ బోయి అచ్చిన మటన్ దుకాణం బషీర్ కల్సిండు. మనిషి ఎంత నున్నగ అయిండు. పూలచొక్కా, నల్ల కళ్ళద్దాలు, జేబుల పెద్ద సెల్‌ఫోన్. చేతికి కంపెనీది పెద్ద గడియారం, మెడలో తళతళలాడే దుబాయ్ బంగారు గొలుసు. పూల రుమాలు తలకు చుట్టుకొని మొన్నటి ఆదివారం అంగడిలో కల్సిండు. వాడి దగ్గరికి వెళ్తే గుమ్మగ అటకాయించే సెంటువాసన. అబ్బ! మస్తుగన్పించింది. ఇగ గట్ల సంపాదించి ఈ ఊర్లెనే పెంకుటింటి జాగల కొత్త స్లాబ్ ఇల్లు కట్టుకోవట్టిరి. ఛీ! నేనూ ఉన్నా ఎందుకు? అవ్వ అంటున్నది నిజమే. పదోది ఫెయిలయ్యిన నాకు గీ పొలం పని తప్పితే ఏమీ తెల్వదు. ఇయ్యాల ఎట్లయినా బషీర్ భాయిని కల్సి, మస్కట్ ముచ్చట దియ్యాల అనుకొని మల్లేష్ గంగవ్వతో "అవ్వా! ఇయ్యాల అచ్చేసరికి ఆలశ్యమైతది. టిఫిన్ ఎవరితోనైనా పంపియ్యి. పొలానికి మందుకొట్టించాలి" అనుకుంటూ గుడిసె నుండి బయటకు నడిచాడు.

మల్లేష్ వెళ్ళేసరికి పొలమంతా చిత్తడిచిత్తడిగా ధ్వంసమయింది. దొంగ పశువులేవో అతడి పొలంలో పడి అందినకాడికి పరపరా నమిలాయి. అది చూసి మల్లేష్ గుండె ఆగినంత పనైంది. గబగబా వెళ్ళి ఆ రెండు బర్రెలను తాడేసి లాగి, ఊరి చివర నిర్మించిన దొంగ పశువులను కట్టివేసే కట్టం కల్కర్ (బంజరుదొడ్డి)లో బంధించాడు. కోపంతో అట్నుంచి అటే కిష్టయ్య ఇంటిమీదికెళ్ళి గొడవ పెట్టుకొని ఇంకా నయం నేనింక పొలానికి మందు కొట్టియ్యలేదు. పంటకు గనుక మందు గొడితే, గీ పశువులు గాడ్దే సచ్చి ఊరుకునేటియి అనుకుంటూ ముఖం వేలాడేసుకొని గుడిసెకు వచ్చిండు. కట్టెలపొయ్యిపై అన్నం, కూర కుతకుత ఉడుకుతున్నది అచ్చం మల్లేష్ మనసులాగే. గంగవ్వ పెరట్లో పనిచేసుకుంటున్నది.

మల్లేష్ పాత ట్రంకుపెట్టె తెరిచి అందులో భద్రంగా దాచిన ఓ పదివేల కట్ట, గంగవ్వ అక్కరకు వస్తయని దాచుకున్న వెండి కడియాలను తీసుకున్నాడు. అదే ఊపులో ఊరిమధ్య గాంధీబొమ్మ దగ్గర ఉన్న బషీర్ ఇంటికి వెళ్ళాడు. చేతిల డబ్బుపెట్టి తనను ఎట్ల అయినా సరే మస్కట్‌కు పంపియ్యమని ఒక్కతీరుగ బతిమాలి తాను వెళ్ళినాక అక్కడ ఏదన్న లేబర్ పని చూసి వివరాలు తెలుపుతానన్నాడు బషీర్.

మరో మూణ్ణెళ్ళు గడిచాయి. అనుకున్నట్టే ఓరోజు బషీర్ నుండి జవాబు.. దాంతోపాటే వీసా, ప్రయాణపు ఏర్పాట్లు ఖరారయ్యాయి.

* * *

ముసలవ్వ మనసు మురిసిమురిసి పోసాగింది. తన మనుమడు ఎట్లాగయినా దేశం బోతున్నడు. తనకు గదే సాలు. ఓ రెండు మూడేళ్ళు కష్టపడి తిరిగొస్తే ఓ ఇంటివాడవుతాడు. ఎవరూ లేని తన

గుడిసె బతుక్కి వాడే దారిదీపం అనుకుంది.

మల్లేష్ తయారయి పట్నం బోయే రోజు గంగవ్వ మనసు ముసురుకున్న దు:ఖమేఘంగా ఉంది. "బిడ్డా మల్లేషూ! జర పయిలం. దేశంగాని దేశం బోతున్నవు. ఎవ్వరితోని కొట్లాటలు పెట్టుకోకు. నీవసలే ఆవేశపరుడివి. నీకు జెరంత కోపమూ, వేపకాయంత వెర్రీ ఎక్కువనే. అక్కడ మనకు ఎవరూ ఉండరు. ఉన్న ఊర్లె ఉన్న బలం వేరే! పర ఊర్ల అణిగిమణిగి ఉండాలె! పైసలు ఎక్కువ ఖర్చుపెట్టకు. ఆరోగ్యం జాగ్రత్త! గీ అవ్వకు అప్పడప్పుడు కారట్ ముక్కలు రాయి. ఎవరితోనన్నా సదివించుకుంట" అంటూ మనవడికి సుద్దులు చెప్పి బస్సు ఎక్కించింది గంగవ్వ.

★ ★ ★

ఆ ఏడు సరిగా వానలు పడక తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఊరంతా కరువు రాజ్యమేలింది. కొనబోతే కొరవి, అమ్మబోతే అడవి అన్నట్లుగా తయారయ్యింది గంగవ్వ పరిస్థితి. ఉన్న పొలమూ ఎండిపోయింది. మల్లేష్ సంపాదించిన పైసలతో వేయించిన కొత్తబోరు నీటిచుక్క లేక సొరంగంలా నోరు తెరిచింది. పొలమంతా బంజరుబీడులా తయారైంది. అక్కడా ఇక్కడా చేబదులుతో కాలం గడిపిన గంగవ్వ అనుకోకుండా భీమారి పడింది. కండ్లల్ల మనుమడు మల్లేష్ జ్ఞాపకాలు లోలకాలై మెదలసాగాయి. పొల్లగాడు ఎట్లున్నడో ఏమో? అనుకుంటూ పెద్దమనిషి బెంగ పెట్టుకొంది. అప్పుడప్పుడు డబ్బు అందినా అది గద్ద కోడిపిల్లల్ని తన్నుకుపోయినట్లు అప్పులవారి జమాఖర్చులకే సరిపోయాయి. మళ్ళీ ఎక్కడనా చేబదులు తీసుకోనిదే జీవనం సాగేటట్లు లేదు. వచ్చే ఏడు వానలు పడితే ఉన్న అరెకరం పొలం అమ్మేసి అప్పులు కట్టాలని రూఢి చేసుకుంది గంగవ్వ.

అటు మల్లేష్ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్లుగా ఉంది.



మస్కట్‌లో ఎవరి ఉద్యోగాలు వారికేనంటూ నితాఖత్ విధించారు. మల్లేష్ చేసుకుంటున్న లేబర్ పని ఊడింది. చేతిల పైసల్లేని దిక్కుతోచని పరిస్థితి బషీర్ దగ్గరికి వెళ్ళి గోడు వెళ్ళబోసుకున్నాడు.

"గిదంతా ఇక్కడ సాధారణమే. ఒక్కొక్కరు వీసా లేకపోయినా అక్కడ ఇక్కడ కళ్ళు కప్పి ఒంటెలను మేపేపని చేసుకుంట బతుకుతరు. గిప్పుడే పల్లెకు వోయి ఏం జేస్తవ్? దరిద్రం రాజ్యమేలుతున్న పల్లె బతుకుల్లో అప్పులకుప్ప నీ పొలాన్ని ఎట్ల దక్కించుకుంటవ్? మా యజమాని దగ్గర పన్జేయ్" అంటూ ఓరోజు ఒంటెలను మేసే పనికి కుదిర్చాడు.

గదంతా ఒట్టి బండపని. కొన్ని కిలోమీటర్ల ఎడారిలో ప్రయాణం. ఒంటెలను తీసుకొని వచ్చేసరికి మల్లేష్ నవనాడులు కృంగిపోయేవి. విపరీతంగా దాహం వేసేది. ఎండ తీవ్రతకు కళ్ళు చెదిరి బైర్లు కమ్మేవి. పెరిగిన బవిరి గడ్డం, గుంతలుపడిన కళ్ళు, ఎండిన డొక్కలు, పరాయి దేశపు ఆకాశం బికారి పక్షి జీవితం! ఓ గమ్యమూ లేదు. ఓ స్వాంతన వనచమూ లేదు. ఎట్లనో అట్ల ఒకరోజు వాళ్ళ అవ్వకు కారట్ ముక్క రాయించిండు. తాను మంచిగనే ఉన్నట్లు. వీలు చూసుకొని రంజాన్ సెలవుల్లో వస్తానని కబురు చేసిండు.

కాని ఇంతలో జరగకూడని ఘోరం జరిగిపోయింది. ఉన్న ఆ కొద్దిరోజుల వీసా గడువు ముగిసింది. వీసా లేకున్నా తమ దేశంలో అక్రమంగా ఉంటున్న నేరం మీద అక్కడి అదాలత్ మల్లేష్‌కు కఠిన కారాగారశిక్ష విధించింది. ఇప్పుడు మల్లేష్ కటకటాలను లెక్కబెడుతూ దైన్యపు పరిస్థితిలో... అతి హీనంగా రోజులను గడుపుతున్నాడు.

అటు రాని మనుమడి కొరకై నిరీక్షిస్తున్న గంగవ్వ...! పొద్దు గుంకదూ! తెల్లారదూ అన్నట్లున్న పరిస్థితిలో మల్లేష్‌ను తల్చుకొని, వచ్చే రంజాన్‌కన్నా వస్తాడేమో?! నన్న గంపెడాశతో కొడిగడుతున్న వృద్ధప్రాణం పల్లెలో ఎదురుచూస్తూనే ఉంది! ఊర్లె ఎవరన్నా రాజకీయనాయకులు వస్తే వారికి తన గోడు వెళ్ళబోసుకునేది. వారు వినీవిననట్లుగా "మీ కుటుంబాలకు న్యాయం చేస్తాం. దుబాయ్ వాసుల గోడు తీరుస్తాం. వలసకూలీలను వెనక్కి రప్పిస్తామంటూ" ఓ కంటితుడుపు హామీ పడేసేవారు, తప్పితే చిత్తశుద్ధితో ప్రయత్నించిన దాఖలాలు లేవు. గప్పట్ల కట్కర్‌లో బంధించిన దొంగపశువుల లెక్క వ్యవస్థలో తమని మోసం చేసిన వ్యక్తులను కట్కర్‌లో గట్లనే పలుపుతాడేసి కట్టేస్తే బాగుండునన్న ఉక్రోషంతో ముసలవ్వ ఆయాసపడేది.

బషీర్‌లాంటి వంచకుల మాటల ఉచ్చులో ఇరుక్కొని ఇటు స్వదేశానికి రాలేక, అక్కడి జైళ్ళలో మగ్గుతున్న మల్లేష్‌లాంటి వారెందరో కట్కర్‌లో వేయదగ్గ మాయదారి మనుషులను తల్చుకొని కసితో పళ్ళు నూరుతున్నరు.

వ్యాసం

# దాశరథి కృష్ణమాచార్య (1925-1987) - వచన రచనలు

వచనం రాయడంలో దాశరథి ప్రతిభ...



డా॥ సంగనభట్ల నరసయ్య
94400 73124

దాశరథి అనగానే పద్యం గుర్తుకువస్తుంది. పద్యశిల్పంలో అది అమోఘమైన హస్తం. ఆ శిల్పం అనితరసాధ్యం. అంగార శృంగారాలు, దీనజనోద్ధరణ, సమాజప్రగతి, రాచరికపు నిరసన ఏది రాసినా పద్యం బిగువు సడలని నిర్మాణ సౌందర్యం మనల్ని మంత్రముగ్ధులను చేస్తుంది. ఐతే దాశరథి ఇతర ప్రక్రియలను తన కలంతో సంపద్వంతం చేశాడు. వాటిలో శతకాలు, గేయాలు, వచనరచనలు, ప్రసంగ సాహిత్యం, సాహిత్య విమర్శ, గజళ్ళు మొదలగునవి పేర్కొనవచ్చు. వీటిలో వచన ప్రక్రియ రాశిలో వాసిలో శ్రేష్ఠమైందే.

దాశరథి వచన రచనల్లో నవల, నాటకం, కథ, సాహిత్య విమర్శ ప్రధానమైనవి.

**నవలిక...**

- 'మహాశిల్పి జక్కన' అరవై రెండు పేజీల నవలిక. ఇది చారిత్రాత్మక వచనరచన. (1964)
- 'అద్దాలమేడ' ఒక అనువాద నవల. అరిగపూడి రమేశ్ చౌదరి హిందీ మూలానికి తెలుగు సేత. ఇది 105 పేజీల నవలిక.

**నాటికలు (నవమి)...**

- తొమ్మిది నాటికలు రాశాడు దాశరథి. అవి నవమి పేరుతో ముద్రితం. వాసనలేని పూలు, యశోధర, చిత్రాంగద, మహాశ్వేత, నేనొక్కణ్ణే కాను, స్వాతంత్ర్య వాహిని, గోల్కొండ, నియాన్ లైట్, తుంగభద్ర (అన్ని కలిపి 150 పేజీలున్నాయి.) ఇవి కాక మహాబోధి, మహా పరినిర్వాణము, మహాశ్వేత, త్యాగజ్వాల అనేవి మరో నాలుగు నాటికలు ముద్రితాలు.





**సాహిత్య వ్యాసాలు (వ్యాసపీఠం) 1985...**

- అన్నమయ్య, విద్యాపతి, తెనాలి రామకృష్ణుడు, పోతనామాత్యుని కవితాశిల్పం, మలయ భాషా స్వరూప స్వభావాలు, మహాభారతంలో ఉపాఖ్యానాలు, మహాకవి మీర్జాగాలిబ్.

**యాత్రావ్యాసాలు (యాత్రాస్మృతి) 1988...**

- విపులాచ పృథ్వీ, అమెరికా సందర్శనం, మలేషియాలో తెలుగు వెలుగులు మొదలగునవి (20 పేజీలు)

**బాల సాహిత్యం (1960)...**

- డా॥ సి.నారాయణరెడ్డి గారితో కలిసి 1) శంకర్స్ బొమ్మల బాల రామాయణం 2) శంకర్స్ బొమ్మల బాల భాగవతం 3) శంకర్స్ బొమ్మల బాలల భారతం.

**చరిత్ర...**

- ప్రాచీన లక్నో (అనువాదం) (1971).

**నిఘంటువు...**

- బాలసరస్వతి తెలుగు - ఇంగ్లీష్ డిక్షనరీ (సంయుక్త రచన) (1979).

**వ్యాఖ్యానం...**

- జయదేవ కృత గీత గోవిందానికి వ్యాఖ్య.

**కథలు (జలంధర్ సంకలనాలు - 2015) (30 పుటలు)...**

- నిప్పుపూలు (6 పేజీలు), రక్తాంజలి (6 పేజీలు), వెన్నెట్లో చీకటి (6 పేజీలు), బదరి (9 పేజీలు)

**నాటికలు (37 పుటలు)...**

- మహాబోధి (10 పేజీలు), మహాపరి నిర్వాణము (12 పుటలు), మహాశ్వేత (10 పుటలు), త్యాగజ్వాల (35 పుటలు)

వ్యాసం

**దాశరథి వచన రచనల్లో పెద్దది. ఇది చారిత్రాత్మక కథ అని దాశరథి పేర్కొన్నాడు. ఇది నవలిక అనవచ్చు. కర్ణాటక ప్రాంతాన్ని క్రీ.శ. 12వ శతాబ్దంలో పాలించిన హొయసల విష్ణువర్ధన మహారాజు కాలంలో ఆయన కోసం బేలూరు, హళెబీడులలో నిర్మించిన ఆలయాల కాలపు కథ. ఇది వాస్తవంగా జరిగింది. ఇది నవలిక అయినా కొంత వివరణాత్మత (డిస్క్రిప్షన్) తో వ్యాసంలా నడిచింది.**

**నవలలు...**

● మహాశిల్పి జక్కన

దాశరథి వచన రచనల్లో పెద్దది. ఇది చారిత్రాత్మక కథ అని దాశరథి పేర్కొన్నాడు. ఇది నవలిక అనవచ్చు. కర్ణాటక ప్రాంతాన్ని క్రీ.శ. 12వ శతాబ్దంలో పాలించిన హొయసల విష్ణువర్ధన మహారాజు కాలంలో ఆయన కోసం బేలూరు, హళెబీడులలో నిర్మించిన ఆలయాల కాలపు కథ. ఇది వాస్తవంగా జరిగింది. ఇది నవలిక అయినా కొంత వివరణాత్మత (డిస్క్రిప్షన్) తో వ్యాసంలా నడిచింది. శిల్పం, ఆలయాలపట్ల దాశరథికి గల మక్కువ వల్ల ఆయాచోట్ల నవల అన్నది మరచి వ్యాసంలా రాశాడు. కొన్నిచోట్ల దాశరథిలోని కవి బయటకు వచ్చాడు. ఇది సరళ గ్రాంథికంలో నడచిన వచనరచన.

● అద్దాల మేడ

ఇది దాశరథి గారి అనువాద నవల. అరిగపూడి రమేశ్ చౌదరి హిందీ నవలను ఈ పేరుతో అనువదించారు. మధ్యతరగతిలోని దర్జీ ఎగువతరగతికి ఎగబాకి, కుటుంబ సౌఖ్యం, పరస్పర ప్రేమలు మరచి సంఘంలోని స్థాయినే శాశ్వతం అనుకొని, చివరకు బుద్ధి వచ్చిన నవల ఇది. అనువాదం బాగుంది. స్వతంత్ర రచనలా అనిపిస్తుంది.

● 'నవమి' (నాటికలు)

తొమ్మిది నాటికల సంకలనం. ఐదు పౌరాణిక నాటికలు, స్వాతంత్ర్య ఉద్యమ జీవితాల నాటికలు రెండు, సాంఘిక నాటికలు. వీటిలో-

1) 'యశోధర' బుద్ధుని భార్య. బుద్ధుణ్ణి ప్రశ్నించడం ఈ నాటకంలో ఇతివృత్తం. సంవాదం బాగుంది. యశోధర ఆర్తిని బుద్ధుని ప్రజ్ఞను దాశరథి బాగా చిత్రించాడు. దాశరథి నవలల్లో అత్యంత ప్రతిభాన్వితం.

2) చిత్రాంగద' అనువాద నాటిక. నాయిక వీరనారి. అర్జునున్ని ప్రేమిస్తుంది. ఠాగూరు గేయరూపకానికి ఇది వచనానువాదం. ప్రదర్శనకు కూడా బాగుంటుంది.

3) 'మహాశ్వేత' ప్రేమజీవులగాథ. గంధర్వకన్య, మహాశ్వేత, పుండరీకులు పరస్పరం ప్రేమలో పడతారు. ఇది బాణభట్టు కాదంబరిలోనిది.

4) 'తుంగభద్ర' నాటికలో వేణుగానం







చేసే తుంగడు, భద్రావతిని ఆకర్షిస్తాడు. భద్రావతి తండ్రి చండీశ్వరుడు. కూతురిని అంత:పురంలో కదలకుండా ఉంచుతాడు. తుంగడు రక్షణ వలయాన్ని ఛేదించి, భద్రావతిని తీసికొని పారిపోతాడు. సైనికులు వెంబడి పడతారు. వీరు కొండ ఎక్కి చెరోవైపు దూకి ప్రాణత్యాగం చేస్తారు. అవి రెండు నదులుగా ప్రవహిస్తాయి. వీరిద్దరి కలయిక తుంగభద్ర అయిందని కవి నిష్కర్ష.

5) 'గోల్కొండ' నాటకంలో ప్రేమించిన యువరాజును త్యాగబుద్ధితో పరిత్యజించి, ఆత్మహత్య చేసికొన్న ఒక దాసి కథ.

6) 'స్వాతంత్ర్య వాహిని' స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి గాథ.

7) 'నేనొక్కణ్ణే లేను' నాటికలో దేశసేవ కోరే యువకుని గాథ. గాంధేయతత్త్వం ఒంటబట్టించుకొన్న ఒక యువకుని గాథ.

8) 'వాసనలేని పూలు' అయిష్టంగా ఉండే నాయికను నాయకుడు తనవైపు తిప్పుకునే కథ.

9) 'నియాన్ లైట్' నాయకుడు పరిస్థితులు త్వరగా అర్థం కాని మట్టిబుర్ర. ట్యూబ్‌లైట్‌లా ఆలస్యంగా వెలుగుతాడు. ఇది ఒక హాస్య, వ్యంగ్య నాటిక. కన్నడానువాదం.

ఇవి రేడియో కోసం రాసిన నాటికలు. సంవాదశైలి ప్రాణం. శ్రవణం కోసం రాసినవి. కనుక శ్రవ్యనాటికలనవచ్చు. రేడియో శ్రోతలు బాగా స్పందించిన కాలపు నాటకాలు. దాశరథి రేడియోలో పనిచేస్తున్నప్పుడు రాసినవి. ఆయన భావజాలానికి, అభ్యుదయానికి భిన్నమైన ఇతివృత్తాలు. సంభాషణలు సుందరంగా నాటకకర్త శక్తిని వ్యంజిస్తున్నాయి.

### సాహిత్య వ్యాసాలు...

వ్యాసపీఠం పేరుతో వచ్చిన తొమ్మిది వ్యాసాల్లో ఆరు వ్యాసాలు సాహిత్య విమర్శకు సంబంధించినవి. సంస్కృతం, ప్రాచీన సాహిత్యం బాగా చదువుకున్న దాశరథి అపుడపుడు రాసిన వ్యాసాలివి.

తెలుగునాట అన్నమయ్య, ఉత్తర బీహార్‌లోని విద్యాపతి వాగ్గేయకారులు. వీరిని పరిచయం చేస్తూ, వారి గీతాలతో కొన్ని తనియింపచేసిన తులనాత్మక అధ్యయనం 'అన్నమయ్య విద్యాపతి', వ్యాసం 'తెనాలి రామకృష్ణుడు' ఆయన సాహిత్య జీవితం, పాండురంగ మహాత్మ్యంపై వచ్చిన సాహిత్య ప్రశంసా వ్యాసం. ఇది మొదట ప్రసంగం. బొంబాయిలోని ఆంధ్రమహాసభ వారు పిలిస్తే ప్రసంగించాడు. ఇది ప్రత్యక్షంగా నాకు వినే అవకాశం కల్గింది. 'పోతనామాత్యుని కవితాశిల్పం' బమ్మెర పోతన సాహిత్య మాధుర్యాలను పంచేది. పోతన అనుప్రాసల అందం, పద్య ధారాశుద్ధి, రసావేశం ఇలా బహురీతులుగా దాశరథి




మహాకవికి అక్షర నివాళినిచ్చాడు. భోగినీ దండక ఛాయలు భాగవతంలో చూపినాడు. మహాకవి మీర్జాగాలిబ్ గూర్చి రాస్తూ "మృతియె లేకున్న రుచి యేది బ్రతుకులోన" అనగల్గిన మహాకవిగా చిన్న వ్యాసంలో గాలిబ్‌ని తెలుగువారికి పరిచయం చేసినాడు. మహాభారతంలోని ఉపఖ్యానాలన్నీ వ్యాసంలో భారత గాథలకు రుచికరమైన వ్యాఖ్యానం చేసాడు. అయితే ఈ మహాభారత విమర్శ తెలుగు భారతానిదే. మలేషియా భాషను లోతుగా అధ్యయనం చేసి, వ్యాకరణరీత్యా ఆ భాషను పరిశీలించి భాషా శాస్త్రశక్తిని ప్రదర్శించినాడు. మలేషియాలో తెలుగు వెలుగు యాత్రల వ్యాసం. మలేషియాలో దాశరథి గారి పర్యటన విశేషాలు వివరించారు. అలాంటిదే "అమెరికా సందర్శనం" వ్యాసం. 'విపులాచపృథ్వీ' మరో యాత్రా చరిత్ర వ్యాసం. లండన్ పర్యటన విశేషాలు రాసారు. చివరి మూడు వ్యాసాలు దాశరథి లోకానుభవానికి, సాహిత్యానుభవానికి దర్పణ సదృశాలు.

పై ప్రౌఢ రచనలే గాక డా॥ సి.నారాయణరెడ్డితో కలిసి శంకర్స్ బొమ్మల బాలల రామాయణం, భాగవతం, భారతం రాసాడు. ఇవి అతి సరళ వచన రచనలు. బాలలను ఉద్దేశించినవి. పేజీ నిండైన బొమ్మలతో అందంగా ముద్రించబడిన ఈ బాలసాహిత్యం ఇద్దరు మహాకవుల జమిలి రచనగా తెలుగు బాలలకోసం రాయబడ్డవి.

ప్రాచీన లక్నో అన్న అనువాద చారిత్రక గ్రంథం, బాలసరస్వతీ బుక్ డిపో వారి కోసం రాసిన ఇంగ్లీష్ తెలుగు కోశం, జయదేవకృత గీత గోవింద తెలుగు వ్యాఖ్య ఇతర వచన రచనలు. ఇవి దాశరథి బహుముఖీన ప్రతిభకు సాక్ష్యాలు.

ఇక మిగిలిన నాటికలలో మహాబోధి, మహాపరినిర్వాణం, మహాశ్వేత, త్యాగజ్వాల అనేవి పరిశీలించాలి. ఇవి తెలంగాణ భాష సాంస్కృతిక మండలి, తార్నాక, హైదరాబాద్ వారు అచ్చువేశారు.

**తెలుగునాట** అన్నమయ్య, ఉత్తర బీహార్‌లోని విద్యాపతి వాగ్గేయకారులు. వీరిని పరిచయం చేస్తూ, వారి గీతాలతో కొన్ని తనియింపచేసిన తులనాత్మక అధ్యయనం 'అన్నమయ్య విద్యాపతి', వ్యాసం 'తెనాలి రామకృష్ణుడు' ఆయన సాహిత్య జీవితం, పాండురంగ మహాత్మ్యంపై వచ్చిన సాహిత్య ప్రశంసా వ్యాసం. ఇది మొదట ప్రసంగం.

'మహాబోధి' నాటకంలో మన్మథుని కూతురు నవ మల్లిక తన బలగంతో వచ్చి బుద్ధుణ్ణి మోహితుణ్ణి చేయాలని అనుకుం టుంది. విఫలమవుతుంది. బుద్ధుడు సమాధిలోకి పోతాడు. ఆనందుడొక్కడే బుద్ధుని స్థితిని అర్థం చేసుకొంటాడు. బుద్ధుడు పరిపూర్ణుడై ప్రజలకు సందేశం ఇస్తాడు. నాలుగే పాత్రలు. దీనిలో కథలేదు. నాటకం ఆలిండియా రేడియో మద్రాసు కోసం రాసింది. స్రవంతి మే 1956లో అచ్చైంది.

'మహాపరినిర్వాణం' వేరొక నాటిక. ఎనిమిది పాత్రలు. నందుడు (బుద్ధుని తమ్ముడు), కళ్యాణి (సుందరి) అతని భార్య బుద్ధుని మరదలు. వీరి మాటలలో సన్యాసం స్వీకరించాలని గత బంధాలు స్మరించుకోరాదని చెప్పుకొనే సంభాషణలు మనోహరంగా ఉదాత్తంగా ఉంటాయి. బుద్ధుడు చనిపోయే తుదిఘడియలు ఈ నాటకంలోని కథ. నిజానికి దీనిలోను కథలేదు. బుద్ధుని ఆఖరు నిమిషాలను వర్ణించాలనుకున్నాడు కవి. ఇది జూన్ 1956లో స్రవంతిలో అచ్చైంది.

'మహాశ్వేత' నాలుగు పాత్రల నాటిక. నాయకుడు చెలికాడు. నాయిక చెలికత్తె. మహాశ్వేత గంధర్వ రాకుమార్తె. భోగి. పుండరీకుణ్ణి ప్రేమిస్తుంది. భోగయోగాల మధ్య, ప్రేమ విరాగాల మధ్య ఘర్షణలా ఈ నాటిక చిత్రించబడింది. కథ లేదు. కేవలం ఒక్క చిన్న సంఘటన నాటకీక రించబడింది. స్రవంతి జూలై 54లో అచ్చైంది.

'త్యాగజ్వాల' స్వాతంత్ర్య సమరయోధుని కథ. 4 ప్రధాన పాత్రలు. యోధుని కుటుంబంలో వారు మానసికంగా నలిగిపోయే కథ. కథలో మలుపులున్నాయి. నాటక నిర్వహణ బాగా సాగింది. జాతీయోద్యమ కాలంనాటి ఆదర్శాలు పాత్రల జీవితాలుగా నడుస్తాయి. సత్యాగ్రహం, దానికి వ్యతిరేకమైన హింసామార్గం. వీటిని ఆచరించే వారి మధ్య సంఘర్షణ నాటకంలో చక్కటి సంభాషణలుగా మలచబడ్డాయి. కథ సుఖాంతం మంచి నాటకం. 1985లో జాతీయ కాంగ్రెస్ శతాబ్ది సందర్భంగా రాసింది.

దాశరథి కథల్లో 'నిప్పుపూలు' కథ చిత్రమైన కథ. జమీందారిణి బేగం ఇల్లువదిలి సాధారణ జీవితంలోకి ప్రవేశించే కథ. గౌరి, బేగంల మధ్య జీవితాల తులన, తంగేడు పువ్వులా సాధారణంగా మారిన జీవితం ఇవి కథలో సంకేతాలు. కథనం బాగున్న చిన్నకథ.

'తెలంగాణ అమరవీరుని రక్తాంజలి' కథ చాలా చిన్నది. పోలీస్ బ్యారక్స్‌లో విశ్వం అనే స్వాతంత్ర్య వీరుని కథ. విశ్వం, పోలీసులు, రజాకార్ల దౌర్జన్యాలను హింస్మాత్మకంగా ఎదుర్కోవటం, తన శౌర్యాన్ని ప్రదర్శించటం ఒక డాక్యుమెం టరీగా నడుస్తుంది. ఇది కథలా ఉండదు. ఒక సంఘటనను వర్ణనాత్మకంగా నడిపాడు. బహుశ ఇది దాశరథి జైలులోని బాధల్లోంచి వచ్చిన ఆవేశమేమో!

'వెన్నెల్లో చీకటి' కథ అనువాదం. కర్తార్ సింగ్ దుగ్గల్ పంజాబీ మూలానికి దాశరథి అనువాదం. 1964లో ఆంధ్రప్రభలో అచ్చయింది. ఒక అసహజమైన అక్రమసంబంధం అమాయ కురాలైన కూతురి ఆత్మహత్యకు దారితీసిన కథ. కథలో నైతికత లేదు. సహజత్వం లేదు. మలుపులు మాత్రం గుక్కతిప్పుకోనివ్వవు. కథను ఇష్టపడి అనువదించిన దాశరథి తెలుగు సమాజానికి ఎందుకు అందించాడో తెలుసుకోలేం.

'బదరి' కథ చాలా విచిత్రమైన కథ. పసితనం నుండి పెంచిన తన మరిదికి కథ చెప్తూ అతని స్పర్శకు పరపురుష స్పర్శకు లోనుకావడం ఒక వింతగా అనిపిస్తుంది. చెప్పిన కథలో బదరి పండులో నుండి రాజకుమారి బయటకు రావడం, ఆమె ద్వేషబుద్ధి గల వారి చేతిలో చంపబడటం వంటి కథనంతో ఫెయిరీ టేల్ (జానపద గాథ)గా మరింత అసహజంగా ఉండటం జరిగింది. ఇది మనోవైజ్ఞానిక కథలా, చైతన్య స్రవంతి విధానంలో సాగింది. కథకుడు ఏ లక్ష్యంతో కథనం చేసాడో అర్థం

**'త్యాగజ్వాల' స్వాతంత్ర్య సమరయోధుని కథ. 4 ప్రధాన పాత్రలు. యోధుని కుటుంబంలో వారు మానసికంగా నలిగిపోయే కథ. కథలో మలుపులున్నాయి. నాటక నిర్వహణ బాగా సాగింది. జాతీయోద్యమ కాలంనాటి ఆదర్శాలు పాత్రల జీవితాలుగా నడుస్తాయి. సత్యాగ్రహం, దానికి వ్యతిరేకమైన హింసామార్గం.**

చేసుకోలేం. 1978లో మద్రాసు రేడియో కేంద్రం నుండి ప్రసారం అయింది.

దాశరథి వచనరచనల్లో బాగా పనికివచ్చే రచన "జాగీరు ఇలాకాలో స్వాతంత్ర్య పతాక". దీని ద్వారా దాశరథి క్షేత్రస్థాయిలో ఒక విప్లవోద్యమకారునిగా ఏమేం చేశాడో తెలుస్తుంది.

గార్లలో తాలూక్‌దార్ దాశరథిని పిలిచి "సజీవంగా పాతిపెడ్తా జాగ్రత్త, ఈ ప్రభుత్వ వ్యతిరేక చర్యలు మానుకో" అని బెదిరించాడు. అతడు పోలీసు చర్య తరువాత నిజామాబాద్‌లో తనకు సన్మానం అయినప్పుడు కనబడి బితుకుబితుకుమన్నాడు. ఈ వ్యాసం దాశరథి అనుభవాల్లో వజ్రం లాంటి వ్యాసం.

'సినిమా అంటే అన్నిరకాలూ రాయాలి. 'ఇంటర్వ్యూ' వ్యాసంలో తన సినీ గేయ రచనానుభవాన్ని వివరించాడు దాశరథి. సినిమా బురదలో కవి కమలం ఎలా నిలుస్తుందో తెలిపాడు.

1. On Poetry (సాహిత్య అకాడమీ అవార్డు సమయాన కవి ఉపన్యాసం. 2. In Search of Indianness - The Voice of Great India, Nov-Dec, 191 - సంచికలో వ్యాసం. 3. "Ivory Tower knocked out" - O.U. Seminar in English Department (1982) - Paper Presentation - అనే ఆంగ్ల వ్యాసం. ఈ మూడు అతని వచనరచనల్లో సంకలించబడ్డాయి. మూడు సాహిత్య సంబంధియే. దాశరథి హృదయాన్ని ఆవిష్కరించేవే.

వ్యాసం

# ప్రజాకవి కవితారవి దాశరథి

ప్రజల పక్షం వహించిన దాశరథి...



**అనిశెట్టి రజిత**
98494 82462

"జనం మనం మనం జనం
జనం లేక మనం లేము"

తాను జైలులో ఉండి "వద్దంటే గద్దెనెక్కి పెద్దరికం చేస్తావా ?" అంటూ నాటి నైజాము పాలనపై గర్జించిన జనకవి దాశరథి కృష్ణమాచార్య. జనం లేనిదే మనం లేమని తెలియజెప్పిన సంఘకారుడు.

పోరాటం నుండి కళపుడుతుందని నమ్మిన కవి, తన జీవితమే పోరాటంగా ఎన్నో ప్రతీఘాతక శక్తులతో పోరాడిన కవి సింగం. తన గమ్యం ప్రపంచ శాంతి అనీ తన ధ్యేయం ప్రజాస్వామ్య సామ్యవాదం అని ప్రకటించిన సామ్యవాది, ఆశావాది కవి దాశరథి. ఆగర్భ శ్రీనాథులకూ (సిరి గలవాళ్ళకు) ఏమీ ఎవరూ లేని అనాథలకు మధ్య అనాదిగా జరుగుతున్న సంఘర్షణే ఈ కవిరాజు కవితా వస్తువు.

**నిరుపేదల ఆకలి మంటలు చల్లార్చాలని ఆరాటపడిన ఈ కవి మహాకవి ఇక్బాల్ రాసిన ఒక విప్లవ గీతంలోని "ఏ పొలమున నిరుపేదకు దొరకదో తిండి / ఆ పొలమున గల పంటను కాల్చేయండి" అన్న పద్య పాదం చదువుతూ ఉద్రేకంతో పొంగిపోయేవాడు.**

రైతు కష్టసుఖాలే దాశరథి కావ్య పరికరాలు. రైతుదే తెలంగాణము అని భావించాడు. తెలంగాణము తన జన్మభూమి అని గర్వించాడు. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అని పరవశించాడు.

పర పీడన పరాయణత్వం తొలగి పోవాలన్న ఆకాంక్షతో అగ్నిధారలు కురిపించాడు. నిస్వార్థ నిరుపేద మానవుని అభ్యుదయమే ఆయన కవితా ధర్మం. కాలం కాన్వాస్ కొలతలకందనంత విశాలమైనది. కాలం ఎప్పుడూ కళ్ళ ముందు కనిపిస్తున్నట్లే ఉండి కాచుకొని దెబ్బ తీస్తుంటుంది. అందుకే దాశరథి పేదల నోటికాడి మెతుకులను దొంగిలించే డబ్బున్నోళ్లను హెచ్చరిస్తూ "బంగారం పొంగించిన ధనికులను మింగాలని/దొంగచాటుగా కాలము తొంగి చూచినది" అంటారు. కరోనా కాలం ఇందుకు సరైన ఉదాహరణగా చూడవచ్చు.

దాశరథి ఆధిక్యతలకు వ్యతిరేకి, కార్మిక కర్షక పక్షపాతి. కవికుండాల్సింది పీడిత జన పక్షపాతం, పీడక ప్రభువు పట్ల వ్యతిరేక భావం. దాశరథి కవిత్వం ఒక ఉప్పెన.. తుఫానుల పరంపర.. విలువలులేని స్వార్థ దోపిడీ ప్రపంచంలో విప్లవాగ్నులు రగిలించే వడగాలి. దౌర్జన్యాలను చుట్టుకొని విసిరికొట్టే సుడిగాలి ఆ కవిత్వం. తిరుగుబాటు చేయమనే ఆయన కావ్యగానం ఇచ్చే పిలుపు. చూస్తే ఆయన అంతరంగం ఒక చల్లని సముద్ర గర్భం... కానీ ఉప్పొంగితే ఆ గర్భంనిండా బడబానలములు, కానరాక నీట దాక్కున్న భాస్కరుల అజ్ఞాతవాసాలు.

నిరుపేదల ఆకలి మంటలు చల్లార్చాలని ఆరాటపడిన ఈ కవి మహాకవి ఇక్బాల్ రాసిన ఒక విప్లవ గీతంలోని

"ఏ పొలమున నిరుపేదకు దొరకదో తిండి
ఆ పొలమున గల పంటను కాల్చేయండి"

అన్న పద్య పాదం చదువుతూ ఉద్రేకంతో పొంగిపోయేవాడు.

1948లో దాశరథి నిజామాబాద్ జైలులో ఉన్నప్పుడు, వట్టికోట అళ్వారుస్వామి కూడా ఆ జైలుకొచ్చాడు. కవులంటే వారికి ఎంతో అభిమానం. ఆయన ఆ కాలాన్ని అనుసరించి విప్లవ రచన ఏది విన్నా ఉప్పొంగిపోయేవాడట.

దాశరథి ఒక రోజు జైలు గోడపై బొగ్గుతో ఇలా రాసాడు

"ఓ నిజాము పిశాచమా
కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేని;
తీగలను తెంపి అగ్నిలో దింపినావు

నా తెలంగాణ కోటి రత్నాల వీణ".

ఈ పద్యాన్ని జైలు అధికారులు చెరిపివేసినప్పుడల్లా మరో గోడ మీద ఆ పద్యం ప్రత్యక్షమయ్యేదట. అది దాశరథే చేస్తున్నాడని అధికారులు అనుకునేవాళ్ళు. కానీ తరువాత వాళ్ళు అది వట్టికోట వారు రాస్తున్నారని కనిపెట్టారు. తరవాత వాళ్ళిద్దరూ వేరు వేరు జైళ్లకు మార్చబడ్డారు. అతి చిన్న వయసులోనే వట్టికోట వారు కీర్తిశేషులయ్యారు. వారి మీద ప్రేమతో దాశరథి 1949లో సాహితీ మేఖల ద్వారా ముద్రించబడిన తన 'అగ్నిధార' కవితా సంపుటిని ఆ త్యాగమూర్తి స్మృతికి అంకితం చేసారు.



'అగ్నిధార'కు పునాదులు నిజాం ప్రభుత్వ నిరంకుశత్వం, ప్రజల అగచాట్లు, భారతదేశ స్వాతంత్ర్యం, భారత సైన్యాల ప్రవేశం, నైజాం ప్రభుత్వ పతనం అని ఆ ఖండికలోని కవితలు చాలా వరకు తన జైలు జీవితంలోనివీ, జైలు నుండి విడుదలైన కొత్తలో రాసినవి అని దాశరథి చెప్పారు. 'అగ్నిధార'లో దాశరథి అగ్ని కురిపించాడు రుతువుల్ని చూస్తూ రుతువర్ణనలు చేస్తూ దుర్భరమైన ఆ రోజుల్ని గడిపాడు. 1947లో ఆయన నిరంకుశత్వాన్ని నిరసించే పద్యాలు పాడుతుండటం వలన వరంగల్ సెంట్రల్ జైలులో 16 నెలలు కఠిన కారాగార వాసాన్ని అనుభవించారు. 1948 జనవరి 30వ హైదరాబాద్ జైలుకు తరలించబడ్డారు.

జైలులో ఆయనకు కాలమంతా పద్యాలు అల్లడంతోనే గడిచింది. నిజామాబాద్ ఖిల్లా జైలులో ఉన్నప్పుడు పోలీస్ అధికారులు వీరికి పెట్టే అన్నంలో సిమెంట్ కలిపి పేట్టేవారట, దాంతో దాశరథి, జైలులోని ఇతరుల ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతినటమూ జరిగింది. దాశరథి కేవలం 62 ఏళ్ళు జీవించడానికి కారణం ఆయన లోపలి అవయవాలు దెబ్బతిని జబ్బుపడి కోలుకోలేకపోవడమే. దుర్భరమైన ఆ జైలు జీవితం ఆయన ఆయుష్షును హరించిందన్నది సత్యం.

ఆయన

"కదం తొక్కి పదం పాడి ఎదల్లోన, రొదల్లోన
సొదల్లోన, గదుల్లోన
ఇదేమాట ఇదే మాట
పదే పదే అనేస్తాను"

అంటూ

"జగత్తంత రగుల్కొన్న
కృధాజ్వాల వృథాపోదు"

అని "దగాకోరు బాడా చోరు రజాకారు పోషకుడవు". ఊర్లకు అగ్గిపెట్టి, ఇళ్లు కొల్లగొట్టి, తల్లి పిల్ల కడుపులుకొట్టి నిక్కిన నీ దుర్మార్గమంతా నీ బాధ్యతే అని హూంకరించాడు. రజాకారు పోషకుడైన నైజాం రాజు పట్ల నిరసన వ్యక్తం చేస్తాడు. రజాకార్లు నైజాం నవాబు ఏర్పర్చుకున్న ప్రయివేట్ సైన్యం. అది విచ్చలవిడిగా తెలంగాణా ఊర్లమీద పడి గుండాయిజం చేసేది. ఆడవాళ్ళపై అత్యాచారాలు, దొరలు, జమీందార్లు, భూస్వాములు, పటేళ్లు, పట్వారీలతో కలిసి దోపిడీలు, ఆగడాలు, హత్యలు, పేదలూ, రైతులపట్లా, శ్రామికుల పట్లా క్రూరమైన అఘాయిత్యాలు చేస్తూండటమే రజాకార్ల దౌర్జన్యపు చర్యలుగా ఉండేవి. ఆ కాలాన్నే కమ్యూనిస్టులు 'తెలంగాణా రైతాంగ పోరాటం'గా మలిచి చీకటి వ్యవస్థపై ప్రజాపోరాటం సాగించారు.

అందుకే నైజాం దిగిపోవాలని నినదించడం

"కోటిన్నర నోట వెంట
పాటలుగా మాటలుగా
దిగిపొమ్మని దిగిపొమ్మని
ఇదే మాట అనేస్తాను"

కవిగా తాను నినదించడం కాదు. కోటిన్నర తెలంగాణా ప్రజలతో అదే మాట అనిపించాడు.

ఏరా దుష్ట పాలకుడా..!

"వద్దంటే గద్దె యెక్కి
పెద్దరికం చేస్తావా! మూడుకోట్ల
చేతులు నీ
మేడను పడదోస్తాయి

(మిగతా 44వ పేజీలో)

**'అగ్నిధార'లో**
**దాశరథి అగ్ని కురిపించాడు రుతువుల్ని చూస్తూ రుతువర్ణనలు చేస్తూ దుర్భరమైన ఆ రోజుల్ని గడిపాడు. 1947లో ఆయన నిరంకుశత్వాన్ని నిరసించే పద్యాలు పాడుతుండటం వలన వరంగల్ సెంట్రల్ జైలులో 16 నెలలు కఠిన కారాగార వాసాన్ని అనుభవించారు. 1948 జనవరి 30వ హైదరాబాద్ జైలుకు తరలించబడ్డారు.**

# స్త్రీవాదం, దళితవాదం ధోరణిలే తప్ప ఉద్యమాలు కాదు.....

- ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ

**అభ్యుదయ పథగామి ఎస్.వి.తో తంగేడు ముఖాముఖి....**



ఆయన ఉపన్యసిస్తే పిడుగుల జలపాతం కురుస్తుంది. మేఘగర్జన లాంటి ఆయన కంఠంతో ప్రేక్షకుడు మైమరిచిపోతాడు. ఆయన కలం, గళం దేనికదే సాటి. చాలాసార్లు సాహితీ వివాదాలలో ఆయన పేరు ఉంటుంది. కానీ ఆయన వ్యక్తిగతంగా వివాదస్పదుడు కాదు. ఏ విషయమైనా ఉరిమినట్టుగా చెబుతూనే సరళతను స్పష్టతను సంతరిస్తారు. పాలకుడుగా, బోధకుడిగా, కవిగా, విమర్శకుడిగా, నాటక కర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ. హైదరాబాద్ పాత నగరంలోని బాలాగంజ్‌లో దిగువ మధ్యతరగతి కుటుంబంలో శ్రీమతి రాధాబాయి, విఠల్‌రావు దంపతులకు 1954 ఆగస్టు 16వ తేదీన జన్మించారు. స్కూల్ విద్యార్థిగా కళాశాల విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే తన రచనా వ్యాపకం ప్రారంభించారు. ఆశయాలకు వారధి, తెగిన దారులు, తెగని గొలుసులు, ఎడారిలో గులాబీలు లాంటి ఆయన నాటికలు ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. అనేక పదవులు నిర్వహించిన ఆయన 2000 జూలై 1న ఉస్మానియా తెలుగు శాఖలో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ప్రజల మనిషి, ధర్మబిక్షం, నాయకురాలు యార్లగడ్డ భాగ్యవతి, అభ్యుదయ సాహిత్యం ఇతర ధోరణులు, ఆధునిక సాహిత్యం విభిన్న ధోరణులు, తెలుగులో ఉద్యమ గీతాలు, జీవితం ఒక ఉద్యమం, తెలంగాణ విమోచనోద్యమం - సాహిత్యం మొదలైనవి ఆయన రచనలు. జీవితం ఒక ఉద్యమం కవితా సంపుటి కవితా ప్రక్రియలో 2008కి తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ సాహిత్య పురస్కారానికి ఎంపికైంది. తర్వాత దృక్పథాలు, విశ్లేషణ, తెలుగులో అభ్యుదయ సాహిత్యం, సత్యానుశీలన గ్రంథాలు వెలువరించారు. 2016 జూలై నుండి 2019 జూలై వరకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా బాధ్యత నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబరు మాసంలో హైదరాబాదులో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ కమిటీ సభ్యుడుగా ఉన్నారు. అగ్గి చిగుళ్ళు, కవితాభ్యుదయం, జాషువా సాహితీ ప్రస్థానం, స్త్రీవాద వివాదాలు మొదలైన 34 సాహిత్య గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. అనేక జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు. సుంకర సాహిత్య పురస్కారం, చెలికాని రామారావు సత్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి ధర్మనిధి పురస్కారం, యునైటెడ్ చిల్డ్రన్ మూమెంట్ వారి పురస్కారం లాంటి 30 అవార్డులను ఆయన స్వీకరించారు. నేపాల్, సోవియట్ రష్యా, మారిషస్, మలేషియా, అమెరికాలాంటి దేశాలలో విస్తృతంగా పర్యటించారు. ఆయన సాహిత్యాన్ని, జీవితాన్ని స్పర్శిస్తూ ఈ మాసం తంగేడు చేసిన ముచ్చట మా పాఠకుల కోసం...

**ఒక సాహితీవేత్త కావడానికి దోహదం చేసిన పరిస్థితులు ఏమిటి?**

నేను సాహితీవేత్త కావడానికి ప్రధాన కారణం 1969 నాటి తెలంగాణ ఉద్యమం. ఉద్యమకాలంలో ప్రజాసమితి పొద్దున్నే 'ప్రభాతభేరీ' అనే కార్యక్రమం నిర్వహించేవారు. అందులో ఉద్యమ కారులు పాటలు పాడుతూ వెళుతుంటే మేం అనుసరించేవాళ్ళం. చివరికి మేమే ఎందుకు రాయకూడదు అనిపించి నేను కొన్ని గేయాలు రాశాను. అలాగే నా మిత్రులు జగదీశ్వరస్వామి, అనుముల శ్రీహరి, నేను ముగ్గురం కలిసి 'విప్లవశంఖం' పేరుతో ఒక గేయవాహిని ప్రచురించాం. అపుడు నాకు 15 ఏళ్ళు. జగదీశ్వరస్వామికి 17 ఏళ్ళు. అనుముల 20 ఏళ్ళలోపు. ముగ్గురం కలిసి ఈ సంకలనం ప్రచురించడం ద్వారా సాహిత్య








రంగంలోకి ప్రవేశించాం. తర్వాత నాటి సాహితీ మిత్రులతో 'నవ్య సాహితీ' అనే లిఖిత పత్రికను ప్రారంభించాం. ఒక చేతిరాత పత్రిక ఇది. వ్యాసాలు, కవితలు, కథలు, కార్టూన్లతో వెలువరించాం. ఈ చేవ్రాలు పత్రికను భారత గుణవర్ధక సంస్థ అనే గ్రంథాలయంలో పెట్టేవాళ్ళం. 1972లో ఈ పత్రిక పేరు మార్చి 'ఉషస్సు' అనే పేరుతో లిఖిత మాసపత్రికగా వెలువరించాం. మా మిత్రులందరినీ పాతనగరంలో ఉషస్సు రచయితలు అని పిల్చేవారు. తరువాత హైదరాబాద్ పాతనగర రచయితల సంఘం ఏర్పాటు చేసుకున్నాం. అపుడు పత్రిక పేరు వేదిక అని మార్చుకున్నాం. ఈ రచయితల సంఘానికి చింతపట్ల సుదర్శన్ అధ్యక్షుడు. నేను ప్రధాన కార్యదర్శిని. అదే సంవత్సరం శాలిబండాలోని వైదికధర్మ ప్రకాశిక పాఠశాల ప్రాంగణంలో హైదరాబాద్ పాతనగర రచయితల మహాసభలు నిర్వహించాం. నగరంలో పేరున్న రచయితలందరూ ఈ మహాసభలకు వచ్చారు. హైదరాబాద్ పాతనగర సాహిత్య చరిత్రలో ఆ మహాసభలు ఒక మైలురాయి. మా సాహిత్య ప్రస్థానానికి కూడ ఆ మహాసభలు మంచి ప్రోత్సాహాన్నిచ్చాయి.

**మీరు సాహితీవేత్తగా పరిణమించడానికి దారితీసిన సాహిత్య నేపథ్యం చెబుతున్నారు కదా. అదే సమయంలో మీ కుటుంబం, తల్లిదండ్రుల నుండి మీకెలాంటి ప్రోత్సాహం వచ్చింది?**

తల్లిదండ్రులు పెద్దగా అక్షరాస్యులు కాదు. మేం ఐదుగురు అన్నదమ్ములం. ఐదుగురు అక్కచెల్లెండ్రం. అన్నయ్య అక్క తరువాత మూడవవాన్ని నేను. నేనే మా ఇంట్లో మొదటి గ్రాడ్యుయేట్‌ని. పోస్ట్ గ్రాడ్యుయేట్‌ని. మా కుటుంబంలోనే కాదు మా వంశంలోనే మొదటి డాక్టరేట్‌ని.

**మీరు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా పనిచేశారు కదా. అంతకుముందలి ఉద్యోగ ప్రస్థానం కొంచెం చెబుతారా?**

పొద్దున్న ఎల్.ఐ.సి. క్యారియర్ ఏజెంట్‌గా పనిచేస్తూ, సాయంత్రం బషీర్‌బాగ్ సాయం కళాశాలలో ఎం.ఏ., పూర్తి చేశాను. ఎం.ఏ., అయిపోయిన వెంటనే బాగ్‌లింగంపల్లి డా॥ బి.ఆర్. అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగం వచ్చింది. నేను ఉద్యోగాలకు 'నో వెకెన్సీ బోర్డు' సినిమాలలో చూశాను తప్ప ప్రత్యక్షంగా అనుభవంలోకి రాలేదు. 12 ఏళ్ళపాటు తెలుగు అధ్యాపకుడిగా అక్కడ పనిచేశాను. అక్కడ పనిచేస్తున్నపుడే 1986 నాటి అధ్యాపక ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నాను. యూజిసి సవరించిన వేతనాలు ఎయిడెడ్ కాలేజీల లెక్చరర్లకు ఇవ్వలేదు. గవర్నమెంట్ వాళ్ళకు ఇచ్చారు. దానికోసం జరిగిన ఉద్యమంలో చాలా క్రియాశీలకంగా పాల్గొన్నాను. అంతకు ముందే 1983 డిసెంబర్, 31న నేను అధ్యయనయాత్ర కోసం సోవియట్ యూనియన్ వెళ్ళి 6 నెలలు ఉండి వచ్చాను. మంచి ఉత్సాహంతో నాటి ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నాను. తెలంగాణ కాలేజీ టీచర్ అసోసియేషన్ నిర్వహించే పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించాను.

**మీరు అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు. మీ సాహిత్యం కూడా అభ్యుదయ ప్రధానంగా కొనసాగేది. మీరు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా ఉన్నారు. తర్వాత వైస్-ఛాన్సెలర్‌గా కూడా పనిచేశారు. మీ ప్రభుత్వ ఉద్యోగ వృత్తికి అభ్యుదయ సాహిత్య ప్రవృత్తికి ఎప్పుడైనా స్పర్థ వచ్చిందా?**

ఇది ప్రభుత్వ సంస్థ కాదు. అటానమస్. ఏ ఆంక్షలూ లేవు. ప్రజానాట్య మండలి కార్యక్రమాలు కూడా నిర్వహించాం. 1991 అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీలో లెక్చరర్‌గా చేరాను. తరువాత అసోసియేట్ ప్రొఫెసర్, తరువాత ప్రొఫెసర్ అయ్యాను. తెలుగుశాఖ అధ్యక్షుడిగా ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్‌గా పనిచేశాను. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌ని కూడా అయ్యాను. ఈ ఉద్యోగ ప్రస్థానంలో నా అభ్యుదయ సాహిత్య ప్రయాణానికి ఏ ఉద్యోగమూ అడ్డురాలేదు. నేను విద్యార్థిగా ఉన్నపుడు అఖిలభారత విద్యార్థి సమాఖ్యకు క్రియాశీలంగా ఉన్నాను. అది అభ్యుదయ రచయితల సంస్థకు అనుబంధ సంస్థ. కాబట్టి నాకు ఆటంకం రాలేదు.

**ఎన్నో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక ఉద్యమాలు వచ్చినాయి. ఇన్ని వాదాల, ఉద్యమాల మధ్య అభ్యుదయ వాదం అస్తిత్వం ఏమిటి?**

ఇవి ఉద్యమాలు అనను నేను. స్త్రీవాద ధోరణి, దళితవాద ధోరణి అని స్పష్టంగా చెప్పాను. వాటిని ఉద్యమాలు అనను నేను. ఈవరకు ఏది ఉద్యమం, ఏది ధోరణి అన్న వ్యాసం రాశాను. ధోరణి అంటే ఒక కెరటంలాగా లేచిపడేది. ఉద్యమం అంటే నిరంతరంగా కొనసాగేది. తెలుగు సాహిత్యంలో అభ్యుదయ, విప్లవ సాహిత్యాలు మాత్రమే ఉద్యమాలు. స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాద లాంటి

ముఖాముఖి

అస్తిత్వవాదాలన్నీ ధోరణులు మాత్రమే. మలిదశ తెలంగాణ ఉద్యమం సందర్భంగా వచ్చిన తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ వాదం మాత్రం ఉద్యమం. ఎందుకంటే ఉద్యమానికి మూడు ప్రధానమైన అంశాలు ఉండాలి. 1. సంస్థాగత నిర్మాణ రూపం 2. నిబద్ధ నాయకత్వం 3. నిర్దిష్టమైన ప్రాపంచిక దృక్పథం. ఈ మూడు ఉంటేనే ఒక సాహిత్య ధోరణి ఒక ఉద్యమంగా మారుతుంది. అభ్యుదయ సాహిత్యోద్యమానికి ఈ మూడు ఉన్నాయి. సంస్థాగత నిర్మాణం ఉన్నది. నాయకత్వం ఉన్నది. మార్క్సిజం అనే ప్రాపంచిక దృక్పథం ఉన్నది. అదే దళిత మరియు ఇతర సాహిత్య వాదాలకు ఈ ప్రాతిపదికలు లేవు. దళిత సాహిత్యానికి నిర్దిష్ట ప్రాపంచిక దృక్పథం లేదు. కొందరు అంబేద్కరు వాదం అంటారు. కొందరు మార్క్సువాదం అంటారు. కొందరు మార్క్స్ అంబేద్కర్‌ల సమన్వయం అంటారు. కొందరు అంబేద్కర్‌వాదము, ఆఫ్రికన్ నీగ్రో విముక్తి పోరాటాల ప్రేరణ అంటారు. అంటే ఒక నిర్దిష్టత లేదు.

**దాన్ని దేశీయ మార్క్సిజం, సబాల్టన్ వాదం అని అంటారు కదా?**

అవును. కాని అవేవీ నిలిచేవి కావు. దేశీయ మార్క్సిజం అనేది ఒక సిద్ధాంతంగా నిలదొక్కుకోలేకపోయింది. ఒకరిద్దరి బుర్ర నుండి పుట్టిన ఆలోచన మాత్రమే. మార్క్సిజంలో దేశీయ, విదేశీయ మార్క్సిజం ఏమిటి?

**అంబేద్కర్ ప్రతిపాదించిన అంశాలు బీజంగా ఉన్నది దేశీయ మార్క్సిజం కదా?**

అది తాత్విక దృక్పథంగా నిలబడలేదు.

**బుద్ధుడు, పూలే అంబేద్కర్ ఉపాధేయం అంటుంది కదా?**

కావచ్చు. అది ఒక భావన మాత్రమే. సిద్ధాంతం కాదు. తాత్విక దృక్పథం నిలదొక్కుకోవాలి.

**దళిత వివాదాలు, దళిత సాహిత్య నేపథ్యం వేశారు కదా. ఈ రెండింటిలో సాధించిన సామాజిక ప్రయోజనం ఏమిటి?**

ఒక ధోరణి బలంగా వస్తున్నపుడు కొన్ని పత్రికలలో చర్చలు రావడం మామూలే. దానికి అనుకూల ప్రతికూల వాదనలు రావడం కూడా రివాజే. తరువాత కొద్దికాలం గడిచాక ఈ విషయాలు ఎవరికీ గుర్తుండవు. వాటిని రికార్డు చేద్దామని ఈ పుస్తకం తీశాను. స్త్రీవాద వివాదాలు అనే పుస్తకం కూడా తెచ్చాను. అప్పుడు నేను స్త్రీవాదం గురించి అన్న విషయాలు కొంచెం తీవ్రంగా ఉండడం వలన చాలామందికి నచ్చలేదు. కాని స్త్రీవాదంలో దళిత స్త్రీవాదం, మైనారిటీ స్త్రీవాదం తరువాత తరువాత వచ్చినపుడు నా మాటలు నిజమే అన్నారు. వివాదాల పుస్తకంలో వచ్చిన అభిప్రాయాల పట్ల నేను తటస్థంగా ఉన్నాను. నా సంపాదకీయం ఎటు మొగ్గు చూపలేదు.

**ఈ దశాబ్ది కవిత, కవితా దశాబ్ది అని సంకలనాలు వేశారు కదా! దానికి ప్రేరణ ఏమిటి?**

1981 నుండి 1990 దాకా ఒక పదేళ్ళ కాలం నుండి వచ్చిన కవితలను "కవితా.. ఓ కవితా" పేరుతో పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్ కవితాసంకలనం తెచ్చారు. అది 1981 నుండి 1990 దాక. తరువాత 1991 నుండి 2000 సంవత్సరం వరకు మిత్రుడు పెన్నా శివరామకృష్ణతో కలిసి కవితాదశాబ్ది పేరుతో పుస్తకం తెచ్చాను. 2001 నుండి 2010 దాకా వచ్చిన కవితల్ని దశాబ్ది కవిత అనే పేరుతో ఒక పుస్తకం తెచ్చాను. మళ్ళీ 2011 నుండి 2020 దాకా తేవాల్సి ఉంది. కాని నాకు, పెన్నాకు ఓపిక లేకుండా పోయింది. కాని ఆ పదేళ్ళ కాలం ఆ కాలానికి ప్రాతినిధ్యం వహించిన కవిత్వం ప్రతిఫలిస్తుంది. అందుకు ప్రపంచీకరణ మీద నిరసన, డంకెల్ ప్రతిపాదనలు, ఆర్థిక సంస్కరణల పర్యవసానం, దళిత, స్త్రీవాద చైతన్యాలు, మైనారిటీ చైతన్యం, ప్రాదేశిక చైతన్యం ఇవన్నీ ప్రాతినిధ్య కవిత్వం. 1991 నుండి 2001 వరకు, 2001 నుండి 2010 దాకా ప్రాతినిధ్యం వహించిన కవిత్వం ఇది.

**మలిదశ తెలంగాణ ఉద్యమంలో సాహిత్యపరంగాను, ప్రత్యక్షంగాను మీ పాత్ర ఏమిటి?**

ఆ కాలంలో ఆచార్యుడిగా ఉన్నాను. తెలుగుశాఖ అధ్యక్షుడిగా ఉన్నాను. కాబట్టి క్రియాశీలంగా నేను లేను. విద్యార్థులకు ఉద్యమచైతన్యం కల్పించాను.

**సాధారణంగా ఒక ఆరోపణ ఉంది. కమ్యూనిస్టు దృక్పథం ఉన్నవాళ్ళు ఆ ఉద్యమానికి అంతగా మద్దతు ఇవ్వలేదని కొందరంటారు.**

తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న రోజులలో 'అరసం' కడపలో తెలంగాణ ఉద్యమానికి అనుకూలంగా తీర్మానం చేసింది. నేనప్పుడు అధ్యక్షుడుగా, పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రధాన కార్యదర్శిగా ఉన్నాము. పెనుగొండ లక్ష్మీనారాయణ గుంటూరు నుండి వచ్చి ఇక్కడ నేను అనేక ఉద్యమ వేదికల మీద మాట్లాడాం. చర్చాగోష్ఠుల్లో సదస్సులో పాల్గొన్నాం. తెలంగాణ ఉద్యమాకాంక్షను ప్రేరేపించే మూడు గేయాలు రాశాను. 'నమస్తే తెలంగాణ', 'కందెన' పత్రికలలో అచ్చయింది. హాస్టల్లు మూసివేస్తే కొందరు విద్యార్థి నాయకులకు మా ఇంట్లో భోజనాలు పెట్టి ఉత్సాహపరిచాను. ఉద్యమ వాతావరణం సృష్టించడంలో ఒక అధ్యాపకుడిగా, కవిగా నా పాత్ర నేను నిర్వహించాను.

**తెలుగునాట తల ఎత్తిన ప్రతి రాజకీయ, సాహిత్య, సామాజిక, ఉద్యమాలు మీ మీద బలమైన ప్రభావం**





ముఖాముఖి

**వేశాయి కదా, ఆ ప్రభావంతో వచ్చిన రచనలు ఏమిటి?**

1982లో 'ఉద్యమం' పేరుతో కవితా సంపుటి, 2005లో 'జీవితం ఒక ఉద్యమం' కవితా సంపుటం వచ్చింది. 2018లో 'ఉద్యమం ఉద్యమమే' అనే పుస్తకం వచ్చింది. ఉద్యమానికి పర్యాయపదాలుండవు. కొంతమంది పత్రికా ప్రకటన చేయడమే ఉద్యమం అనుకొంటారు. కొంతమంది ప్రచార సాధనాల చర్చలలో పాల్గొనడమే ఉద్యమం అనుకుంటారు. ఉద్యమం అంటే ఆరుట్ల కమలాదేవిని అడుగు, రావి నారాయణరెడ్డిని అడుగు, బద్దం ఎల్లారెడ్డిని అడుగు, అదంతా చరిత్ర అంటే రాజస్థాన్ ఎడారిలో నీటి చెలిమలు పుట్టిస్తున్న రాజేందర్ సింగ్‌ని అడుగు. నర్మద నిర్వాసితుల కోసం వేతనాన్ని ధారవోసిన మేధాపాట్కర్‌ని అడుగు. రైతన్నకు వెన్నెముకగా నిలిచిన అన్నా హజారే నడుగు. గజ్జెకట్టి డప్పై మ్రోగి గుండెల్లో గుబులు పుట్టిస్తున్న గద్దర్‌ని అడుగు. కారాగార క్లేశాలు అనుభవిస్తున్న వరవరరావు నడుగు ఉద్యమమంటే ఏమిటో తెలుస్తుంది.

**ఉద్యమం అంటే కార్యాచరణ అనా మీ ఉద్దేశం?**

అవును. ఉద్యమమంటే కార్యాచరణ.

**తెలంగాణ సాహిత్యరంగంలో విమర్శ వెనుకబడిందని అంటున్నారు. మీరేమంటారు.**

లేదు. వెనకబడలేదు. తెలంగాణలో తొలిదశ, మలిదశ ఉద్యమాలను, తొలిదశ, మలిదశ సాహిత్యాలను రికార్డు చేస్తూ ఉద్యమాలొస్తున్నాయి. ఇవి విమర్శలో భాగమే. పరిశోధన, విమర్శ జమిలీగా కలగలిసి ప్రవహిస్తున్నాయి. విమర్శ అంటే కేవలం దోషాలను నిరూపించడం మాత్రమే కాదు. విమర్శ అంటే సదసద్వివేచన. అది కొనసాగుతూనే ఉన్నది. ఏ దినపత్రికను తిరగేసినా సాహిత్య పేజీలలో ఈ వివేచన కనబడుతూనే వుంటుంది.

**అకాడెమిక్ క్రిటిసిజానికి, అత్యాధునిక సాహిత్యం మీద వచ్చే విమర్శకు తేడా ఉంది కదా!**



వర్తమాన సాహిత్యం మీద విశ్లేషణ చేయడమే విమర్శ అని నేననుకొంటాను. విమర్శ ఏదైనా సరే.

**మీకు మరచిపోలేని అనుభూతినిచ్చిన మీ రచన ఏది?**

"జీవితం ఒక ఉద్యమం" ఇది 2005లో వచ్చింది. తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ సాహిత్య పురస్కారం ఇచ్చింది. పురస్కారంతో గీటురాయి కాదు గాని అది నా ఆత్మ కథనాత్మక కవిత్వం. నా ఆటోబయోగ్రఫీని కవిత్వంగా రాస్తే ఎట్లా ఉంటుందో ఆ పుస్తకంలో తెలుస్తుంది. ఇక విమర్శలో 'సత్యానుశీలన' పేరుతో ఒక గ్రంథం రాశాను. జ్ఞానపీఠ అవార్డు పొందిన సాహితీవేత్తలు, జ్ఞానపీఠ పొందడానికి అర్హులైన కవుల మీద రాసిన సంపుటి అది. ఇది కేంద్రసాహిత్య అకాడెమీ తుది పరిశీలన వరకు వెళ్ళింది. అది విశ్లేషణలో నాకు సంతృప్తినిచ్చిన గ్రంథం.

**మీరు అనేక ప్రక్రియలు సృజించారు కదా. ఏ ప్రక్రియ మీకు ఇష్టం?**

అంతిమంగా కవిత్వమే. ధర్మభిక్షం, వై.వి.కృష్ణారావు, మగ్దూం వాళ్ళ జీవితచరిత్రలు కూడా రాశాను. విశ్లేషణ విమర్శ రాశాను. వాదవివాదాల్లో తలదూర్చాను. అయినా నా కిష్టమైన ప్రక్రియ కవిత్వమే.

**చివరగా ఈనాటి యువతకు మీరిచ్చే సందేశం?**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో మొదటగా గ్రామగ్రామాన వాడ వాడనా కవిత్వం వచ్చింది. దానికి తక్షణ ప్రయోజనమే లక్ష్యం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా అదే తరం కొనసాగుతున్నది. దానికితోడు 2017లో హైదారాబాద్‌లో చాలా ఘనంగా ముఖ్యమంత్రిగారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ప్రేరణతో కూడా మరో కెరటం వచ్చింది. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అన్నీ తెలంగాణ జిల్లాలలో కవి సమ్మేళనాలు జరిగినవి. చాలా పరిమాణం పెరిగింది. అయితే గుణం పెరగలేదు. అధ్యయన రాహిత్యమే దాని కారణం. చాలామంది కవులు అచ్చయిన తమ కవితను మాత్రమే చదువుతారు. కాని వేరేవాళ్ళవి చదవరు. సాంస్కృతిక సారథి కోసం జరిపిన ఇంటర్వ్యూ కమిటీలో కూడా నేనున్నాను. వందలమంది వచ్చారు. నేను ప్రతి ఒక్కరిని అడిగాను. మహా ప్రస్థానం చదివావా? లేదు.. అగ్నిధార చదివారా...? లేదు... కాళోజీ కవిత్వం చదివావా? లేదు. పోనీ గద్దర్, వరవరరావులనైనా చదివావా? అదీ ఉండదు. నాకు తోచింది నేను రాసుకుంటున్నాను అనే ధోరణి కనబడింది. నేటి తరం కవులు, పూర్వకవులవి, సమీప పూర్వ కవులవి, ఇప్పటి కవులవి చదవాలి. ప్రతిభ వ్యుత్పత్తి అభ్యాసం సమపాళ్ళలో ఉండాలి. ప్రభావవంతంగా చెప్పగలగాలి.

**తెలంగాణ జాతి ప్రేరకుడు, దాశరథి గురించి మీ అభిప్రాయం.**

దాశరథి, కాళోజీ మన తరాన్ని బాగా ప్రభావం చేసిన మహాకవులు. దాశరథి అగ్నిధార బాగా మననం చేసుకునేవాళ్ళం. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అన్నది నాకు ప్రేరణ ఇచ్చింది. దాశరథి తెలుగు సాహిత్యంలో, మగ్దూం ఉర్దూ సాహిత్యంలో ఒక కొత్త ఒరవడి సృష్టించారు. శృంగారం - అంగారం, ప్రణయం - ప్రళయం రెండింటిని సమస్థాయిలో పోషించారు. ఉద్యమ కవికి సున్నితమైన భావస్పందనలు ఉంటాయని నిరూపించారు. శ్రీశ్రీని ఎంత ప్రేమగా చదివామో మా తరం దాశరథిని అంతే ప్రేమగా చదివాం. దాశరథి, శ్రీశ్రీ, మగ్దూం, కాళోజీల ప్రభావం మామీద ఉంది.

**ఇంటర్వ్యూ : కాంచనపల్లి**

కథ

# మొత్తానికి రథం బయిలెల్లింది...

ఒక బాల్యం ఆరాటం...



వేముగంటి మురళీకృష్ణ
96765 98465

రాముని లగ్గం అయిపోయింది. రోజంతా తీర్థం బెట్టి పైసలైతే ఒరగ వెట్టుకున్న గని, చెయ్యి నొప్పివెట్టి దందం చేస్తున్నది.

సాయంత్రం ఏడుగొట్టింది. గుళ్లె దేవుని దర్శనానికి వచ్చే మంది కొద్ది కొద్దిగ తగ్గుతున్నరు. నేను మెల్లగ బయటవడ్డ.

గుడిచుట్టూ దుకాండ్లు. అన్ని రకాల బొమ్మలు, ఆటవస్తువులబండ్లు, సబ్జగింజల రసం అమ్మే తుర్క పిల్లల బెంచీలతో పాటు తినే బండ్లు గుడా ఉంటాయి. అ బండ్లల్ల నాకు ఇష్టమైంది దైవడ బండి. ఎన్నిసార్లు తిన్నా మొహం గొట్టదు. గుళ్లె దొరికిన పైసలతోని అయిదు దైవడలు కొనుక్కొని తింటుంటే, నా క్లాసుమేట్ కాపర్తి శివకుమార్ "పంతులు బయిటియి తింటార్ర" అన్నడు.

"పంతులు గుడా మనిషే గదా, ఆకలి కాడ అందరు ఒక్కటే రా" అని ఇంట్లకు పోయిన.

రాత్రి పది దాటింది. గుడి ముందరి పందిరి మీద రాగి ఆకులు రాలుతున్నయి. బొట్లు బొట్లుగా కురుస్తున్న పాలు పందిరి గుంజల మీద పడి కారుతున్నయి.

మంచి ఎండకాలం. నేను బంగ్లామీద పడుకున్న. చుక్కలు నాతోని ముచ్చట పెడుతున్నయి. కుడిచేతి వేళ్ళను లెక్కపెట్టిన. సరిగ్గ అయిదు రోజులతర్వాత పున్నమ. వచ్చే పున్నమని తల్చుకోంగనే ఏదో అనందం. మెల్లగ కండ్ల రెప్పలా మీద చుక్కలు మత్తుపొడిని రాలుస్తున్నె. నిద్రలోకి జారుకున్న.

* * *

పొద్దున ఏడుగంటలయ్యింది. ఏదో పెద్ద లొల్లి వినబడ్డది చెవులకు. దడుక్కున లేసిన. పెద్దబాపు గొంతు వినవడుతున్నది. ఇంకా కొన్ని తెలిసినవి, కొన్ని తెలియని గొంతులు. బంగ్లా దిగి బాత్రూంలకు పోయి ఫారుఖీ మంజన్ తోని పండ్లు గట్టిగ తోముకొని, వంటింట్లకు పోయిన. పెద్ద వదినె వేడి వేడి చాయిని పెద్ద గిన్నెలకు వడియవోస్తున్నది. అంతగనం చాయ్ ఎందుకు పెట్టింది వదినె అనుకొని, అడగనైతే అడుగుదామని "వదినె, గింత చాయ్ ఎందుకు పెట్టినవ్" అన్న.

"గుళ్లెకు పోలేదా నువ్వు పొద్దుననుంచి. మన వాడకట్టు కాపోళ్ళు, కోమట్లు వచ్చిండ్రు" అని అనుకుంట, చాయ్ నింపిన స్టీల్ గిలాసలు ఇత్తడి తపుకుల పెట్టి, వాళ్లకు ఇచ్చిరాపో అన్నది.

గుడి మంటపం నిండా పెద్దపెద్దోళ్ళు కూర్చొని ఉన్నరు. దూరం నుంచే ఇద్దరిని గుర్తుపట్టిన. పొడుగ్గ కరెంట్ స్తంభం లెక్క ఉన్నాయినే కూర పందరి సేటు, ఇంకో పెద్దమనిషి మామిండ్ల రాఘవరెడ్డి. నాకు రాఘవరెడ్డి పటేల్ బాగా గుర్తు ఎట్లనంటే, నేను పెద్దబాపుతోని పెత్రమాసనాడు వాళ్ళింటికి పోతుంటి. వాళ్ళ ఇంటి గోడకు జాజు రంగుతోని వేసిన కొడవలి, జొన్నకంకిగుర్తులు వేసి ఉంటుండే. నాకెందుకో ఆ బొమ్మల్ని చూస్తుంటే గమ్మతిగొట్టేది. పెద్దబాపును అడిగిన అవెందుకేసిండ్రు అని. రాఘవరెడ్డి పటేల్ కమ్యూనిస్టు అన్నడు. వాళ్ళది ఎర్రరంగు పార్టీ అన్నడు. నాకైతే అర్థం కాలేదు. అగో అట్లా ఆ పెద్ద మనిషి గుర్తు.

నా ఆలోచల వజన్ ఎక్కువయ్యి, చేతిల ఉన్న తపుకు వణుకుతున్నది. కొన్ని గిలాసాల నుంచి చాయ్ ఒలికిపోయింది. అదిచూసి చిన్న బాపు కోపానికొచ్చి, "ఒక్కపని సరిగ్గ చెయ్యరాదు" అని తిట్టిండు. పోయి అందరికి ఇచ్చిరా అన్నడు. అందరికి చాయ్ ఇచ్చి తపుకును గుండెల మీద పెట్టుకొని నిలవడ్డ ఏం మాట్లాడుతరో వాళ్ళు అని.

పెద్ద బాపు లొల్లి పెట్టిండు. పెద్దోళ్ల ముచ్చట్ల నీకేం పనిరా అని ఇంట్లకు పొమ్మన్నడు.

ఎందుకు లొల్లి జరుగుతున్నదో తెలుసుకోమంటున్నది మనసు. దాన్ని ఆగవట్టే వశమైతలేదు నాకు. అట్లనన్న వాళ్ళ మాటలు వినాలెనని అమ్మ రూమ్ కిటికీ దిక్కు పోయి గుడి దిక్కు చూస్తున్న.

పందరి సేటు ఎవరిదో గదువ

పట్టుకొని బ్రతిమిలాడుతున్నడు. “మన ఇజ్జత్ పోతది పటేలా... తీయకుంటే” మాటలు తట్టుకొని తట్టుకొని వినవడుతున్నయి.

ఆ పటేల్ పండరి సేటు తన గదువమించి

కోపంతోని తీసేసి, “అట్ల కానేకాదు. రోడ్డు మొత్తం కరాబైంది. రెండు దిక్కుల నల్లా బొందలున్నాయి. ఎట్ల మలుగుతయి.....లు” అని ఇంకా ఏవేవో అంటున్నడు.

లొల్లి గట్టిగనే అయితున్నది. రాఘవరెడ్డి పటేల్ లేసి భుజం మీది కండువా దులిపిండు. పండరి సేటు తన కండువాను సదురుకున్నడు.

పెద్దబాపు ఇద్దరి నడిమిట్ల నిలవడి ఏదో చెప్తున్నడు.

వినవడుతలేదు.

“ఏమయ్యా! ఓ రామయ్య, నిను ఎల్లా సేవించాలయ్య, ఏమని కీర్తించాలయ్య”

అనే పాట ఉన్న రికార్డు వేసిండు సుతారి శంకర్. ఒక్కసారి గుడిమీద ఉన్న పుంగీలు మోగినయి. పావురాలు ఎగిరిపోయినై. వాళ్ళ లొల్లి కొద్దిసేపు ఆగింది. అండ్లనుంచి ఎవరో అరుస్తున్నరు రికార్డు ఆపేయమని. పాట ఆగిపోయింది. మాటలు మొదలైనవి మళ్ళా. ఇంతట్లనే పెద్దాయి పిలిచింది నన్ను .

“మీ అక్క నిజాంబాద్ నుంచి వస్తున్నది. బస్సు దిగొచ్చు ఇప్పుడు. కమిటోళ్ళు దర్గా కాడనే రిక్షా ఆపుతరు. నువ్వు పొయ్యి అక్క సంచి పట్టుకొని రా”

ఆ లొల్లేందో, ఆ కతేందో తెలుసుకుందామంటే,

ఈ పని చెప్పింది. ఆ ముచ్చట కంటే అక్క ఊరినుంచి వస్తుందన్న విషయం నాకు ఇంకా ఎక్కువ సంతోషమనిపించింది. వెంటనే గింతగుడా ఆగకుండా దర్గా దగ్గరికి పోయిన.

పుంగీ దెబ్బకు ఎగిరిపోయిన



పావురాలు, దర్గా దగ్గరున్న మఱ్ఱి చెట్టెక్కి, మఱ్ఱి పండ్లు తింటున్నయి. ఎంగిలి పండ్లు నెత్తిమీద పడితే పైకి చూసుకుంటా దులుపుకొని, నీ పక్షులకున వారేతు అని ఏదో తిట్టినా. నమాజ్ చేయడానికొచ్చిన చాకలి రంగన్న నా గొంతుగుర్తు పట్టి “చిన్న పంతులా! ఏందో అంటున్నవ్ పావురాలని, మనుషులకంటే అవే నయం తిట్టకు వాటిని. అచ్చా మర్చిపోయినా “గుళ్లె ఉత్సవాలు అయితున్నయి కదా, నువ్వు గిడున్నవేంది”

**గాలి గట్టిగ కొడుతున్నది. నేను చాకలి రాజలింగం లగ్గం చేసే గద్దెమీద కూచున్నము. మా ముంగటి నుంచే గుడిల పనిచేసే నందయ్య, రాందాస్ లు అటు ఇటు ఆగమాగంల తిరుగుతున్నరు. నందయ్య దగ్గరికి పోయి అడిగిన ఏందీ కత, పొద్దున లొల్లి, ఇప్పుడు పోలీస్లు, ఏమన్నా పంచాయతీ అయ్యిందా, అని అడిగిన.**

“అక్కొస్తున్నది ఊరినుంచి, రిక్షా ఈడిదాంకనే వస్తది గదా. అక్క సంచి తీసుకపోనీకి వచ్చిన.”

చాకలి రంగన్నకు కండ్లు కనవడవు. చెవులే అతని కండ్లు. మాటవిని మనిషిని గుర్తుపడతడు.

“రేపు కొబ్బరికాయ తెస్తా, ఉంటవా గుళ్లె “అని చాకలి రంగన్న అంటనే ఉన్నడు. ఖుద్దూస్ రిక్షాల అక్క వచ్చింది.

అక్క అని ఒర్రిన. రిక్షాదగ్గరికి పోయి సంచితీసుకున్న. రంగన్న “రమక్క బాగున్నవా” అన్నడు.

“ఆ మంచిగనే ఉన్నా! నువు మంచిగున్నవా రంగన్నా” అన్నది.

నడుసుకుంటా అక్కను అడిగిన, “రంగన్న మసీద్ల నమాజ్ చేస్తడు. మన గుడిల కొబ్బరికాయ కొడుతడు. గిది నాకు అర్థం కాలేదు”

“బాధలు ఎవరు పోగొడితే వాళ్ళే దేవుండ్లని నమ్ముతరు కొందరు. అండ్ల రంగన్న ఒక్కడు “ అని అక్క అన్నది.

ఇద్దరం ఇంటికి చేరుకున్నం. గడియారంల పదయింది. గుడిల తులిసి పూజలు మొదలైనవి. నేను స్నానం చేసి చిర్ర గోనె ఆడుకోవడానికి తమ్ములోల్ల తోట్లకు పోయిన.

★ ★ ★

పొద్దున జరిగిన లొల్లి విషయం ఆటలవడి మర్చిపోయిన. ఇంటికొచ్చి కాళ్ళు కడుక్కుంటుంటే, పెద్దబాపు

కథ

అడిగిండు "అప్పటి నుంచి ఎక్కడికి పోయినవ్. దొరోళ్ల వాడకట్టుల ఉన్న సొన్నాయిల వీరమల్లును పిల్చుక రాపో జల్దీ".

నేను చిన్నన్న సైకిల్ కాంచి తొక్కుకుంట, దొరోళ్లవాడకట్టుకు చేరి వీరమల్లుని, పెద్దబాపు జల్దీ గుడికి రమ్మన్నడని చెప్పిన. ఎందుకో పెదబాపు నాకు చెప్పలే. నేను ఆయనకు చెప్పలే.

నాకు ఏదో కొడుతున్నది. ఏదో యాదికి మర్చినట్టు అనిపిస్తున్నది. అక్క రాముని లగ్గానికి రాలేదు గని ఇవ్వాళ ఎందుకొచ్చింది. ఇదో అనుమానం.

మధ్యాన్నం ఒంటిగంట దాటింది. గుడిల వేసిన పందిరిమీద వేపచెట్టు ఆకులు రాలుతున్నయి. గుడి కమిటీ వాళ్ళు. అటూ ఇటూ తిరుగుతున్నరు. పోలీస్ జీపు గుడిముంగట ఆగింది. దశరథం జీపు దిగుకుంట టోపీని సదురుకున్నడు.

పండరి సేటూ, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, మామిండ్ల లచ్చన్న ముగ్గురు కలిసి దశరథాన్ని గుడి వెనక ఉన్న వంటశాల దిక్కు తీస్క పోయిండ్రు. నా మనసుకు ఏదో తడుతున్నది, పోతున్నది. ఎవరినన్నా అడుగుదామంటే ధైర్యం సరిపోతలేదు.

గాలి గట్టిగ కొడుతున్నది. నేను చాకలి రాజలింగం లగ్గం చేసే గద్దెమీద కూచున్నము. మా ముంగటి నుంచే గుడిల పనిచేసే నందయ్య, రాందాస్ లు అటు ఇటు ఆగమాగంల తిరుగుతున్నరు. నందయ్య దగ్గరికి పోయి అడిగిన ఏందీ కత, పొద్దున లొల్లి, ఇప్పుడు పోలీస్లు, ఏమన్నా పంచాయతీ అయ్యిందా, అని అడిగిన.

"చెప్తా, చెప్తా తర్వాత" అని దోతిని సవరించుకుంట పోయిండు నందయ్య.

ఆకాశం మొగులయ్యింది. గాలి దుమారం పెడుతున్నది. గాలికి పందిరి చాపలు కొట్టుకుంటున్నయి. తుంపర అందుకున్నది. నాకు తుంపర వానలా తడుసుడు ఇష్టం. మాతంగి వాగునీళ్లల్ల నడుచుడు ఇష్టం.

వాగుల దిగుదామనుకున్న, ఇంతట్లనే వాన ఆగిపోయింది. మొఖం కిందికేసుకొని ఇంట్లకు నడిచిన.

ఏదో గంటల సౌండ్‌కి అమ్మ రూంల పండుకున్న నేను లేచి బయిటికొచ్చిన. వాడకట్టు మొత్తం యూత్ అన్నలు, సేట్లు అందరు కలిసి రథశాల నుంచి పెద్ద రథాన్ని బయిటికి గుంజుతున్నరు. పెద్ద పెద్ద కొబ్బరి తాళ్ళు కట్టి ఉన్నయి. అందరి ముఖాల మీద పున్నమి ఛాయ పడుతున్నది. గదువలు, గదువలు పట్టుకున్న సేట్లు, కాపోళ్ళు కలిసి రథాన్ని బయిటికి తీస్తున్నరు. పదిరోజులు ఉత్సవ కార్యక్రమం నిర్వహించే గోపాలాచార్యులు లగ్గంచేసే గద్దెముందు ముగ్గువోస్తున్నడు. అన్నం తట్టలల్ల నింపి బలి పెట్టడానికి తెస్తున్నడు రాందాస్. సొన్నాయిల వీరమల్లు పాట ఎట్టుకున్నడు. తమ్ముళ్లోల్ల గంగారాం బాజా కొడుతున్నడు. అప్పుడప్పుడు చిన్న బాపు ఆకాశం దిక్కు చూస్తున్నడు. ఇగో నరసింహాచార్యులు మన మొగులైతున్నది. జల్దిన బలి పెట్టుండి. దేవుని విగ్రహాల మీద ఒక్క వానబొట్టు పడ్డ సంప్రోక్షణ చెయ్యాలె. అదో పెద్ద తతంగం. కానీయుండి వాన పడకముందే

**పున్నమి వెలుతుర్ల రథం ధగ ధగ మెరిసిపోతున్నది. అయిదు అంత్రాల రథం. మూడో అంత్రంల దేవుణ్ణి పెడుతరు. కరెంట్ వైర్లు గుంజేటోళ్లు నాల్గో అంత్రంల ఉంటరు. ప్రతీసారి నేను రథం తోని ఊరంత తిరుగాలే అనుకుంట. నన్ను దర్గా దాంకనే రథంల కూర్చోబెట్టి దర్గా దాటంగానే రాందాస్ నన్ను ఇంట్ల దించుతడు.**

నాకు అప్పుడు గుర్తుకొచ్చింది ఇవ్వాళ రథం తీసి ఊరంతా తిప్పుతరని. అక్క అందుకోసమే వచ్చిందని అర్థమయ్యింది కానీ, లొల్లి సంగతే నాకు అర్థం కాలేదు. మెల్లగ చిన్న వదిన దగ్గరిపోయి అడిగిన. పొద్దున దేనిగురించి లొల్లి అయ్యిందని.

"ఏంలేదు! రథం తీసే రోజు రిజిస్టర్ల అందరికి చెప్పి సంతకాలు తీసుకుంటరు గదా, కొంతమంది కాపోళ్లకు చెప్పలేదట నందయ్య. గా ముచ్చట గురించే లొల్లి"

"మరి, నల్లా పొక్కలు, బొందలు అని ఇంకేవో అనవట్టిరి నాకు సరింగ వినరాలేదు. గది సంతకాల కోసం వాళ్ళదగ్గరికి ఎవరూ పోలేదని బహానా అంతే "

పున్నమి వెలుతుర్ల రథం ధగ ధగ మెరిసిపోతున్నది. అయిదు అంత్రాల రథం. మూడో అంత్రంల దేవుణ్ణి పెడుతరు. కరెంట్ వైర్లు గుంజేటోళ్లు నాల్గో అంత్రంల ఉంటరు. ప్రతీసారి నేను రథం తోని ఊరంత తిరుగాలే అనుకుంట. నన్ను దర్గా దాంకనే రథంల కూర్చోబెట్టి దర్గా దాటంగానే రాందాస్ నన్ను ఇంట్ల దించుతడు.

నేను అయిదురోజుల సంది ఎదురుచూసింది పున్నమ కోసమే. రథమెక్కి బాలచంద్రుని లెక్క ఊరంతా తిరగాలే అనే కాయిష్. ఈసారి ఎట్లనన్న రథంల ఊరంతా తిరగాలే. అక్కతోని పెదబాపుకు చెప్పించి, రథమెక్కాలే అనుకున్న.

★ ★ ★

మబ్బుల మూడయ్యింది. అమ్మ కొట్టి లేపింది. రథం అయిదో అంత్రంల ఉన్న గంటల శబ్దం నా చెవులకు వినబడు తున్నది. కట్నాలు చదివించిన వారి పేర్లు మచ్చ రాజశేఖరన్న మైక్ ల చెపుతున్నడు.

అమ్మ అన్నది" ముఖం మీద నీళ్ల పోసుకొనిరా నిద్రమబ్బు పోతది. రథం బైలెల్లుతుంది. రాత్రి వానగొట్టింది. రథంల పెట్టిన విగ్రహాలను చినుకులు రాలకముందే శీనన్న లోపట పెట్టిండు. ఇప్పుడిప్పుడే వాన తగ్గింది. ముకం కడుక్కపో రథం తోని పోదువుగని"

ఆమాట అమ్మ అనుడే ఆలస్యం బాత్రూంలకు ఊరికిన.

పొద్దున ఎగిరిపోయిన పావురాలు నా భుజమెక్కి, నా తోని రథంల ఊరంత తిరుగున్నంత సంబురమయ్యింది.

(36వ పేజీ తరువాయి...)

మెడనే విడదీస్తాయి
నీకు నిలుచు హక్కు లేదు
నీకింకా దిక్కులేదు"...

లొంగిపోవడం దిగిపోవడం తప్ప గత్యంతరం లేదు. నాజీల మించిన నీ దురాగతాలకు కాలం చెల్లింది. సర్దుకో నీ సామాను... పారిపొమ్మని గురి చూసి కవితాస్త్రాలు సంధిస్తాడు.

ఎడతెగని కవిత్వ ఊట.. చల్లారని గుండెమంట... చిద్రమైన బతుకుల వెత, కవిత్వ ధారలుగా అదే మాట అదే మాట పదే పదే అనేస్తాడు కవి.

"చరిత్ర బొంగరం తిరిగి
కిరీటాలు నేల కొరిగి
ధరాధిపులు నశిస్తుంటే
బరాయెనాం నవ్వాబా!
పరాక్రమం చూపేవా? '
దిగి' పొమ్మని జగత్తంత
నగారాలు కొడుతున్నది".
"దిగిపోవోయ్ తెగిపోవోయ్
తెగిపోవోయ్ దిగిపోవోయ్"..
"ఇదే మాట ఇదే మాట
పద పదే అనేస్తాను"

అంటూ జనం ధిక్కారాన్నీ ఘూత్కారాన్నీ అవిశ్రాంత గీతమై హోరెత్తుతూ హోరుగాలిలా వినిపిస్తాడు.

దాశరథి 'అగ్నిధార' నైజాం పాలనపై ఎక్కుపెట్టిన పద్యాస్త్రమైతే... రెండోది రైతు దుస్థితికి చింతిస్తూ వారి తిరుగుబాటును ప్రేరేపించే ఆయుధ కవిత్వం.

"కర్షకులు, కార్మికులు
మథనపడే మేధావులు
తమ శ్రమలకు తగిన ఫలం
ఇమ్మంటే తిరుగుబాటు"

రైతులు, కార్మిక కర్షకులు తమ రక్తాన్నీ చెమటనూ ఒక్కటి చేసి ఉత్పత్తి చేస్తారు. కానీ వారికి కడుపునిండా తిండీ, సరైన బట్టలూ, ఇల్లూ ఏమీ అందకుండా అధికారులూ, యాజమానులూ దోచుకుంటారు. వారి కడుపుమాడు తూంటే, బతుకులు కాలుతూంటే తిరగబడినందుకు "అతివాదం"? వాళ్ళది అంటారు. శిక్షలకు పాత్రులని హింసిస్తుంటారు, దాన్నే కవితిలకుడైన దాశరథి 'అనంత సంగ్రామం' అంటాడు.

**రైతులు, కార్మిక కర్షకులు తమ రక్తాన్నీ చెమటనూ ఒక్కటి చేసి ఉత్పత్తి చేస్తారు. కానీ వారికి కడుపునిండా తిండీ, సరైన బట్టలూ, ఇల్లూ ఏమీ అందకుండా అధికారులూ, యాజమానులూ దోచుకుంటారు. వారి కడుపుమాడు తూంటే, బతుకులు కాలుతూంటే తిరగబడినందుకు "అతివాదం"? వాళ్ళది అంటారు.**

ఈ అనంత సంగ్రామం ప్రపంచంలో ఎక్కడ పీడనా, దోపిడీ ఉందో అక్కడ జరుగుతుంది. ప్రజా తిరుగుబాటు అనేది ప్రజాకవి కాళోజీ అన్నట్లుగా హింస కాదు, ప్రతి హింస.

తన తంత్రులు తెగిన అగ్ని వీణ నీచమైన పాలన నుండి ప్రాంతీయ జెండానెగిరేస్తూ విముక్తమైంది. ఆ సమయంలోనే కొద్దిగా ముందుగా దేశ స్వాతంత్ర్యం రెండు వందల ఏళ్ళ ఆంగ్ల పాలన నుండి స్వేచ్ఛను పొందింది. కానీ

"ఎటు చూచిన చటులానల
పటుదాహం ప్రబలుతోంది". మన భారత జనయిత్రీ
ఘనఫాలం జన సామాన్య నవోజ్వల
చైతన్య జ్యోతులతో
వెలుగుతోంది
వెలుగుతోంది"... అంటూనే
"భూతకాల బేతాళుడు
పాతాళపు పర్రలలో
ఇరుక్కొని మరణించెను".

ఇక

"సామ్రాజ్యపు సాంద్ర హిమం రాలి,
గాలిలో కలిసెను
నవభారత యువకులారా! కవులారా!
కథకులారా! భవితవ్యపు పతనానికి
హోతలు! నూతన భూతల నిర్మాతలు
మీరే, మీరే"

అంటూ దేశ యువతను చైతన్యీకరిస్తూ దేశ పునర్నిర్మాణానికి పూనుకోవాల్సింది వారేనన్న కర్తవ్యాన్ని సందేశంగా అందిస్తాడు.. 'అనల దాహం' కవితలో.

కులమతాల సుడి గుండాల నుండి బయటపడి భరతావని బలపరాక్రమం చెర విడిపించాలన్న పిలుపు దేశభక్తుడైన ఈ మహాకవిది. అంతే కాదు ఆయన స్వప్నం అన్నార్తులు అనాధలుండని నవయుగం. కరువులూ కాటకాలుండని పచ్చని కాలం.

ఈ కవి మానవోత్తముని అంతరంగంతో అలజడిని రేపే ప్రశ్నలెన్నో... దార్శనికతతో తన కవితల్ని శాంతి పావురాలుగా, ప్రశ్నల గొలుసుల్లా ప్రజా-పాలక సమాజానికి సంధించిన రోదనల వేదనలకు చివరాంకం ఎప్పుడో.. ఎంత దూరమో ఆ సామ్యవాద సమాజ సమయం... ఎప్పుడు

"మహాంబుధి విరిసిన
బడబానల పద్మంలో
వెలిసే విప్లవ బ్రాహ్మ
నవ జగత్తు పుట్టిస్తాడో!
భవ జగత్తు గిట్టిస్తాడో!"

అంటూ ఇంకా ఎదురుచూస్తున్న అమర కవిమూర్తి దాశరథికి జోహార్లు! ప్రజా బ్రహ్మలు దీర్ఘ శోకం విడనాడి దీర్ఘ నిద్ర నుండి లేచి తమ ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణానికి పూనుకుంటారని, నియంతల భరతం పడతారని, అభివృద్ధి, ప్రగతి బాటల్లోకి మళ్ళుతారని ఆశిస్తూ దాశరథికి నీరాజనాలు!

దాశరథి జీవితంలోని ముఖ్య సూత్రం రాత ముఖ్యంకాదు చేత ముఖ్యం అని కవులూ, రచయితలూ మేధావులూ ఈ సూత్రం గురించి నిత్యం ఆలోచిస్తూ ముందడుగు వేయాలన్న తపన దాశరథిది. మనమందరం సంఘం శరణం అందాం! ధర్మాన్ని శరణు వేడుకుందాం! దాశరథి ప్రజలకిచ్చిన కవి చాపం ప్రయోగిద్దాం! రుద్రవీణ రాగాలాపన చేద్దాం!

వ్యాసం

# గేయవీణా తంత్రి! దాశరథి!!

సినీ గీతాలలో దాశరథి ప్రతిభ...



అవుసుల భానుప్రకాశ్
96032 04507

అక్షరాలకు అగ్గిపులిమి నిప్పురవ్వలు రగిలించిన దాశరథి కలం పద్యమై అగ్నిని కురిపించింది. కలాన్ని అమృతంలో ముంచి, ఊహలను చిలికి, అనుప్రాసలతో పాటలను రాసిన దాశరథి కలం అమృతాన్నీ కురిపించింది. అగ్నివర్షాన్నీ, అమృతాన్ని సమపాళ్ళలో కురిపించిన దాశరథి 1960 నుండి 1978 వరకు 124 సినిమాలకు సాహిత్యం అందించాడు మనసులకు హత్తుకునే పాటలెన్నో రచించాడు. పదాల పోహళింపులో వైవిధ్యాన్ని, అనుప్రాసలతో ఆలంకారిక విన్యాసాన్ని, సన్నివేశ సందర్భశుద్ధితో ఔచిత్యాన్నీ పండించిన దాశరథి పాటలన్నీ తెలుగు వారి నాల్కలపై నిలిచిపోయాయి. దాశరథి పాటలకు స్వరకల్పన అలవోకగా సిద్ధిస్తుందని సంగీత దర్శకులు ఆయనను ప్రశంసించేవారట. ఈ ఒక్క వాక్యం చాలు దాశరథి గేయంలోని ఆత్మను ఒడిసి పట్టుకోవడానికి!

అప్పటికే లబ్ధప్రతిష్ఠులైన తాపీ ధర్మారావు, పింగళి, సముద్రాల, దేవులపల్లి, మల్లాది, శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర వంటి గేయ రచయితలు వెలగొందుతున్న తరుణంలో కలం బలంతో చిత్రపరిశ్రమలో 'కొత్త'కలం నిలదొక్కుకోవడమంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు. అయినా ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు దాశరథి. అవకాశాన్ని అందిపుచ్చుకుని కలం శక్తిని నిరూపించాడు. అగ్నిధారను వర్షించిన ఆయనకలం తెలుగుసినీ తోటలో వలపుల పుష్పాలను విరబూయించింది. పాటల ప్రసూనాలను అందించింది. పరిమళాల మాధుర్యాన్ని పంచింది.

సంగీతాన్ని సాహిత్యాన్ని సమ్మిళితం చేసిన పాట కలకాలం నిలిచిపోతుందన్న మర్మం తెలిసిన సత్కవి దాశరథి. పదాలను అలవోకగా పాదాల్లో ఇమిడ్చి, రాగ భావ పుష్టితో, భావనాబలంతో రచించే నేర్పు ఆయన సొంతం. ఇద్దరుమిత్రులు, వాగ్దానం సినిమాలకు పాటలు రాయడంతో తెరంగేట్రం చేసిన దాశరథి ఆణిముత్యాల వంటి పాటలెన్నో అందించాడు.

ఖుషీ ఖుషీగా నవ్వుతూ
చలాకి మాటలు రువ్వుతూ
హుషారు గొలిపేవెందుకే
నిషాకనులదానా
(ఇద్దరు మిత్రులు)

పాట తెలుగు ఉర్దూ పదాల పోహళింపుతో పరవళ్ళు తొక్కింది. ఈ గేయం చివరలో "హుషారుగా ఉందా ములే హమేషా మజాగా!" అనిపూర్తి చేయడం దాశరథికే చెల్లింది. ఈ పంక్తిలో 'ఉందాములే' తప్ప మిగతావన్నీ ఉర్దూపదాలే. నాయికానాయకుల మధ్య ఏకాత్మతా భావాన్ని ఇదే పాటలో అందంగా ప్రతిబింబిస్తాడు గీత రచయిత.

చంద్రుడు నేనై వెన్నెల నీవై
కలసిపోదమా హాయిగా
నేను వీణనై నీవు నాదమై
ఏకమౌదమా తీయగా

అనడంతో చక్కని రసబంధం పెనవేసినట్లైంది. కవి యొక్క భావనాబలానికి ప్రతీక ఇది.

వాగ్దానం సినిమాలోని "నాకంటి పాపలో నిలిచిపోరా.." అన్న పాట దాశరథి ఊహాశక్తికి తార్కాణం. ఈ పాటలో

ఈనాటి పున్నమి ఏనాటి పున్నెమో
ఈ జాబిల్లి వెలిగెను మనకోసమే
ఉయ్యాలలో తలపుటుయ్యాలలో
అందుకుందాము అందని ఆకాశము
ఆ చందమామలో ఆనందసీమలో
వెన్నెల స్నానాలు చేయుదమా

అని అనడం దాశరథి పదప్రయోగ నైపుణ్యానికి 'మెచ్చుతునక'. సుందరమైన పదాలన్నీ సౌందర్యంగా అమర్చడం ప్రతిభావంతమైన కవికే సాధ్యం. ఆ ప్రతిభా సుసంపన్నత దాశరథి కలానికి సొంతం. వెన్నెల స్నానాలు చేయడమన్నది కల్పనాశక్తికి నిదర్శనం. దాశరథి గేయాల్లో ఇది అడుగడుగునా కన్పిస్తుంది.

దాగుడు మూతలు చిత్రంలోని "గోరొంక గూటికే చేరావు చిలకా.." అన్న పాట దాశరథిని ఎందరికో అభిమానుల్ని చేసింది. డాక్టర్ చక్రవర్తి సినిమాలో

*ఓ ఉంగరాల ముంగురుల రాజా*
*నీ హంగుచూసి పొంగిపోనులేరా*
*నా సామీరంగా దణ్ణవోయీ హెూయి!*
*ఓ సిన్నోడ సిన్నోడా ఓ సిన్నోడా*
*ఓ బొంగరాల బుగ్గలున్న దానా*
*నీ కొంగుతాకి పొంగిపోతి జాణా!*
*ఓ బొంగరాల బుగ్గలున్న దానా*

అన్న పాటలో బిందుపూర్వక గ కారంతో ఉన్న ప్రాస పదాలన్నీ పాటకు సౌందర్యాన్ని తెచ్చాయి. పద్యాన్ని పరిపుష్టంగా ప్రాసలతో కొనసాగించే పండిత కవికి మాత్రమే ఇట్లా ప్రాసల ప్రయోగం అలవోకగా జాలువారుతుంది. ఇందులో బుగ్గలను బొంగరాలతో పోల్చడం నూత్న భావనకూడా!

1964లో వచ్చిన మూగమనసులులో దాశరథి రాసిన పాటలు శ్రోతల హృదయాలను కొల్లగొట్టాయి.

*గోదారి గట్టుంది గట్టుమీన సెట్టుంది*
*సెట్టు కొమ్మన పిట్టుంది పిట్ట మనసులొ ఏముంది*
*ఓ ఓ ఓ ఓ హెూయ్ గోదారి...*
*వగరు వగరుగ పొగరుంది, పొగరుకు తగ్గ బిగువుంది*
*తీయ తీయగా సొగసుంది,సొగసుని మించే మంచుంది.....*
*గోదారి గట్టుంది*

ఎందరినో మంత్రముగ్ధుల్ని చేసిన ఈపాట అడుగడుగున ముక్తపదగ్రస్తంతో అలరారింది. పదాల పునరుక్తులతో పాటకు మరింత బిగువు చేకూరింది. ఈ పాట ముక్తాయింపులో అన్నీ ఉన్నా "ఏది ఎవ్వరికి ఇవ్వాలో, ఇడమరిసే ఆ ఇది ఉంది" అనడం గొప్ప ధ్వనీభూతం. చివరలో "పిట్ట మనసు పిసరంతైనా పెపంచమంతా దాగుంది" అనడం పాత్రౌచిత్య రచనా విధానం. పాత్రకు తగ్గ మాటలు సంభాషణలకు వన్నెతెస్తే, పాత్రకు తగ్గ పదాలు పాటలో పడితే బంగారానికి తావి అబ్బినట్లుగానే శోభిస్తుంది. ఈ రచనా శిల్పమే దాశరథిని విశిష్టస్థానంలో నిలిపింది.

దాశరథి పాటలకు 'విరహ సంయోగాలు' ఒక పార్శ్వమైతే, 'భక్తి

**దాశరథి పాటలోని చైతన్యం కదిలించింది. విరహసంయోగాల శృంగార భావనలు హృదయానికి హత్తుకున్నాయి. లలితగీతాల లాలిత్యభావనలు మనసును కట్టిపడేస్తాయి.**

ఆధ్యాత్మిక భావన'లు మరొక పార్శ్వంగా కనిపిస్తాయి. నాదీ ఆడజన్మే సినిమాలో"

*కన్నయ్యా నల్లని కన్నయ్యా*
*నినుకనలేని కనులుండునా ..*

అనడం పోతనను స్ఫురింపజేస్తుంది. భాగవతంలో పోతన రచించిన కమలాక్షు నర్చించు కరములు కరములు అనే పద్యంలోని "సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు" అనే పాదం గుర్తుకు తెస్తుంది. భక్తిభావాన్ని ప్రకటిస్తుంది.

దాశరథి పాటలన్నీ అందంగా చెక్కిన శిల్పాలై శోభిస్తాయి. మనోనేత్రాన్ని తెరిపిస్తాయి.

*మదిలో వీణలు మ్రోగే ఆశలెన్నో చెలరేగే*
*కల్లనైన కనని ఆనందం ఇలలోన విరిసె ఈనాడే*

వంటి అనుభూతులన్నీ దాశరథి పాటలు వినగానే మోసులెత్తుతాయి. పాటలు వీణానాదమై అలరిస్తాయి. భావాలు శృంగార భావనల వీచికల్లో తేలి యాడజేస్తాయి. పదబంధాలు సుకుమార సునిశిత ఒడుపులను తెలియజేస్తాయి.

పూజ సినిమాలో దాశరథి రాసిన ఎన్నెన్నో జన్మలబంధం నీదీ నాదీ అన్న గేయపాదాలు ప్రతినవనవోన్మేష ప్రేమికు లకు నిత్యాలాపనమే! ఆత్మగౌరవం సినిమాలోని ఒక పూలబాణం తగిలింది. మదిలో తొలిప్రేమ దీపం వెలిగిందిలే అన్న పాట ఎందరి హృదయాలకో వలపుల బాణం వేసింది. ఎందరి జీవితాల్లోనో ప్రేమదీపం వెలిగించింది. నవరాత్రి సినిమాలో నిషాలేని నాడు హుషారేమి లేదు, ఖుషీ లేని నాడు మజాలేనె లేదు అన్న పాట ఎందరికో కైపెక్కించింది. శ్రోతలందరినీ రాగడోలికల్లో ఊగించింది. పూలరంగడు చిత్రంలో నీవు రావు నిదరు రాదు.. నిలిచిపోయె ఈ రేయి అన్న పాట ఎందరికో నిదురను దూరంచేసింది. వలపుల తోటల్లో విరహ గీతికలు పలికింప జేసింది. రాము సినిమాలోని రారా కృష్ణయ్యా రారా కృష్ణయ్యా.. దీనులను కాపాడ రారాకృష్ణయ్యా! పాట విన్నవారందరినీ ఆర్తితో అలరించింది. భక్తి భావపారిజాతమై బృందావన వైశిష్ట్యం అందరికీ చూపింది. రంగుల రాట్నం సినిమాలోని ఏడేడు శిఖరాలు నేనడువలేను ఏపాటి కానుకలందించలేను అనే పాట భక్తుని ఆర్తికి పతాకస్థాయిని చేర్చుతుంది. భలే రంగడు సినిమాలో నిన్ననాదే నేడు నాదే రేపు నాదేలే.. ఎవరేమన్నా ఎన్నటికైనా గెలుపునాదేలే అన్న పాట పాడుకున్న వారందరిలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసింది. పాట ఆత్మస్థైర్యాన్ని నింపగలదని నిరూపించింది.

దాశరథి పాటలోని చైతన్యం కదిలించింది. విరహసంయోగాల శృంగార భావనలు హృదయానికి హత్తుకున్నాయి. లలితగీతాల లాలిత్యభావనలు మనసును కట్టిపడేస్తాయి. వీణపాటలన్నీ గుండె స్వరలయలై మ్రోగుతాయి. భక్తిపాటలు మనస్సును అర్పణం చేస్తాయి. గాయకులచేత , సంగీత దర్శకులచేత సహ గీత రచయితలచేత ప్రశంసలం దుకున్న విద్వత్కవితామూర్తి దాశరథి కృష్ణమాచార్య. అందుకే వేటూరి వారు దాశరథి జన్మదినాన..

*కవితా శరధికి నవ యువ*
*కవి దాశరథికి నిత్యకళ్యాణమగున్!*
*రవికుల దాశరథికి వలె*
*కవికుల దాశరథి పరిధి కడలుకొను నిలన్!*

అని పద్యాభినందన అందించారట తెలుగు వారు దాశరథి అయిన శ్రీరాముణ్ణి కొలిచినంతకాలం దాశరథి సాహిత్యాన్ని పాడుకొంటూనే ఉంటారన్నది ఏమాత్రం సత్యదూరం కాదు. జయహెూ దాశరథీ! గానామృత శరధీ!!

వ్యాసం

# దాశరథి కవిత్వం - అభ్యుదయ దృక్పథం

గాయపడిన కవి గుండెలకు దర్పణం...



డా. వంగరి త్రివేణి
99514 44803

అభ్యుదయ కవిత్వం ప్రధాన లక్షణాలుగా సాహితీకారులు వస్తు ప్రాధాన్యం, వాస్తవిక దృక్పథం, మానవతా వాదం, ప్రగతి శీలకమైన మార్పులను సూచించారు. నిర్వచనాల పరంపరలో విశ్లేషిస్తే "అభ్యుదయ రచన సమకాలికమైన జీవిత పరిస్థితులకు రాజకీయ వాతావరణానికి, ఆర్థిక సమస్యలకు, సమాజ సంఘర్షణలకు, నైతిక సందర్భాలకు, ఐహిక ఆముష్మిక సిద్ధాంతాలకు, వైజ్ఞానిక విశేషాలకను గుణ్యంగా, అనుకూలంగా తగినట్టి, అవసరమైనట్టి మార్పులతో విలసిల్లవలెను" అని పి.వి. రాజమన్నారు తలచారు. 'పీడింపబడేవాళ్లూ పీడించేవాళ్లూవున్న యీ వర్గసమాజం ఉండాలని కోరారు. "రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటించేవారు ఎప్పుడూ అభ్యుదయ వాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలనుకోవటమే అభ్యుదయం ఇది మనసులో పెట్టుకొని వ్రాసేది. అభ్యుదయ రచన" అని దేవులపల్లి కృష్ణశాస్త్రి భావించారు. "అభ్యుదయ రచయితలు తెచ్చిన విప్లవం రసావిష్కరణకు రసాస్వాదనకు సంబంధించినది. సాహిత్యం ఒక భోగవస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరుగబడుతున్నారు. నేటి రచయితకు ప్రజలే ప్రమాణము. కొన్ని కారణాల వల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వతోన్ముఖంగా తిప్పటానికి నేటి రచయితలు పాటుపడుతున్నారు" అని శ్రీశ్రీ వెల్లడించారు.

> **ప్రథమ శ్రేణి అగ్రగణ్య అభ్యుదయ కవులలో తెలంగాణము నుంచి ఘనతకెక్కిన కవి దాశరథి కృష్ణమాచార్యులు. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, అమృతాభిషేకం, తిమిరంతో సమరం, పునర్నవం, నేత్ర పర్వం, కవితా పుష్పకం, ధ్వజమెత్తిన ప్రజా, నవ మంజరి వంటి ఖండ కావ్యాలలో అభ్యుదయ ప్రస్థానం స్పష్టంగా దర్శనమవుతుంది.**

సామాన్య మానవ ప్రాధాన్యము. గత నిరసనము, వర్గ సంఘర్షణ, విప్లవ ప్రబోధము, వీర గాథా కథనము, యుద్ధ విముఖత్వము, శాంతి ప్రియత్వము, సమ సమాజ నిర్మాణము అనేవి అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణాలు. అభ్యుదయ కవిత్వం వర్గచైతన్యానికి, సంఘర్షణకు పరిమితంగాక విశ్వశ్రేయస్సును, సమాజ శ్రేయస్సును కూడా ఆకాంక్షించింది. అభ్యుదయ కవిత్వానికి సరళత, స్పష్టత ప్రధాన గుణాలు. అభ్యుదయ రచయితల సంఘం 1943లో ఏర్పడింది. కాని శ్రీశ్రీ 'సుప్తాస్థికలు' రచించిన 1929 నాటి నుండియే తెలుగులో అభ్యుదయ కవిత్వం ప్రారంభమయినది. తొలిదశలో అభ్యుదయ కవులైన శిష్టా ఉమామహేశ్వర రావు, శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీరంగం నారాయణబాబు, పట్టాభి కావొచ్చు, ముద్దుకృష్ణ, పురిపండా అప్పలస్వామి మొదలైనవారు కొత్తదనం కోసం అభ్యుదయ కవిత్వం వెలువరించారు.

అటువంటి ప్రథమ శ్రేణి అగ్రగణ్య అభ్యుదయ కవులలో తెలంగాణము నుంచి ఘనతకెక్కిన కవి దాశరథి కృష్ణమాచార్యులు. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, అమృతాభిషేకం, తిమిరంతో సమరం, పునర్నవం, నేత్ర పర్వం, కవితా పుష్పకం, ధ్వజమెత్తిన ప్రజా, నవ మంజరి వంటి ఖండ కావ్యాలలో అభ్యుదయ ప్రస్థానం స్పష్టంగా దర్శనమవుతుంది. దాశరథి సమకాలీన సమాజం అభ్యుదయ మార్గాన్ని అనుసరించింది. నాటి కాలం ఒక విప్లవాత్మకమైన మార్పునకు కారణమైంది. అందుకు నాటి దేశకాల పరిస్థితులే ప్రధానమని చెప్పవచ్చు. సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, భౌగోళిక, చారిత్రక పరిణామాలు ఉద్యమ భావజాలాన్ని ప్రభవింపజేశాయి. రాచరికం,

పెట్టుబడిదారీ విధానం మీద ఒక గొప్ప తిరుగుబాటు చెలరేగింది. అటువంటి ధోరణికి దాశరథి కవిత్వం దృష్టాంతంగా నిలిచింది. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అన్న దాశరథి "రైతుదే తెలంగాణము" అని కూడా కీర్తించారు. తెలంగాణమును తన జన్మభూమిగా ప్రకటిస్తూనే తెలంగాణలోని రైతుల కష్ట సుఖాల ఒరవడిని కవిత్వ చాలులో మొలకెత్తింప జేశారు.

అగ్నిధారలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కవిత "ఆ చల్లని సముద్ర గర్భం". కాల నిర్దేశాన్ని అధిగమించిన కవిత ఇది. భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో నిలవదగిన కవిత. జీవ పరిణామ సిద్ధాంతాన్ని అనుసరించి ఈ కవితకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కాలగర్భంలో కలిసిన రాజుల చరిత్రను కళ్ళకు కట్టినట్టు తెలుపుతూ మానవ జీవన కోణాన్ని ఆత్మీయంగా స్పృశిస్తుంది.

*"ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో*

*ఆ నల్లని ఆకాశంలో కానరాని భానువులెందరో"*

(అగ్నిధార పుట: 109)

*"భూగోళం పుట్టుక కోసం కూలిన సుర గోళాలెన్నో*

*నర మానవ రూపం కోసం జరిగిన పరిణామాలెన్నో"*

(అగ్నిధార పుట: 109)

రాజుల క్రూర పాలనను, ధనవంతుల క్రౌర్యాన్ని తెలుపుతూనే శ్రమ శక్తి ఔన్నత్యాన్ని ఈ కవితలో అద్భుతంగా వెల్లడించారు. జగత్తంతా రగులు గొల్పుతున్న క్రోధ జ్వాలలు ఆరని కుంపటిగా సంభ్రమించి ఆ దుర్మార్గుల పాలిట శాపంగా పరిణమిస్తుందని విశ్వసించారు. అన్నార్తులు, అనాథల దీన స్థితిని తెలుపుతూ నవ యుగానికి బాటలు వేశాడు. కరువు కాటకాలు కనిపించని కాలం రావాలన్నాడు. అన్నింటికీ మించి కులం పేరిట, మతం పేరిట జరుగుతున్న దారుణాలను అరికట్టాలనే నిర్దేశం ప్రబోధంగా ఈ కవితలో కనిపిస్తుంది.

*"పసిపాపాల నిదుర కనులలో మురిసిన భవితవ్యం ఎంతో*

*గాయపడిన కవి గుండెలలో వ్రాయబడని కావ్యాలెన్నో"*

(అగ్నిధార పుట: 109)

అటువంటి సమాజం కోసం కవి పరితపన. వేల ఏండ్లుగా సాగుతున్న సంగ్రామం రాజాది రాజుల నుంచి దీనాతిదీనుల వరకు సాగిన ప్రయాస సరళిని కవి ఎంతో ఆర్ద్రంగా వర్ణించారు. పీడిత ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిచ్చి గొంతెత్తి పాడగలిగిన కవి దాశరథి. జనుల హృదయాలలోని ఆకాంక్షలకు తగినట్లు గానే శక్తివంతమైన కవిత్వాన్ని బాహాటంగా వ్యక్త పరిచారు. దౌర్జన్యం, అన్యాయం, అక్రమాల మీద తిరుగుబాటే దాశరథి కవిత్వంగా పరిణమించింది.

"అగ్నిధార" ఖండ కావ్యాన్ని మొట్టమొదట 1949 లో సాహితీ మేఖల వారు ప్రచురణలోకి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా ప్రకాశకులు మాట్లాడుతూ "శ్రీ దాశరథి ఖండ కావ్య రచనలను ప్రప్రథమమున సంపుటీకరించి అగ్నిధార ప్రకటించి అభినవ్యభవ్యరుచులను ఆంధ్ర లోకానికి అందించు తున్నాము. సాహితీ మేఖల సర్వదా తన చిరుగంటల ఘలంఘలలలో ఆంధ్ర సాహితీ రంగమును మంగళ నినాద పరిశోభితం చేయగలదు" అని అన్నారు. దేవులపల్లి రామానుజారావు ఈ సంపుటికి సంక్షిప్త పీఠికను కూర్చుతూ "అగ్నిధారయను గ్రంథ నామకరణము ఈ ఖండ కావ్య సంపుటి యొక్క ప్రత్యేకతను రచయిత వ్యక్తిత్వమును సూచించు చున్నది. గ్రంథ కర్త శ్రీ దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణలో యువ కవులలో అగ్రగణ్యులు. ఆయన హృదయమును కుమల పెట్టిన పొగలు, సెగలు పైకి ఉబికి వచ్చి ఈ గ్రంథంలో అక్షర రూపము దాల్చినవి... ఆగర్భ శ్రీనాథునికి, అనాథునికి మధ్య చిరకాలము నుండి జరుగుచున్న సంఘర్షణయే మా దాశరథి కవితా వస్తువు." అని ప్రేరేపించారు. నాడు అగ్నిధారలోని కవితలు మాతృభూమి, ప్రజా మిత్ర, గోలకొండ, సారథి, అభ్యుదయ, విశాలాంధ్ర వంటి పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ఈ ఖండ కావ్యంలో భారతావని, రైతుదే !, అగ్నిధార, రుధిర సంధ్య, జ్వాలా తోరణము, జైల్లో, కవీ!, క్షమా మూర్తీ!, అస్తమయం, హిమజ్వాల, ఉస్సురనెదవు, మల్లించు రథము, ఇందుపుర దుర్గము, అంతర్నాదము, ప్రాగ్భూమి, అనంత సంగ్రామం





వ్యాసం

వంటి కవితా ఖండికలలో అభ్యుదయ పంథాను నిర్దేశించారు.

అగ్నిధారలోని మొదటి కవితా ఖండికలోనే "భారతావని"కి నవ పతాక జయ హారతులు పడుతూ కీర్తించారు.

*"ఓ*
*జనతా*
*నతాంజలి పుటోజ్జ్వల*
*క్ష్ణోష్ణ నవోష్ణ రక్త ధారా జలసిక్త*
*పాద కమల ద్వయ శోభి మనోజ్ఞ దేహ రేఖా*
*జయ భారతీ"*

(అగ్నిధార పుట: 1)

సుందర భారతావనిని సుశోభితంగా, సుమధురంగా ప్రవచించిన కవి తదంతర కవితా ఖండికల్లో అభ్యుదయ ప్రజ్వలన గావించారు. భారతదేశానికి వెన్నెముక రైతు. రైతు సుఖంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందనేది నానుడి. గ్రామ స్వరాజ్యాన్ని కాంక్షించే నేపథ్యాన్ని దాశరథి కవిత్వం స్పష్టంగా వెల్లడించింది. రైతు రాజు సమానంగా జీవించే మార్పు కోసం తన కవిత్వాన్ని సాధనంగా చేసుకున్నారు కవి. "దున్నే వానిదే భూమి" అనే సిద్ధాంతాన్ని "రైతుదే !" అనే కవితలో పలికించారు.

*"ప్రాణములొడ్డి ఘోర గహనాటవులన్ బడగొట్టి మంచి మా*
*గాణములన్ సృజించి ఎముకల్ నుసి జేసి పొలాలు దున్ని భో*
*షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే తెలం*
*గాణము రైతుదే ముసలి నక్కకు రాచరికంబు దక్కునే?*
*ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని*
*తీగెలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాన కోటి రత్నాల వీణ"*

(అగ్నిధార పుట: 3)

కవిత్వం ఎల్లప్పుడూ సమాజ హితం కాంక్షించాలనేది కవి సందేశం. మానవ ప్రయోజనం చేకూర్చని కవిత నిష్ప్రయోజనమని దాశరథి తలపోశారు. అగ్నిధారలో తన కవితల అల్లికను నిరూపించే కవిత ఖండిక ఉంది. ఎరుపును ప్రబోధించే పదాలు సూరీడు, రుధిరం, సిందూరం, తిలకం, కెంపులు, ఉషస్సు వంటి వాటితో అభ్యుదయ ధారను పారించారు కవి. అభ్యుదయ కవుల కవితా నేర్పు, కూర్పు ఎలా ఉండాలో కవి తెలియజేశారు. ఈ కవిత ఆ పరిశీలనలోకి వస్తుంది.

"రక్తిల లోచనమ్ములు కళా రస ధారల పారణమ్ముతో
వ్యక్తములయ్యె నా నుదుటి యందున కెంపులు దేరి, నిశ్చలా
వ్యక్త సమాధిలోన కలమంది నిశా విషమెక్కి, రాగ నా
రక్తముతో ఉషా కరతలమ్ములలో కవనమ్ములల్లెదన్"

(అగ్నిధార పుట: 4)

దాశరథి కవితలలో "రుధిర సంధ్య" ఖండిక మరో ప్రభంజనం సృష్టించింది. చీకటి తెరలను చీల్చి ఉదయించే భానుడి రాకను స్వాగతిస్తూ చేసిన ప్రత్యూష ఇది. అంధకార సమాజం నిర్మూలించబడి ఉజ్జ్వల కాంతి రేఖ ప్రసరించాలని కవి ఆశించారు. పేదల దీన గాథలను ఏకరువు పెడుతూనే వారి సముజ్జ్వల భవిష్యత్ కు కవితా మార్గాన్ని సూచించారు. దీనికి ప్రతీకలుగా మోదుగుపూలను, వసంతరాజును తీసుకున్నారు.

*"అగ్ని జ్వాలిక వోలిక నగ్నముగా నాట్యమాడు నవవాసంతో*
*ద్విగ్న పలాశ ప్రసవాలగ్న జపాలక్త రక్త రమ కనుపించెన్"*

(అగ్నిధార పుట: 11)

అని దాశరథి గొంతెత్తి ఆలాపించారు. "జ్వలా తోరణము" కవితా ఖండికలో కూడా ప్రకృతి వస్తువులను ఆలంబనగా తీసుకొని ప్రగతి శీలతను ప్రదర్శించారు. దాశరథి ఆలోచనలకు ప్రత్యక్ష రూపం పద విన్యాసం. సంప్రదాయ భాషా స్వరూపంతో ఆధునిక భావజాలాన్ని ప్రదర్శించడం ఈ కవికి మాత్రమే సాధ్యమైంది. నిరాడంబరమైన వ్యక్తిత్వం కలిగిన దాశరథి అద్భుతమైన పదాడంబరతో

**కవిత్వం ఎల్లప్పుడూ సమాజ హితం కాంక్షించాలనేది కవి సందేశం. మానవ ప్రయోజనం చేకూర్చని కవిత నిష్ప్రయోజనమని దాశరథి తలపోశారు. అగ్నిధారలో తన కవితల అల్లికను నిరూపించే కవిత ఖండిక ఉంది. ఎరుపును ప్రబోధించే పదాలు సూరీడు, రుధిరం, సిందూరం, తిలకం, కెంపులు, ఉషస్సు వంటి వాటితో అభ్యుదయ ధారను పారించారు కవి. అభ్యుదయ కవుల కవితా నేర్పు, కూర్పు ఎలా ఉండాలో కవి తెలియజేశారు. ఈ కవిత ఆ పరిశీలనలోకి వస్తుంది.**

అమూల్యమైన శబ్దౌన్నత్యం సాధించారు. తోరణాలు సంస్కృతి ప్రదర్శనకు సూచిక. కవి కలంలో అవి జ్వాలా తోరణాలు అయ్యాయి. చెడుపై మంచిని గెలవాలనే తపన కవి ప్రతి పద ప్రయోగంలో కనిపిస్తుంది. నిజాం కాలంలో రజాకార్ల అఘాయిత్యాలకు చలించిన కవి తెలంగాణ ప్రజల గుండె కవాటలను తెరిపించారు. ఈ సందర్భంలో జనులకు మేలుకొలుపుగా కవి రుధిర సంధ్యా రాగంతో జ్వాలా తోరణాలు కట్టారు.

*"జ్వాలాతోరణ మాల కొండ సిగపై బంధించినారెవ్వరో*
*బాలా! మాధవ మాస వాసరములన్ ప్రత్యగ్ర మాధ్వీక పు*
*ష్పాలన్ బంభర కంబు కంధరలు తప్పన్ ద్రావి నిద్రింపగా*
*కాల జ్వాలలు చుట్టు ముట్టినవి సౌఖ్య ధ్వంసకా గ్న్యోఘముల్"*

(అగ్నిధార పుట: 12)

దాశరథి నిజామాబాద్ సెంట్రల్ జైలులో బందీగా ఉన్నప్పుడు "ఇందుపుర దుర్గము" కవితా ఖండిక రచించారు. ఇందూరు గత వైభవాన్నితెలియజేస్తూ మరాఠి నాయకుల వీర శౌర్యాన్ని ప్రకటించారు. మారాఠి వీరులు తమ

పటా పటా కొరికిన పండ్లలో గోల్కొండ గుండ్లు కరిగింపజేశారని, చిటికె వేయుటలోనే ఔరంగాజేబు కంగారు పడ్డారని, కటి బిగించడంతోనే గగన భూమార్గాలు కట్టుబడ్డాయని, గుటక మ్రింగడంలోనే తురక భూపతుల నెత్తురు తరిగిందని వీర చరిత్రను కొనియాడారు. స్వాతంత్ర కాగడాలను మోసి, రాజ్యం చేసిన ఘనతను వర్ణిస్తూ కత్తి మొనతో దురాత్ముల మొత్తినారని విశేషంగా కీర్తించారు. ఇక జైలును గూర్చి తెలుపుతూ ఇది ఒకప్పుడు దేవళము, వేరొక్కప్పుడు దుర్గము, నేడు జైలుగా పరిణమించిందని వ్యథ చెందారు. భవిష్యత్తులో ఏ రూపం ధరించనుందో అని సంశయాన్ని ప్రకటించారు.

"జైల్లో" కవితలో తమ కష్టాలను చెప్పుకుంటూనే...

*"ఇట వసంతం లేదు, సహింపరాని*
*గ్రీష్మ హేమంత కాల కాళికలె గాని;*
*ఇట ఉషస్సులు లేవు భరింపరాని*
*అంబువాహ సందోహ నిశాళి కాని"*

(అగ్నిధార పుట: 17)

అని అంటూ చివరకు...

*"పరుల హింసించు వారలు బాగు పడెడు*
*మాట వట్టిది, నాశనమ్మౌట నిజము"*

(అగ్నిధార పుట: 17)

అంటూ ముగింపు పలికారు.

దాశరథి ఖండకావ్యాల్లో మరొక ప్రసిద్ధమైన సంపుటి "రుద్రవీణ". ఈ గ్రంథాన్ని ప్రచురిస్తున్న సందర్భంలో ప్రకాశకులు క్రింది విధంగా పేర్కొన్నారు.

"దాశరథి గీతాలు వినని రసికులు
తెలంగాణలందుండరు
దాశరథి ప్రేమించని సాహిత్యికులు
తెలంగాణలో లేరు
దాశరథిచే స్వీకరింపబడని కావ్య
వస్తువు తెలంగాణలో లేదు
దాశరథియే తెలంగాణము,
తెలంగాణయే దాశరథి"

కవి యొక్క కవితా ప్రతిభను, పాటవాన్ని, పాశీల్యాన్ని పేర్కొన్నారు. రుద్రవీణలో మంగళ గీతి, మూర్ఛన, రస సమాధి, ఉషస్సుందరి, మేలుకొలుపు, స్వామి పూజ, వీర తెలంగాణము, ముక్తభూమి, అగ్ని కుంకుమము, రుధిర దీపిక, కవాటం వంటి కవితా ఖండికలు అభ్యుదయ భావాన్ని ప్రేరేపిస్తాయి. రుద్రవీణను తెలంగాణమునకు అంకితం చేస్తూ నిద్రాణమై ఉన్న జగతిని మేల్కొల్పిన విధానాన్ని తెలియజేశారు.

*"పాటలు పాడితిన్ తెలుగు బాబులు*
*నిద్దుర మేలుకోగ, పో*
*రాటము సేయగా కరకు*
*రాచరికమ్మును కూలద్రోయగా;*
*కోటిగళాల నొక్కకడ గూర్చితి విప్లవ*
*శంఖమొత్తితిన్*
*నాటికి నేటికిన్ తెలుగు నాటికి*
*వెచ్చదనమ్ములూదితిన్"*

(రుద్రవీణ పుట: 1)

నిజాం వ్యతిరేక పోరాటంలో తెలంగాణ ప్రజలకు కవితా రుధిరంతో వీర తిలకం దిద్దారు దాశరథి. ప్రజల సంఘటిత శక్తిని, ఉద్యమ ప్రజా ధ్వజాన్ని సమీకరించి వెలుగు కిరణాలతో తెలంగాణమునకు పారాణి అద్దారు. దాశరథి కవితా సాంద్రత సామ్రాజ్య సౌధాలను కూకటి వేళ్లతో కూలదోసిందంటే అతిశయోక్తి కాదు. భగభగలాడే దాశరథి కవిత్వ పద సంపద కొలిమిని రాజేసింది. విప్లవ జ్వాలలను రగులు గొల్పింది. ఎంతటి సుకుమారమైన ప్రకృతి వస్తువైనా కవి కవితలో అగ్ని శిఖగా రుద్రవీణను పలికించాయి.

**దాశరథి ఖండకావ్యాల ధారలో "అమృతాభిషేకం" ఒకటి. అమృతపానము, ఊర్వశి, దీపాంగన, చీకటి నటీ, మహాంధ్రి, వాగ్వజ్రం, ఆశా సౌధం, అమృతాభిషేకం వంటి కవితా ఖండికలు ప్రజా క్షేత్రంలో విత్తిన కుసుమాలనే చెప్పాలి. సూర్యోదయ కాంతి జగత్తునంతటిని మేల్కొల్పుతుంది. చైతన్యానికి, జన జీవన రస సార ప్రవాహానికి, బండి ఇరుసుల బ్రతుకు బాటకు ప్రథమ ప్రచారకుడు సూర్యుడు.**

అందుకు ఒక ఉదాహరణ: "వెన్నెల కాగడాలకు ద్రవించే చీకటి కొండపైన కూర్చున్న అనంత తారకలు ప్రకాశిస్తూ జారి వచ్చి ఈ పున్నమి నాటి చెంగలువ పూవులవోలే వికసిస్తున్నాయి. మిన్నులు దించి తెచ్చెదనని మాట ఇస్తున్నాయి." అని కవి అంటాడు. ఇక్కడ మిన్నులు అంటే ధనిక వర్గం, భూస్వామ్య, జమిందారీ విధానం. ఆధిపత్య వర్గం మీద పోరు నిరంతరాయంగా సాగుతూనే ఉంటదని సమానత్వ సమాజ నిర్మాణానికి వర్గ సంఘర్షణే ప్రధాన ధ్యేయమని దాశరథి ప్రకటించారు.

"వీర తెలంగాణము" కవిత తెలంగాణలో జరిగిన గత వైభవ పోరాట స్ఫూర్తికి నిలువుటద్దంగా నిలుస్తుంది. తెలంగాణ గడ్డ మీది పౌరుషం, రోషం సామాన్యుడిని సైతం నిలువెత్తు గుణపాలై నిలిచిన సంగతి గుర్తుకొస్తుంది. ఆ ఉత్తేజం, ప్రోత్సాహం కవి కవితల ద్వారా సాధింపబడిందనేది అక్షర సత్యం. ఆ కారణంగానే చెలరేగిన కవితా ధూమజ్వాలలు తెలంగాణలో సమర జ్యోతిని వెలిగించాయి.

*"తెలంగాణమ్మున గడ్డి పోచయును*
*సంధించెన్ కృపాణమ్ము! రా*
*జలలాముండను వాని పీచమడచన్*
*సాగించె యుద్ధమ్ము! భీ*
*తిలి పోయెన్ జగమెల్ల యేమియగునో*
*తెల్యంగ రాకన్! దిశాం*
*చలముల్ శక్ర ధను: పరంపరలతో*
*సయ్యాటలాడెన్ దివిన్"*

(రుద్రవీణ పుట: 12)

నాడు తెలంగాణలో జరిగిన ఆస్తుల దోపిడి దౌర్జన్యం చరిత్ర, స్త్రీల మానహాన అపహరణ ఉదంతాలు, ఉద్యమం చెలరేగిన ఊళ్లకు అగ్గిబెట్టిన సంఘటనలు, తల్లి పిల్లల కడుపు కొట్టిన దుర్మార్గపు సందర్భాలకు దాశరథి హృదయం నిప్పు కణికలను మండించింది. కార్మిక లోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి అనువుగా కవితా సౌధాన్ని నిర్మాణం

చేశారు శ్రీశ్రీ. ఆ అభ్యుదయ పంథానే అనుసరిస్తూ దాశరథి శ్రమ శక్తిని, శ్రమ జీవుల నెత్తురు బొట్లను ప్రమాణంగా తీసుకొని "కవాటం" అనే కవిత రచించారు.

*"శ్రమ జీవుల స్వేదం... పొంగిన లవణ*
*సముద్ర తరంగం*
*లవణ సముద్రం పెంచిన భవితవ్యం -*
*అమృత కిరణ చంద్రబింబ పౌర్ణమాసి"*
(రుద్రవీణ పుట: 28)

దాశరథి రుద్రవీణను జన శక్తికి సాధనంగా మ్రోగించారు. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ...

*"చింతల తోపులో కురియు*
*చిన్కులకున్ తడి ముద్దయైన బా*
*లింత యొడిన్ శయించు పసి రెక్కల*
*మొగ్గను వోని బిడ్డకున్*
*బొంతలు లేవు కప్పుటకు బొంది*
*హిమంబయి పోవునేమొ! వా*
*యింతును రుద్రవీణ పయి నించుక*
*వెచ్చని అగ్నిగీతముల్"*
(రుద్రవీణ పుట: 4)

"మూర్ఛన" కవితా ఖండికలోనిదిపై పద్యం. దారిద్ర్యం ప్రళయ తాండవం చేస్తున్న దృశ్యం, దోపిడీదారుల చేతుల్లో నలిగిపోతున్న ప్రజానీకం, పేదల అగచాట్లు ఒక్కసారిగా కళ్ల ముందు ప్రత్యక్షమవుతాయి. ఆర్థిక అసమానతలు దేశ భవిష్యత్తును బలిచేస్తూ అగాధంలోకి కూలదోశాయి. నాటి సాంఘిక దౌర్బల్యానికి ప్రజా సమూహ సంఘటిత శక్తి హీనత ఒక కారణం అయితే నియంత పాలకుల దాష్టీకం, దౌర్జన్యం మరొక కారణం. అందుకే గొంతుకలెండి డొక్కలకు కొంచెం గంజియు లేకపోయిన సమ్మె చేసే పేదల గూర్చి రుద్రవీణ మ్రోగిస్తానని కవి పలికిన పలుకులు నాటి కాల పరిస్థితులకు అద్దం పడుతుంది.

దాశరథి ఖండకావ్యాల ధారలో "అమృతాభిషేకం" ఒకటి. అమృతపాతము, ఊర్వశి, దీపాంగన, చీకటి నటి, మహాంధ్రి, వాగ్వజ్రం, ఆశా సౌధం, అమృతాభిషేకం వంటి కవితా ఖండికలు ప్రజా క్షేత్రంలో విత్తిన కుసుమాలనే చెప్పాలి. సూర్యోదయ కాంతి జగత్తునంతటిని మేల్కొల్పుతుంది. చైతన్యానికి, జన జీవన రస సార ప్రవాహానికి, బండి ఇరుసుల బ్రతుకు బాటకు ప్రథమ ప్రచోరకుడు సూర్యుడు. నిరంతర రథ చక్రాల ప్రయాణంలో ప్రజా కోటికి జవసత్వాలను కలుగజేస్తూ ముందుకు సాగుతాడు. దాశరథి సూర్య ప్రభల పద సౌజన్యాన్ని ప్రత్యక్ష పరిచి "సుప్రభాతము" కవితా ఖండికలో వెల్లడించారు. వేకువ కిరణాల అభ్యుదయ తేజస్సును క్రింది పద్యంలో చూద్దాం:



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అధ్యక్షులు
డా॥ సునీతీ కుమార్ ఛటర్జీ నుండి స్వీకారం

*"వీడటో నిద్రాణ పృథివి కన్నుల మీది*
*చీకటి బరువు పోజిమ్ముువాడు*
*ఈతడేనా తమో భూతమ్ము సిగలోన*
*మందార మాలిక మలచువాడు*
*ఈతడేనటవె జీమూతమ్ములను*
*పెంచి జగతిపై ముత్యాలు చల్లువాడు.*
*ఈతడేనా జగద్ధితమ్ముకై గగనాన*
*కాలికి బలపమ్ము కట్టి తిరుగు"*
(అమృతాభిషేకం పుట: 10)

చక్కటి, చిక్కటి కవితా ధార దాశరథిది. భాషా పరంగా సొబగునే కాదు భావ స్ఫురణ ప్రతి భాసం ఆయన కవితలో అనర్ఘలంగా పొడసూపుతుంది. సూర్యుడిని, అరుణ ప్రభా కాంతులను ఏ విధంగా కవి పొగిడాడో అదే విధంగా చీకటిని, హరినీల కాంతులను అభ్యుదయ సంజనితంగా ఊహించారు కూడా. అది "తామసి".

*"మహాంధకారాన మనస్సు శాంతి*
*గొనె, దాను భవత్ కమనీయ*
*కాంతి సాధానకు నన్ను పిల్వకుము*
*తన్వి! విభా విభావిభవాభిరామవై!"*
(అమృతాభిషేకం పుట: 28)

కటిక చీకటి నుంచి వెన్నెల కాంతులను కూడా ఆశించని దీర్ఘ కవిత "తామసి". చీకట్లను సమూహ శక్తికి ఆలంబనగా తీసుకున్నారు కవి. పునఃశ్శక్తికి ఉత్తేజాన్ని ఇచ్చే తామసి లోకానికంతటికి ఆరాధ్యనీయం. ఆ కవితా పంక్తుల్లోనే "వర్షధార వోలె వచ్చు చీకట్లలో మట్టి దివ్వె నిలుచు మాట కల్ల" అంటారు కవి. చీకట్లను కబరీ బరమ్ముల లాగా, నల్ల కల్వల లాగా, నీల మేఘమ్ముల లాగా, జవరాలి కనుపాప లాగా పోల్చుతూ తామసికి ఉపమానాలను పుష్కలంగా పోషించారు.

"చేతనా జ్యోతి" కవిత ఒక సముజ్జ్వల కాంతి రేఖ. స్త్రీ భావనను పలికిస్తూ జ్వాలా కిరణాల మోహరింపు సర్వ జన స్వశక్తికి తార్కాణంగా నిలవాలని కవి ఆశించారు. అన్యాయాన్ని ఎదురించే శక్తిని ఒడిగట్టాలని కోరుకున్నారు. ధనికుల కుతంత్రాలను పసిగట్టే నేర్పును అందించాలని వేడుకున్నారు. కవి తన అనేక కవితల్లో బానిస బ్రతుకులలో స్వేచ్ఛా కుసుమం, స్వాతంత్ర్య దీప్తి వెలుగొందాలని నిర్దేశించడం ప్రధానంగా చూస్తాం.

"కొప్పువలె ధూమ రేఖను కూర్చి చుట్టి
పూవుగా ఒక జ్వాలను పొదిగి పెట్టి
పైటగా ఒక కీలను వైచినట్టి
దీపికా గోపికా పురంధ్రికి నమస్సు"

(అమృతాభిషేకం పుట: 40)

అంటూ నడిచిన కవిత కాంతి పుంజాన్ని అంతటా ప్రసరింపజేస్తుంది.

దాశరథి కలంలో వెలుగొంది ఆకాశాన్నంటిన "ధ్వజమెత్తిన ప్రజ" ఖండకావ్యం నాడు ఒక ప్రభంజనాన్ని సృష్టించింది. పావన శ్రావణ, వసంత చక్రం, చుక్కలు, అగ్ని ఘంట, స్వాప్నికుడు, వజ్ర పద్మం, కాంతి పదం, పురోగమనం, వసంతోదయం, ధూమ పతాకం, కాలదర్పం, దీక్ష, ప్రగతి పథాన జగతి, క్రాంతి గీతం, ఆశాజీవి వంటి కవితా ఖండికలు ఈ సంపుటిలో అభ్యుదయతను, ప్రగతి బావుటాలను పొడసూపుతాయి.

ఈ సంపుటిలో "అగ్నిఘంట" కవిత ప్రధానంగా నిలుస్తుంది. అందులో కొన్ని పాదాలు:

*"అంధకారపు ఆలయంలో అదిగో!*
*మ్రోగెను అగ్నిఘంట;*
*కంటకమ్ముల శయ్యపైన కన్ను తెరిచె*
*గులాబి జంట"*

(ధ్వజమెత్తిన ప్రజా పుట: 12)

ప్రత్యేకంగా గులాబి జంటను ప్రస్తావించడం దేనికి దృష్టాంతంగా కవి గ్రహించాడో తెలియదు కాని, భవిష్యత్త రాలలో సమష్టి చైతన్యానికి సంకేతంగా నిలుస్తుందని కవి భావించి ఉంటాడు. పుష్పరాజములలో ఔన్నత్యం అధికం

> **తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా "భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నిర్మూలన కోసం" సాయుధ పోరాటం నడిచింది. అందుకు కోపించిన నిజాం నియంతగా వ్యవహరించి తెలంగాణ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి ఖాసీమ్ రజ్వీ నాయకత్వంలో రజాకార్ సైన్యాన్ని ఏర్పాటు చేశారు. సాయుధులై అడవి బాట పట్టి పోరాటం చేసినవారు ఒక వర్గమైతే వేషం, భాష మార్చుకుంటూ గ్రామాల్లోనే అజ్ఞాతంగా ఉండి పోరాటం చేసిన వర్గం మరొకటి.**

కదా! ప్రకృతి వస్తువుల నుంచి ప్రగతి రథ చక్రాలను నడిపిన కవి మన దాశరథి. అగ్నిఘంట శక్తియుక్తులను పేర్కొంటూ ఘంటారావంతోనే లోకం అదిరిపోయి మేల్కొందని, నిదురపోయే జీవితాలకు సుందర సుప్రభాతం ఇదే అని అంటారు కవి. ఇది పురోగమన ప్రపంచం, ఇక తిరోగమనం సహించమని కవి ధైర్యంగా ప్రకటించారు. మూగబోయిన గళాలకు పొంగివచ్చే రాగమిదే అని తేల్చి చెప్పారు.

*"జాతి అంతా శ్రమిస్తేనే సాహసంతో చరిస్తేనే*
*దరిద్రాన్ని రూపుమాపి చరిత్రను సృష్టించగలము"*

(ధ్వజమెత్తిన ప్రజా పుట: 13)

సమ సమాజ సౌధ నిర్మాణానికి "కాలదర్పం" కవిత చక్కని నిర్దేశాన్ని సూచిస్తుంది. అర్థబలంతో ధనస్వామ్యతను ప్రదర్శిస్తూ శ్రమ జీవుల శక్తిని హరించే వారిని ఐకమత్యమనే కుఠారంతో నరుకుతామని కవి శపథం చేశారు. బ్రతుకు విలువలు నశించి పాడుపడిన ఈ స్వార్థపు ప్రపంచంలో విప్లవాగ్నిని రగులుగొల్పింది దాశరథి కవిత్వం. తానొక ప్రళయ నినాదమై లోకానికి కవి పంపిన సందేశం ఈ కవిత...

"కాలసర్పాన్ని కాటేసి కాజేసిన
కాలదర్పాన్ని నేను
తిరోగమిస్తున్న లోకాన్ని నిలబెట్టి
పురోగమనం నేర్పుతున్న ప్రగతిని నేను"

(ధ్వజమెత్తిన ప్రజా పుట: 39)

తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా "భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నిర్మూలన కోసం" సాయుధ పోరాటం నడిచింది. అందుకు కోపించిన నిజాం నియంతగా వ్యవహరించి తెలంగాణ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి ఖాసీమ్ రజ్వీ నాయకత్వంలో రజాకార్ సైన్యాన్ని ఏర్పాటు చేశారు. సాయుధులై అడవి బాట పట్టి పోరాటం చేసినవారు ఒక వర్గమైతే వేషం, భాష మార్చుకుంటూ గ్రామాల్లోనే అజ్ఞాతంగా ఉండి పోరాటం చేసిన వర్గం మరొకటి. అటువంటి సందర్భంలోనే ఆనాటి ప్రజల కష్టాలకు, కన్నీరుకు చలించి కాలరుద్రుడై కలంతో అగ్నిధారని వర్షించారు కవి దాశరథి. వ్రణాలకు, రణాలకు, మరణాలకు, మానవ ప్రాణ హరణాలకు హద్దూ పద్దూ ఉండని కరకు రాజ్యంలో చిర భేదం విరమించిన బ్రతుకమా! కడుపు నిండా గంజి నీళ్ళు గతుకమా! అంటూ ప్రగాఢ విశ్వాసం ప్రకటించారు. నిజానికి ఆ ఊపిరి శ్వాసే తదనంతర కాలంలో తెలంగాణకు ఎలాంటి విపత్కర పరిస్థితులు దాపురించినా ఎదురించి నిలిచే శక్తిని ప్రసాదించాయనే చెప్పాలి. వట్టికోట ఆళ్వారుస్వామితో కలిసి దాశరథి క్రూరమైన జైలు జీవితాన్ని అనుభవించిన రోజులు అత్యంత విషాదం. అయినా పట్టుసడలని ధ్యేయం, కృత నిశ్చయం, బంధ విముక్తి దాశరథి కవిత్వానికి ఆయువు పట్టుగా నిలిచాయి. నిలువ నీడ లేని నిస్వార్థ మానవుని అభ్యుదయ పార్శ్యమే దాశరథి కవిత్వానికి ప్రేరణ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.



వ్యాసం

# నేటి తరానికి స్ఫూర్తి పాఠం - దాశరథి 'యాత్రాస్మృతి'

**యాత్రాస్మృతిలో జీవన శృతి...**



సాగర్ల సత్తయ్య
79891 17415

సామాజిక, సాహిత్య, కళా, వైజ్ఞానికాది రంగాలలో లబ్ద ప్రతిష్టులైన వ్యక్తులు తమ జీవిత అనుభవాలను గురించి రాసుకునే రచనలు ఆత్మకథలు లేదా స్వీయ చరిత్రలు. ఇవి ఆయా వ్యక్తులకు సంబంధించినవే అయినా వారు జీవించిన కాలం నాటి సమాజాన్ని, సాంస్కృతిక జీవనాన్ని, నాటి సమకాలీన పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వారు జీవించిన కాలాన్ని చరిత్రలో రికార్డు చేయడానికి ఎంతో ఉపయుక్తమవుతాయి. అటువంటి మహత్తర గ్రంథమే దాశరథి కృష్ణమాచార్య స్వీయ చరిత్ర 'యాత్రాస్మృతి'.

**దాశరథి అభిప్రాయ ప్రకటనలోనూ జీవితాచరణ లోనూ నిర్భీతిని ప్రదర్శించారు. తన చిన్ననాటి అనుభవాలను గురించి చెబుతూ నా బాల్యంలో ఇంటా బయట తెలుగు మీద దండయాత్రలు జరిగాయి అని కుండబద్దలు కొట్టారు. ఇంట్లో నాన్నగారి సంస్కృత భాషాధిక్యము, మదరసా బడిలో రోజు చేయవలసిన ఉర్దూ ప్రార్థన ఈ రెండింటిని కూడా ఛాందసత్వంగానే ఆయన ప్రకటించారు.**

సాధారణంగా ఆత్మ కథలు తమ కుటుంబ నేపథ్యం, జననం విద్యాభ్యాసం మొదలు జీవిత చరమాంకంలోని అనుభవాల వరకు ఒక క్రమ పద్ధతిలో రాయబడిన రచనలుగా కనిపిస్తాయి. కానీ దాశరథి అట్లా కాకుండా తమ జీవిత అనుభవాలను, ప్రధానంగా ఆనాటి కవులతో కలిసి చేసిన జీవిత ప్రయాణాన్ని వివిధ వ్యాసాలుగా ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికకు రాసిన రచన ఈ యాత్రా స్మృతి అని తెలుస్తున్నది. ఈ గ్రంథంలో మొత్తం 60 వ్యాసాలున్నాయి.

వాడ్రేవు చిన్న వీరభద్రుడు అభిప్రాయపడ్డట్లు దాశరథిలో సమర శంఖారావంతో పాటు కవి ప్రణయ వివశత్వము సున్నితమైన హాస్యము గమనించవచ్చు. ఉదాహరణకు తన వయస్సు యాభై ఐదు అని చెప్పుకునే క్రమంలో 'యాభై ఐదులో రెండు ఐదులు ఉన్నాయి కదా! ఐదుతో ఐదు ప్లస్ చేస్తే పది (బాల్యం) ఐదుతో ఐదు ఇంటూ చేస్తే పాతిక (యవ్వనం). ఐదు పక్కన ఐదు రాస్తే యాభై ఐదు (వార్ధక్య ద్వారం) అంటూ చమత్కరిస్తారు. ఇదే సమయంలో ఐదులో ఉన్న తాత్వికత ఎరుక పరుస్తారు. మన్ను, మిన్ను, నీరు, గాలి, వెలుతురు - ఈ పంచభూతాల సమ్మేళనమే జననం. పంచభూతాలు చిన్నాభిన్నం కావడం మరణం అంటూ తాత్విక ధోరణిలో తెలియజేశారు.

దాశరథి అభిప్రాయ ప్రకటనలోనూ జీవితాచరణలోనూ నిర్భీతిని ప్రదర్శించారు. తన చిన్ననాటి అనుభవాలను గురించి చెబుతూ నా బాల్యంలో ఇంటా బయట తెలుగు మీద దండయాత్రలు జరిగాయి అని కుండబద్దలు కొట్టారు. ఇంట్లో నాన్నగారి సంస్కృత భాషాధిక్యము, మదరసా బడిలో రోజు చేయవలసిన ఉర్దూ ప్రార్థన ఈ రెండింటిని కూడా ఛాందసత్వంగానే ఆయన ప్రకటించారు. దాశరథి విద్యార్థిగా ఉన్నకాలంలో హైదరాబాద్ వెళ్లారంటే సురవరం ప్రతాపరెడ్డి గారిని, మాడపాటి హనుమంతరావు గారిని అజ్జద్ హైదరాబాది గారిని కలిసి ఆశీర్వాదం పొందడం ఆనాటి విద్యార్థుల ఆచారంగా ఉండేది అని ఆనాటి ఉత్తమ విలువలను నేటితరం అందిపుచ్చుకోవలసిన అవసరాన్ని తెలియజేశారు.

1944లో ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రథమ మహాసభలు ఓరుగల్లులో జరిగినప్పుడు రజాకార్లు ఆ సభల పందిర్లను తగలబెట్టడం. ఆ మంటల్లోనే కవి సమ్మేళనం జరపడం. రజాకార్లు విసురుతున్న రాళ్లను పువ్వులుగా భావించాలని ప్రతాపరెడ్డి గారు పిలుపునివ్వడం వంటి అనుభవాలను

చదువుతున్నప్పుడు పాఠకుల రోమాలు నిక్కబొడుస్తాయి. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలను సిద్ధం చేయడంలో భాగంగా గూడూరు వెళ్లిన దాశరథిని అరెస్టు చేసే క్రమంలో జరిగిన నాటకీయ పరిణామాలు పాఠకులలో ఆసక్తిని కలిగిస్తాయి. ఏడవ నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ విచిత్ర ప్రవర్తన, గోలకొండ కవుల సంచిక ఆవిర్భావ నేపథ్యం, తెలంగాణమును జాగృత పరచడంలో గోలకొండ పత్రిక నిర్వర్తించిన పాత్ర తనదైన శైలిలో వివరించారు.

ఆనాటి కాలంలో జరిగే ముషాయిరాల (ఉర్దూ కవి సమ్మేళనాలు) గురించి చదివితే ఆశ్చర్యం కలగక మానదు. ఆ రోజుల్లోనే ముషాయిరాలు వినడానికి వచ్చే శ్రోతలు ఐదు రూపాయల నుండి నూరు రూపాయల వరకు టికెట్ కొనుక్కొని వచ్చేవారట. నేటి కవి సమ్మేళనాలు ఆ స్థితికి ఎప్పుడు చేరుతాయో కదా! ఒక ముషాయిరా అనుభవాన్ని దాశరథి చెపుతూ తనను ముషాయిరా కు తీసుకువెళ్లిన రిక్షావాడు కూడా కవే. అతను వినిపించిన ముషాయిరా శ్రోతలను ఎంతో ఆకట్టుకుంది అంటూ అభినందించారు. ముఖేముఖే సరస్వతి రిక్షావాడు కవి కాకూడదా అంటూ దాశరథి అభినందించడం వారి సమున్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. గాలిబ్ గీతాలు




ఆవిష్కరణ సభ అనుభవాలను, చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి మదరాసు రాష్ట్ర ప్రథమ ఆస్థాన కవిగా పదవి స్వీకార సభ అనుభవాలను చక్కగా వివరించారు.

ఏడవ ఆంధ్ర సారస్వత పరిషత్ మహాసభలకు సుమారు పాతికవేల మంది కవులు హాజరైనారట. హైదరాబాద్ నుండి అలంపూర్ కు వెయ్యిమంది సాహితీ వేత్తలతో ప్రత్యేక రైలు వేశారు అంటే ఆనాటి సాహిత్య సభలు ఎంత వైభవోపేతంగా జరిగేవో దాశరథి మాటల ద్వారా తెలుస్తున్నది. ఆ సభల్లో కాళోజీ నా గొడవ గ్రంథావిష్కరణ విశేషాలను, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆనాటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపన్యాసాన్ని కళ్లకు కట్టినట్లు వివరించారు.

తుంగభద్ర నదికి ఆ పేరు ఎలా వచ్చిందో ఆసక్తికరమైన కథను వినిపించారు. తెలుగు ప్రయాణంలో రైలులో కలిసిన అందమైన అమ్మాయిని చూస్తూ తాను తుంగభద్ర నాటకం రాస్తే కథానాయకుడు తుంగడు తానైనట్లు, ఎదురుగా కూర్చున్న అమ్మాయి భద్ర పాత్రధారి అయినట్లు ఊహా లోకంలో తేలిపోతాడు. ఇది దాశరథి ప్రణయ మధురిమకు నిదర్శనం.

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు భోజన ప్రియులు. ఒకసారి వరంగల్ వచ్చినప్పుడు అజం జాహి మిల్లు వారి గెస్ట్ హౌస్ లో ఒక జల్లి గంప నిండా ఇడ్లీలు తెచ్చారట. సుమారు రెండు వందలున్న ఇడ్లీలలో సగం అంటే వంద ఇడ్లీలు ఆంధ్రకేసరి గారు భోంచేసారట. ఆ తరువాత ఒక మర చెంబెడు కాఫీ తాగారట. నమ్మశక్యంగా లేదు కదా! ఇలాంటి విచిత్రమైన అనుభవాలు కూడా ఈ గ్రంథంలో కనిపిస్తాయి. తెలంగాణలో అణా గ్రంథమాల గ్రంథ ప్రచురణ రంగంలో తెచ్చిన విప్లవాన్ని సోదాహరణంగా వివరించారు.

నాజీ జైలును మించిన నైజాం జైళ్ల దుస్థితిని పాఠకుల కళ్ళ ముందు ఉంచారు దాశరథి. ఉడికి ఉడకని జొన్న రొట్టెలు, చిప్పనిండా పప్పు చారు, రొట్టెల్లో

> **ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు భోజన ప్రియులు. ఒకసారి వరంగల్ వచ్చినప్పుడు అజం జాహి మిల్లు వారి గెస్ట్ హౌస్ లో ఒక జల్లి గంప నిండా ఇడ్లీలు తెచ్చారట. సుమారు రెండు వందలున్న ఇడ్లీలలో సగం అంటే వంద ఇడ్లీలు ఆంధ్రకేసరి గారు భోంచేసారట. ఆ తరువాత ఒక మర చెంబెడు కాఫీ తాగారట. నమ్మశక్యంగా లేదు కదా! ఇలాంటి విచిత్రమైన అనుభవాలు కూడా ఈ గ్రంథంలో కనిపిస్తాయి.**

సిమెంటు సున్నం కలిపి వండి పెట్టే వారట. వారానికి ఒకసారి పెట్టే వరి అన్నంలో సగం వడ్ల గింజలే. ఏడు వందల మంది రాజకీయ ఖైదీలకు ఒకటే నల్లా. ఇట్లా చెప్పుకుంటూ వెళ్తే ఆనాటి జైళ్ల నరకానికి ప్రతిరూపాలుగా కనిపిస్తాయి. డిచ్ పల్లి ప్రాంతానికి చెందిన రజాకార్లు నిజామాబాద్ జైల్లోకి అక్రమంగా ప్రవేశించి దాశరథిని అతని సహచరులను ఎముకలు విరిగేలా కొట్టిన వైనం, ఆనాటి సంఘటనలు వివరించిన తీరుఒళ్ళు జలదరింప చేస్తుంది. జైల్లో ఖైదీల సత్యాగ్రహం నాటి ఉద్యమ స్ఫూర్తిని చాటుతున్నది. నిజామాబాద్ జైలు నుంచి ఖైదీలు తప్పించుకున్న సంఘటన సినిమా కథను మరిపించేలా ఉంది గాంధీజీ హత్య. తదనంతర సంఘటనలు, తెలంగాణలో కాశీం రజ్వీ దురాగతాలు, నాటి చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. హైదరాబాద్ చంచల్ గూడ సెంట్రల్ జైల్లో రాజకీయ చర్చలు ఆనాటి నాయకుల స్వాతంత్ర్య కాంక్షలు చాటిచెప్పాయి. రంగనాయకులు అనే కార్యకర్త నల్లగొండ సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న దారుణాలను వివరించిన తీరు నాటి పాలకుల రాక్షసత్వానికి పరాకాష్ఠ. స్త్రీలపై జరిగిన దారుణాలకు సహించలేక తిరగబడ్డ

వ్యాసం

వైనం ప్రజల్లో రగులుతున్న అసంతృప్తికి నిదర్శనం ఈ సంఘటనలన్నీ 'తెలంగాణ అమరవీరునికి రక్తాంజలి' అనే కథలో దాశరథి చిత్రించారు.

ఉద్యమం పరాకాష్టకు చేరిన దశలో నిజాం నవాబు హైదరాబాదు రాజ్యాన్ని స్వతంత్ర భారతంలో విలీనం చేసే ఘట్టాలు, హైదరాబాద్ రాజ్యంపై భారత సైనిక దళాల దాడి మొదలైన సన్నివేశాలు నాటి చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఆపరేషన్ పోలో అనంతర సంస్కరణలు, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ రాకడ తదితర సంఘటనలు నాటి సామాజిక సంక్షుభిత స్థితిని ప్రతిఫలిస్తాయి. సైనిక పాలన ముగిసిన తరువాత దక్కన్ రేడియోలో నిజాం ప్రసంగం, దాశరథి ప్రసంగం, నిజాం నవాబు మీద బాంబు దాడి తదితర సంఘటనలు నాటి ఉద్యమ కారుల మనోస్థితిని తెలియజేస్తాయి. ఆనాటి రచయితలు సంస్థల వివరాలు దాశరథి ప్రత్యేక వ్యాసంగా చేర్చారు. తెలంగాణ రచయితల సంఘం ఆవిర్భావం, మంజీరా పత్రిక ప్రారంభం సంబంధించిన సమాచారం ఈ గ్రంథంలో ఉంది. ఆనాటి సమరకావ్యాలైన ఆరుద్ర త్వమేవాహం, వట్టి కోట ఆళ్వార్ స్వామి ప్రజల మనిషి, దాశరథి రంగాచార్యులు చిల్లర దేవుళ్ళు, దాశరథి కృష్ణమాచార్య మహాంధ్రోదయం మొదలైన గ్రంథాల ఔన్నత్యం ఈ వ్యాసాల్లో కనిపిస్తుంది. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, వానమామలై వరదాచార్యులు మొదలైన కవుల ఘనత ఈ వ్యాసాల్లో కనిపిస్తున్నది.

గ్రంథం చివరలో దాశరథి మరణించిన మరుసటి రోజు గాంధీ క్షేత్రం పత్రికలో వచ్చిన సంపాదకీయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవిగా నియమితులైన సందర్భంగా దాశరథి కృష్ణమాచార్యతో మండలి బుద్ధ ప్రసాద్ చేసిన ఇంటర్వ్యూ చేర్చడంతో ఈ గ్రంథానికి మరింత పరిపూర్ణత చేకూరింది.

'నేను గన్ను చేపట్టాలనుకుంటాను కానీ పెన్నుతో కలలుగంటుంటాను ' అని ప్రకటించుకున్న దాశరథి జీవితాంతం తిమిరంతో సమరమే చేశారు. ఆయన ఆలోచనాలోచనలు నేటి తరానికి స్ఫూర్తి పాఠాలు. దాశరథి జీవనయాత్ర ముగిసిపోలేదు. అది ఎప్పటికీ తెలంగాణ ప్రజల మనసుల్లో సజీవమై భావితరాల వైపు పయనిస్తూనే ఉంటుంది.

కవిత





# ప్రణతి

శతావధాని జి.యం. రామశర్మ, 99088 46177

నీ శేముషిలో కవితా
వైశేషము లన్ని వెలిగె, వాణీ వీణా
వేశిత నాదము నీవే
దాశరథీ! ఉద్యమ ప్రధాన నిపుణధీ!

తెలగాణోద్యమ కీలవై మెరసి ధీ తేజమ్ములుప్పొంగగా
కలమున్ బట్టి గళమ్ము విప్పి మహిమన్ కాల్దువ్వి నైజాముపై
నిలువుం దోపిడి జేయు వారికెద నాగ్నేయాస్త్రమై లేచితే
ఇల శ్రీ దాశరథీ! ప్రజాహిత పథీ! హేరాళ భాషారథీ!

కుటిల కుతంత్ర రాజ్యవని గూల్చగ గాల్చగ నగ్నిధారవై
జటిల నియంతృతన్ నిలుప చాటిన మీటిన రుద్రవీణవై
పటుత సహస్రరశ్మివయి పాండితిలోన, కళా ప్రపూర్ణవై
స్ఫుట సుకవిత్వ కౌముదిని బూనిన దాశరథీ! నతుల్సధీ!

తిమిరములో సమరమును
ద్యమపథివై చేసి, విప్లవాక్షర కోదం
డము దాల్చిన ఘనకవి ధీ
రమణీ! రమణీయ కావ్య రాజిత సుగుణీ!

నా తెలంగాణ కోటి రత్నాల వీణ
అను నినాదము మిన్నంట వినిచినావు
పాట పద్యాన నీ బాట పోటి యెవరు?
జాతిహిత కావ్య శరథి! దాశరథి! ప్రణతి.

**1964లో** "క్రీస్తు చరిత్ర" కు "కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు" పొంది ఆధునిక తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువా. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డ ఆధునిక తెలుగు కవులలో అగ్రగణ్యుడు గుర్రం జాషువా. గుర్రం జాషువా 1895, సెప్టెంబర్ 28 న వీరయ్య, లింగమ్మ దంపతులకు ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లా, వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారు. జీవనం కోసం ఎన్నో రకాల ఉద్యోగాలు చేసిన జాషువాకు 1964లో ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలిలో సభ్యత్వం లభించింది. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాసారు. జాషువా తన



# ధిక్కార స్వరం.... గుర్రం జాషువా

జీవితకాలంలో ఎన్నో బిరుదులు, పురస్కారాలు అందుకున్నారు. కవితా విశారద, కవికోకిల, కవి దిగ్గజ నవయుగ కవిచక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్ గా ప్రసిద్ధుడయ్యారు. తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి జాషువా కాలికి గండపెండేరం తొడిగి ఈ కవీశ్వరుని పాదంతాకి నా జన్మ ధన్యం చేసుకున్నాను అన్నారు. అది తనకు లభించిన అత్యున్నత పురస్కారంగా జాషువా భావించారు. గుర్రం జాషువా 1919లో రుక్మిణీ కళ్యాణం, 1922 లో చిదానంద ప్రభాతం, కుశలవోపాఖ్యానం, 1924 లో కోకిల, 1925 లో ధ్రువ విజయం, కృష్ణనాడి, సంసార సాగరం, 1926లో శివాజీ ప్రబంధం, వీరాబాయి, కృష్ణదేవరాయలు, వేమన యోగీంద్రుడు, భారతమాత, 1927లో భారత వీరుడు, సూర్యోదయం, చంద్రోదయం, గిజిగాడు, 1928లో రణచ్యుతి, ఆంధ్రుడను, తుమ్మెద పెళ్ళికొడుకు, 1929లో సఖి, బుద్ధుడు, తెలుగు తల్లి, శిశువు, బాష్ప సందేశం, 1930లో దీర్ఘ నిశ్వాసము, ప్రబోధము, శిల్పి, హెచ్చరిక, సాలీడు, మాతృప్రేమ, 1931లో భీష్ముడు, యుగంధర మంత్రి, సమదృష్టి, నేల బాలుడు, నెమలి నెలత, లోక బాంధవుడు, అనసూయ, శల్య సారథ్యము, సందేహ డోల, 1932లో స్వప్న కథ, అనాథ, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, సింధూరము, బుద్ధ మహిమ, క్రీస్తు, గుంటూరు సీమ, వివేకానంద, చీట్లపేక, జేబున్నీసా, పశ్చాత్తాపం, 1933లో అయోమయము, అఖండ గౌతమి, ఆశ్వాసము, మేఘుడు, శ్మశానవాటిక, 1934లో ఆంధ్ర భోజుడు, 1941లో గబ్బిలము, 1945లో కాందిశీకుడు, 1946లో తెరచాటు, 1948లో చిన్న నాయకుడు, బాపూజీ, నేతాజీ, 1950 లో స్వయంవరం, 1957 లో కొత్తలోకం, 1958లో క్రీస్తు చరిత్ర, 1963లో రాష్ట్ర పూజ, ముసాఫిరులు, 1966లో నాగార్జునసాగరం, నా కథ మొదలైన రచనలు చేశారు. ఆయన 1915 నుంచి 1916వ సంవత్సరం వరకు సినిమా వాచకుడిగా పనిచేసారు.తరవాత 10 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసారు. 1928 నుంచి 1942 వరకు గుంటూరులో ఉండే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేసారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పనిచేసారు. 1957 నుంచి 1959 వరకు రేడియో కేంద్రంలో ప్రొడ్యూసర్ గా పనిచేసారు. 1964లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం. 1970లో కళాప్రపూర్ణ బిరుదు లభించింది. 1970లో పద్మభూషణ్ పురస్కారం లభించింది. ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందిన గుర్రం జాషువా 1971 జూలై 24న పరమపదించాడు. ఎండ్లూరి సుధాకర్ "జాషువా సాహిత్యం దృక్పథం-పరిణామం" అనే గ్రంథాన్ని రాశారు. జాషువా కుమార్తె హేమలత లవణం నెలకొల్పిన జాషువా ఫౌండేషన్ ద్వారా భారతీయ భాషలలో మానవ విలువలతో కూడిన రచనలు చేసిన సాహిత్యకారులకు జాషువా సాహిత్య పురస్కారం అందజేయబడుతున్నది.

# తెలంగాణ సాహిత్య ప్రాభవాన్ని చాటిన జాగృతి సాహిత్య సభలు

- డాక్టర్ ఎన్. గోపికి ప్రొ॥ కొత్తపల్లి జయశంకర్ విశిష్ట సాహిత్య పురస్కారం ప్రదానం
- ప్రాజెక్టు కేసీఆర్ ద్వారా సాహిత్య సేవ
- "తెలంగాణ సాహిత్య అవలోకనం" గ్రంథ ఆవిష్కరణ
- అతిరథ మహారథులైన సాహిత్యవేత్తల రాకతో సందడిగా రెండురోజుల సభలు

తెలుగు సాహిత్యంలో తెలంగాణ ప్రాభవాన్ని చాటి చెప్పాలన్న సంకల్పంతో, తెలంగాణ సాహిత్యంపై విస్తృత చర్చ జరగాలన్న ఉద్దేశంతో తెలంగాణ సాహితీ సభలను నిర్వహిస్తున్నామని భారత్ జాగృతి అధ్యక్షులు శాసనమండలి సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు. జూన్ 21వ తేదీన తెలంగాణ సాహిత్య సభలకు అధ్యక్షత వహిస్తూ ఆమె హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్ లో ఆచార్య రవ్వా శ్రీహరి ప్రాంగణం, ఆచార్య బాల శ్రీనివాస మూర్తి వేదికన జ్యోతి ప్రకాశన చేసి వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ " తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడం ఎంత ముఖ్యమో మన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలని జాగృతి ఉద్యమం చేసింది. ప్రతి సంవత్సరం సాహిత్య సభలు జరపాలని ఈ కార్యక్రమం రూపొందించాం. రెండు రోజుల పాటు ఈ సాహిత్య సభలలో అన్ని అంశాల మీద కూలంకషంగా చర్చలు జరుగుతాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగు మహాసభలు ఘనంగా నిర్వహించుకున్నాం. అందరిని భాగస్వామ్యం చేస్తూ ఈ సాహిత్య సభలు విజయవంతం చేసుకుందాం' అన్నారు. ఎవరి భాష వారికుంటది ఇదే మాట్లాడాలి అని అంటే తీవ్రంగా వ్యతిరేకిస్తాం రూల్స్ బ్రేక్ చేస్తాం. తెలంగాణలోని సాహితీ పుత్రులను నిరంతరం స్మరించుకుందాం. తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసే విధంగా పనిచేద్దాం. తెలంగాణ జాగృతి దేశంలో ఉన్న ప్రజలను జాగృతం చేసేందుకు భారత జాగృతిగా రూపుదిద్దుకుంది. మన తెలంగాణలో 530 కు పైగా కళాకారులకు జీతం ఇస్తూ వారిని గౌరవిస్తున్నాం. కళాకారులను గుర్తించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.

ఈ ప్రారంభ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు నందిని సిధారెడ్డి, శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న, ప్రఖ్యాత పరిశోధకురాలు తిరునగరి దేవకీదేవి, ప్రసిద్ధ రచయిత్రి గోగు శ్యామల, నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ళ కృష్ణమూర్తి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, ప్రముఖ కవి ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్‌లు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

డాక్టర్ నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ సంస్కృతి అనగానే గుర్తుకొచ్చే ఒకే ఒక పేరు కల్వకుంట్ల కవిత. నాకు చాలా ఉద్వేగంగా ఉంది. తెలంగాణ జాగృతి తెలంగాణ సాహిత్య సభలను జరిపించడం. తాను సాహిత్యంతో ఉన్నాను, కవిత్వంతో ఉన్నాను, సంస్కృతితో ఉన్నాను, తెలంగాణ తోనే ఉన్నాను అని ఈ సభలను నిర్వహించడం ద్వారా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చాటిచెప్పారు. తెలంగాణ జాగృతి భారత జాగృతిగా మారిందంటే ఉద్యమకారులు ఒక దగ్గర ఆగిపోరు అని అనడానికి ఇది ఒక నిదర్శనం. బతుకమ్మ కూడా ఒక పండుగేనా అని ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి అవహేళన చేస్తే కవిత బతుకమ్మను తల మీద ఎత్తుకొని ఆనాడు బతుకమ్మకు ఒక స్థాయిని తీసుకురావడానికి చేసిన కృషిని ఈనాడు



గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇవాళ హీరోలకు హీరోయిన్లకు తెలంగాణ భాష పెడితే తప్ప సినిమా ఆడని పరిస్థితి. ఇవాళ మొత్తం తెలుగు భాష మీదనే ఇంగ్లీష్ చేసే పెత్తనం ఉండగా హిందీ భాష పెత్తనం చేయడానికి ముందుకు వస్తున్నది చాలా జాగ్రత్తగా ఉండాలి. చాలా మెలకువగా ఉండాలి. తెలంగాణ వర్ధిల్లాలి. తెలుగు సంస్కృతి వర్ధిల్లాలి. తెలంగాణ సాహిత్యం వర్ధిల్లాలి. మొత్తం భారతదేశంలోని మాతృభాషలు, భారతదేశంలోని భిన్న సంస్కృతులు వర్ధిల్లాలి. భారత జాగృతిగా కవిత ముందుకు రావాలి. మాతృభాష మాట్లాడేవారుగా మేమంతా కలిసి వస్తాం, వైవిధ్యతను రక్షించుకుందాం" అని పిలుపు నిచ్చారు.

డాక్టర్ తిరునగరి దేవకీదేవి మాట్లాడుతూ "ఎట్లైతే సురవరం ప్రతాపరెడ్డి గారు మన సాహిత్యాన్ని వెలికి తీసింద్రో ఇప్పుడు జాగృతి కవిత కూడా వేదిక ద్వారా తెలంగాణ సాహిత్యాన్ని ఒక్క దగ్గరికి తీసుకురావడం అనేటువంటిది నాకు చాలా చాలా సంతోషంగా ఉంది. ఈ సదస్సులో ఇన్ని పేపర్లు రావడం అనేది చాలా గొప్పగా ఉంది. వాటిల్లో మొత్తం సాహిత్య చరిత్ర ఉంది. సాహిత్య చరిత్రే కాదు, భాష గురించి ఉంది, వాఙ్మయం గురించి ఉంది. ఇప్పుడు తెలంగాణలో నిజంగా చెప్పాలంటే తెలంగాణ వచ్చిన తర్వాత ఇక్కడ వచ్చినంత సాహిత్యం వేరే ప్రాంతంలో రాలేదు. ఇప్పుడు తెలంగాణలోనే సాహిత్యం బాగా వికసిస్తున్నది. భారత జాగృతి సంస్థ ఒక సంస్కృతి ప్రధానంగా సాహిత్యం ప్రధానంగా జరుపుతున్నటు వంటి సమావేశమిది. ఈ మధ్యకాలంలో చూస్తున్న అంతకు ముందు తెలంగాణ అంటే ముక్కిరిసిన వాళ్ళందరూ ఇప్పుడు అసలు మేమే తెలంగాణ వాళ్ళము అని చెప్పి ముందుకు వస్తున్నారు. కానీ మన మూలాలను మనం తప్పకుండా గౌరవించుకోవాల్సిన అవసరం ఉన్నది. ఇక్కడి వాళ్లను మొదట గౌరవించిన తర్వాతనే ప్రాంతేతరులను గౌరవించాలి. జాగృతి కవిత ఈ వేదిక ద్వారా నాకు గౌరవం ఇచ్చారు. నాకు చాలా చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి మాట్లాడుతూ "అప్పుడు తెలంగాణ కవులు పూజ్యం ఇప్పుడు తెలంగాణ కవుల రాజ్యం..ఇదంతా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తోనే సాధ్యమైంది. ముఖ్య మంత్రులు కవితలు రాస్తారా అంటే అప్పటి మన సీఎం బూర్గుల రామకృష్ణా రావు కవి. మరో తెలంగాణ ముఖ్యమంత్రి పివి నరసింహారావు కవి, అనువాదకుడు. ఇప్పుడు కేసీఆర్ గేయ రచయిత ఇదంతా తెలంగాణ సొంతం. విశ్వనాథ సత్యనారాయణను గద్వాల సంస్థానానికి పరిచయం చేసింది మన సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ జాగృతి తంగేడు పత్రికను గొప్పగా నడిపిస్తున్నది. కవులు కళాకారులను ప్రభుత్వంలాగే ప్రోత్సహిస్తున్నది. సాహిత్య సభలు ప్రతి సంవత్సరం నిర్వహించడం అభినంద నీయం. తెలంగాణలో సాహిత్యం కవులు వర్ధిల్లుతున్నారు. సాహిత్యంతో పాటు భాషను కూడా పరిరక్షించాలని భారత జాగృతి ని కోరుతున్నా" అని ఆకాంక్షించారు.

డాక్టర్ గోగు శ్యామల మాట్లాడుతూ భారత జాగృతి నిర్వహిస్తున్న ఈ తెలంగాణ సాహిత్య సభలు కేవలం సంబరం అని నేను అనుకోవడం లేదు. సాహిత్య విషయంలో చాలా లోతుల్లోకి వెళ్లి పోయినామని అనిపిస్తుంది. ఇదంతా తెలంగాణ తెలుగు గొప్పదనం. ఈ భాషలో నేను రాసిన కవిత కథ నా ఈ భావనకు ఊపిరి పోసింది. ఉపదేశాలు చాలామంది ఇస్తారు కానీ పని చేసేవారు తక్కువగా ఉంటారు సాహిత్యం ప్రాధాన్యతగా నిర్వహిస్తున్న ఈ సభ కల్వకుంట్ల కవిత సంకల్పానికి నిదర్శనం. మౌఖికంగా ఉన్న తెలంగాణ భాష తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రంథాల గుట్టలు, గ్రంథాల పర్వతాలుగా రూపం దాలుస్తున్నాయి. ఇది తెలంగాణ సాధించిన విజయం. చరిత్ర తెలియని వారు చరిత్రను సృష్టించలేరు. ఈ గడ్డమీద పుట్టిన ఆది హిందూ ఉద్యమ నాయకులు భాగ్యరెడ్డి వర్మ, అరిగే రామస్వామి సమానత్వ ఉద్యమాలను, కుల వ్యతిరేక భావజాలాన్ని దేశానికి అందించారు. ఆంధ్ర, పశ్చిమ బెంగాల్ పంజాబ్ లో జరిగిన అనేక సభలకు

అతిథులుగా వెళ్లారు. చరిత్ర తొవ్వడంలో ఇంకా పని మిగిలి ఉన్నది. మనది స్ట్రేంజ్ తెలుగు కాదు. యూనిక్ తెలుగు. ఎందుకంటే నా తెలంగాణ తెలుగు శ్రమ నుండి, ఉత్పత్తుల నుండి, పర్యావరణం నుండి, ప్రకృతి నుండి, ఇక్కడున్న శ్రమవిలువల నుండి, కుటుంబ సంబంధాల నుండి కుటుంబ వ్యవస్థ నుండి పుట్టింది. పార్లమెంటు సభ్యులుగా కవిత ఉన్నప్పుడు ఆమె పార్లమెంటు సభ్యురాలిగా కాకుండా తెలంగాణ ప్రతినిధిగా, ఒక తెలంగాణగా వ్యవహరించారు. అది ఎంతో స్ఫూర్తిదాయకం'' అని అన్నారు.

తిగుళ్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ “తిరుమలకు అన్నమయ్య ఉన్నట్టు యాదగిరి నరసింహునికి సంకీర్తన ఆచార్యులు ఉంటే బాగుండు అని చర్చ చేస్తున్నప్పుడు మామిడి హరికృష్ణ 400కు పైగా కీర్తనలు రాసిన ఈగ బుచ్చిదాసు ఉన్నాడు అని చెప్పారు. ఈ విషయాన్ని కవితకు చెప్పగానే విని వెంటనే ఆ పుస్తకాన్ని తెప్పించుకుని ఆ కీర్తనలకు స్వర రూపంలోకి తెచ్చారు. ఇది వారి నిబద్ధతకు నిదర్శనం. ఇప్పుడు బతుకమ్మ ఊరూరానే కాదు విమానం ఎక్కి ఆడుతున్నది. ఈ ఖ్యాతి తప్పకుండా జాగృతి సంస్థది. కవితది. వారి తండ్రి కేసీఆర్ వారికి కవిత అని ఎందుకు పేరు పెట్టారో కానీ ఆమె సార్థక నామదేయ. తెలంగాణ తల్లి మెడలో వేసిన సాహితీ సుమమాల కల్వకుంట్ల కవిత. ముఖ్యమంత్రి కేసీఆర్ సాహిత్య హృదయం కలిగిన వారు. సోమవారం నాడు చెలిమె పేజీ చాలా తక్కువ మంది చదువుతారని, అదే ఆదివారం అయితే ఎక్కువ మంది చదువుతారు అని ఆ శీర్షికను ఆదివారం కు మార్పించారు. ఆ సమయంలో చెలిమె అంటే ఊట అని అది నిరంతరాయంగా వస్తుందని తెలంగాణ కవిత ఊటకన్నా పెద్దది అది ప్రవాహ సాదృశ్యంగా వస్తుందని ఆయన అన్నారు. చదువు వచ్చిన వాళ్ళు తమ అభిప్రాయాలను పత్రికకు కవితగానో కథగానో పంపుతారని, చదువురాని వాళ్ల అభిప్రాయాలను కూడా పత్రికలో ప్రచురించాలని అందుకోసం మీరే వారితో మాట్లాడి వారి అభిప్రాయాలను వారి భాషలోనే ప్రచురించాలని, సామాన్యుడి మాటలలో గొప్ప కవిత్వం ఉంటుందని కేసీఆర్ సూచించారని ఇలా ఎన్నో సాహిత్య సంబంధ అంశాలు కేసీఆర్ గారి ఔన్నత్యానికి నిదర్శనం అని అన్నారు.

డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ లిఖిత సాహిత్యం మన మీద పెత్తనం చేసింది. ఆ పెత్తనంలో నుంచి బయటపడుతున్న సందర్భంలో మనం ఉన్నాం. అలిఖిత సాహిత్యం దగ్గరికి వెళ్తే మన భాష ఎంత సజీవంగా ఉందో తెలుస్తుంది. కవిత జాగృతి సంస్థను స్థాపించి ఆ పని చేశారు. ఈ సాహిత్య సభలకు వచ్చిన వారిని చూస్తే తెలంగాణ మీగడ కొలువుతీరినట్టు ఉంది. జాగృతి నిర్వహిస్తున్న ఈ సభలు వెయ్యి పరిమళాన్ని పంచుతున్నాయి. తెలంగాణ జాగృతి భారత జాగృతిగా మారడంలో మనకున్న వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటి చెప్పే అవకాశం ఉంది. ఇలా ఇతరులకు షేర్ చేసుకోవడం వలన మన సంస్కృతి యొక్క గొప్పతనం అందరికీ తెలుస్తుంది. భారత జాగృతి తను చేపట్టిన కార్యక్రమాలతో శివతాండవం చేస్తున్నది. మా జిల్లా బిడ్డగా కవిత తాను అనుకున్న రంగంలో అద్భుతంగా రాణిస్తున్నందుకు గర్వంగా ఉంది.

గోరటి వెంకన్న మాట్లాడుతూ “సమాజంలో పరిస్థితులను బట్టి భాష మారుతుంది. సాహితీవేత్తలు తమ రచనల ద్వారా భాషను కాపాడుతూ సంస్కృతిని ముందు తరాలకు అందిస్తారు. కవులు రసప్లావితమైన అనుభూతితో రచనలు చేయాలి. ఉద్యమ కాలంలో ఎంత ధిక్కారాన్ని వినిపించామో, స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సాధించిన అభివృద్ధి నిండుగా ఉన్న చెరువుల రూపంలో, పచ్చగా ఉన్న భూమి రూపంలో, కళ్ళ ముందు కనబడుతుంటే వాటిని రచనలుగా మార్చాల్సిన అవసరం ఉంది. కల్వకుంట్ల కవిత సాహిత్య పరంగాను నిబద్ధతతో కృషి చేస్తున్నారు. నాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చినప్పుడు ఆమె ప్రశ్నలు సంధిస్తుంటే భయమేసింది. సాహిత్య లోతులు బాగా తెలిసిన వ్యక్తి కవిత. కవి అఖండ చీకటిలో ఉన్నప్పుడే అఖండ దీపాన్ని కాంక్షించగలుగుతాడు. భాషపరంగా,



సంస్కృతి పరంగా జాగృతి చేస్తున్న కృషి అభినందనీయం. తక్కువగా చూడబడిన యక్షగానాల విషయంలో జాగృతి కవిత చేస్తున్న కృషి చాలా గొప్పది. గొప్ప పుస్తకమే రానున్నది. ఇటువంటి సంస్థలు కృషి చేస్తున్నన్నాళ్ళు తెలంగాణ భాషకు, కవిత్వానికి ఎటువంటి ఢోకాలేదు''. అని తెలిపారు.

భారత జాగృతి తొలిసారిగా ప్రవేశ పెట్టిన "ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని'' ప్రసిద్ధ కవి ఆచార్య ఎన్ గోపికి కల్వకుంట్ల కవితతో పాటు హాజరైన అతిథులందరూ అత్యంత గౌరవప్రదంగా ప్రదానం చేశారు. స్వర్ణ కంకణం, 1,01,016 నగదు పురస్కారం, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించి ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఎస్ రఘు రచించిన ప్రశంసా పత్రాన్ని ఘనపురం దేవేందర్ చదివి వినిపించారు. అనంతరం స్పందనను తెలియజేస్తూ ఆచార్య గోపి " లెజెండరీ ప్రొఫెసర్ జయశంకర్ పేరిట భారత జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత ఎంతో సంస్కారవంతంగా నాకు అవార్డు ఇస్తున్నట్టు ఫోన్ చేసి చెప్పినప్పుడు ఎంతో ఆనందంగా అనిపించింది. ఈ అవార్డును ఒక బిడ్డ తన తండ్రికి ఇచ్చే కానుకగా నేను భావిస్తున్నాను. దీనిని తెలంగాణ ప్రజల తరఫున లభిస్తున్న ప్రేమగా భావిస్తున్నాను. కవిత కార్య శైలిలో పువ్వు లాంటి సున్నితత్వాన్ని, వజ్రం లాంటి కాఠిన్యాన్ని నేను గమనించాను. సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం పాటు పడుతున్న సంస్థ భారత జాగృతి. కవిత తెలంగాణ ప్రతి ఇంటిలో ఆడపడుచు హోదా పొందింది. ప్రొఫెసర్ జయశంకర్ విద్యావేత్తనే కాదు, తెలంగాణను మనసుతో చూసిన దార్శనికుడు. నా 17వ ఏట "తంగేడు పూలు'' మీద ఓ కవితను రాశాను. నా మొట్టమొదటి కవితా సంపుటి పేరు తంగేడు పూలు. కవిత బాటలో నడుస్తున్న జాగృతి సంస్థ సైనికులందరికీ నా అభినందనలు.'' అని అన్నారు.




భోజన విరామం అనంతరం తెలంగాణ సాహిత్య అవలోకనం సదస్సు సెషన్లు ప్రారంభమైనాయి. మొదటి సెషన్ డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆయన "తెలంగాణ వచన కవిత్వ ఆవిర్భావ వికాసాలు'' అనే అంశంపై పత్ర సమర్పణ చేయగా, డాక్టర్ కాంచనపల్లి "తెలంగాణ పద్యకవితా వికాసం'', డాక్టర్ పసునూరి రవీందర్ "తెలంగాణ ఉద్యమ పాట ప్రధాన భావనలు'', డాక్టర్ తలారి డాకన్న "దరువులలో యక్షగాన ప్రదర్శన'', డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ "ఘనతకెక్కిన తెలంగాణ కథ'', డాక్టర్ కాలువ మల్లయ్య "తెలంగాణ వాఙ్మయ చరిత్ర'' అనే అంశాలపై పత్ర సమర్పణ చేశారు. రెండవ సెషన్ డాక్టర్ సంగనభట్ల నరసయ్య అధ్యక్షతన జరిగింది. ఆయన "తెలంగాణ ప్రాచీన నాటక రంగం'' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. డాక్టర్ మట్ట సంపత్ కుమార్ రెడ్డి " 1956 నుంచి 1970 వరకు తెలంగాణ కథ'' డాక్టర్ మారోజు దేవేంద్ర "1970 నుండి 2014 వరకు తెలంగాణ కథ ", డాక్టర్ ఎస్ రఘు "1956 నుంచి 1970 వరకు తెలంగాణ నవల'', డాక్టర్ కె పి అశోక్ కుమార్ "1970 నుండి 2014 వరకు తెలంగాణ నవల'', డాక్టర్ వెలదండ నిత్యానందరావు "తెలుగులో ఆకర గ్రంథాలు'' అనే అంశాలపై పత్ర సమర్పణ చేశారు. తర్వాత మూడవ సెషన్ డాక్టర్ కే లక్ష్మణ చక్రవర్తి అధ్యక్షతన జరిగింది. ఆయన "తెలంగాణలో అధి విమర్శ'' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. డాక్టర్ బెల్లంకొండ సంపత్ కుమార్ "తెలంగాణ నవల - విమర్శ'', డాక్టర్ పగడాల నాగేందర్ "తెలంగాణ ఉద్యమ సాహిత్య విమర్శ'', ఎం. నారాయణ శర్మ "తెలంగాణ భాషా చరిత్ర రచన కొన్ని ఆలోచనలు'', సిహెచ్ ఉషారాణి " 1934 నుండి 1956 వరకు తెలంగాణ నవలా పరిణామాలు'', అనే అంశాలపై పత్ర సమర్పణలు చేశారు. మొదటిరోజు సాహిత్య సభలు ఈ సెషన్తో ముగిసాయి.

రెండవ రోజు జూన్ 22న ఉదయం 9 గంటలకు నాలుగవ సెషన్ డాక్టర్ సూర్యా ధనంజయ్ అధ్యక్షతన ప్రారంభమైంది. ఆమె "తెలంగాణ భాష పై ద్రవిడ భాషల ప్రభావం'' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. డాక్టర్ కె లావణ్య " తెలంగాణ భాష ఉర్దూ పారసీ భాషల ప్రభావం'', శ్రీరామోజు హరగోపాల్ "తెలంగాణ శాసన భాష పరిణామము'', డా॥ జె విజయ్ కుమార్ "తెలంగాణ సాంఘిక నాటక వికాసం'' ఘనపురం దేవేందర్ "తెలంగాణ రేడియో రూపకాలు'' అనే అంశాలపై పత్ర సమర్పణలు చేశారు. ఐదవ సెషన్ అనిశెట్టి రజిత అధ్యక్షతన ప్రారంభమైంది. "తెలంగాణ కవయిత్రుల కవిత్వంలో స్త్రీ అస్తిత్వం'' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. డాక్టర్ బలాష్ట్ మల్లేశ్ "స్వరాష్ట్రంలో నాటకం'', డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ "1900 నుంచి 1932 వరకు తెలంగాణ నవలా సాహిత్యం'', అవుసుల

భాను ప్రకాష్ "తెలంగాణలో అవధాన వికాసం", డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ " తెలంగాణ లలిత గీత వికాసం - విస్తారం" అనే అంశాలపై పత్ర సమర్పణ చేశారు.

డాక్టర్ మామిడి హరికృష్ణ " తెలంగాణ సినిమా పాట", పెద్దింటి అశోక్ కుమార్ "ఉద్యమం నుంచి ఉద్యమ స్థాయి దాకా తెలంగాణ కథ", డాక్టర్ వెల్దండి శ్రీధర్ "తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతర కథ", డాక్టర్ ప్రభాకర్ జైని "2014 నుంచి తెలంగాణ నవల", డాక్టర్ అట్టెం దత్తయ్య "తెలంగాణ యక్షగాన సాహిత్యం", డాక్టర్ వి త్రివేణి "తెలంగాణ కథా విమర్శ", డాక్టర్ నలిమెల భాస్కర్ "భాష నిఘంటువులు", డాక్టర్ కాసర్ల నరేశ్ రావు"తెలంగాణ గేయ కవిత్వం" అనే అంశాలపై పత్రాలను అందించారు.

తెలంగాణ సాహిత్య సభల ముగింపు సమావేశం భారత జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత అధ్యక్షతన ప్రారంభ మయ్యాయి. ఈ సమాపన సమావేశంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్, ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత, ప్రముఖ పరిశోధకులు కుర్రా జితేంద్రబాబు, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్‌లు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కాంచనపల్లి, తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు కొదారి శ్రీను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి సమావేశంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా పరిశోధనా పత్రాల సమాహారమైన " తెలంగాణ సాహిత్య అవలోకనం" అనే గ్రంథాన్ని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆవిష్కరించారు. "కేసీఆర్ సారు వ్యవసా యానికి సాగునీరు అందిస్తే మీరు సాహిత్య సావనీరు అందిస్తున్నారని" దేశపతి శ్రీనివాస్ చమత్కరించారు.

జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ "ఏ ఉద్యమం జరిగినా దానికి సాహిత్య సాంస్కృతిక రంగమే మొదటి గజ్జె కడుతుంది. తెలంగాణ ఉద్యమానికి తెలంగాణ జాగృతి సాహిత్య సాంస్కృతిక పోరాటంగా జత కూడి విజయం సాధించి విజయం సాధించిన తర్వాత, పునర్నిర్మాణంలోనూ అంతే ఉత్సాహంతో కవిత నేతృత్వంలో ముందుకు సాగడం అభినందనీయం. వ్యక్తుల యొక్క జన్మలు ఏ విధంగా ధన్యం అవుతాయంటే ఆయా రంగాల్లో పనిచేయడం వల్ల, నడిపించడం వల్ల, ఆయారంగాలకు నాయకత్వం వహించడం వల్ల . సాహిత్యం లోతులు తెలుసుకోకుండా, సాహిత్యాన్ని వంట పట్టించుకోకుండా ఉండే నాయకుడు పరిణతి లేకుండానే ఉంటాడు. కల్వకుంట్ల కవితలో ఆ పరిణతి స్పష్టంగా కనబడుతోంది. తెలంగాణ జాగృతి నడిపించడంలోనూ, ప్రజా జీవితంలో వివిధ హోదాలలో పని చేయడం ఆమెకు సాధ్యమైంది. కేసీఆర్ మహా నాయకుడిగా వర్ధిల్లుతున్నాడంటే ఆయన ఇప్పటికీ చదవడం, రాయడం, అధ్యయనశీలిగా ఉండడమే కారణం. అన్ని భాషల్లో అన్ని రాష్ట్రాల్లో కవులు ఉన్నారు. కానీ ఒక్క తెలంగాణలో కవులు ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా ఉన్నత హోదాలలో ఉండడం గమనార్హం. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభలు, గోలకొండ కవుల సంచిక పునర్ముద్రణ చేయడం, కొత్త తెలంగాణ చరిత్రకు సంబంధించిన పుస్తకాలు తేవడం ఇలాంటి గొప్ప పనులు తెలంగాణ జాగృతి కవిత ఆధ్వర్యంలో చేస్తున్నది" అని అభినందించారు.

కుర్రా జితేంద్రబాబు మాట్లాడుతూ "భారతదేశంలో ఎవ్వరికీ తీసిపోని చరిత్ర తెలంగాణకు ఉన్నది. భాషకు, అస్తిత్వానికి సంస్కృతికి, పండగలకు, పబ్బాలకు తెలంగాణలో ఎంతో ప్రాచీనత ఉన్నది. ఈ రంగాలలో తెలంగాణ జాగృతి ఎంతో కృషి చేస్తూ ఇప్పుడు భారత జాగృతిగా దేశవ్యాప్తంగా విస్తరించడం ఎంతో శుభ పరిణామం. నన్నయ కన్నా 70 సంవత్సరాల ముందు మల్లియ రేచన రాసిన కవిజనాశ్రయం అనే ఛందో గ్రంథం వచ్చింది. అంతకన్నా ముందే వచ్చిన గోకన్న ఛందం తొలి ఛందో గ్రంథం. మన ప్రాంతపు తెలుగు భాష ప్రాకృత ఛందస్సు నుంచి వచ్చింది. జనాశ్రయ ఛందో విచ్ఛిత్తి ఈ విషయాలను తెలుపుతుంది. కందము, సీసము మొదలైన పద్యాలు మనకు ప్రాకృతం నుంచి వచ్చాయి. ఇవన్నీ మన ప్రాచీనతకు నిదర్శనాలు. పాల్కురికి సోమనాథుడే ఆదికవి. ఇవన్నీ చెప్పగలిగినాము కాబట్టే తెలుగుకు ప్రాచీన హోదా వచ్చింది కాని కేవలం నాగబు అనే పదం వల్ల కాదు. " అని వివరించారు.

అనిశెట్టి రజిత మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమంలోనూ తెలంగాణ పునర్నిర్మాణం లోనూ కవయిత్రుల రచయిత్రుల పాత్ర గణనీయమైనది. తెలంగాణ జాగృతి వేదికగా కల్వకుంట్ల కవిత చేస్తున్న సాహిత్య సేవ సాహసంతో



కూడుకున్నది. పెద్ద మనసుతో విశాల దృక్పథంతో గట్టి సంకల్పంతో ఉంటేనే ఇటువంటి సాహిత్య సభలు సఫలం అవుతాయి. భావితరాలకు ముఖ్యంగా సమాజంలో వివక్షకు గురవుతున్న వారికి సాహిత్య వ్యక్తులు తెలంగాణ జాగృతి వంటి సంస్థలు అండదండగా నిలవాలి" అని ఆమె ఆకాంక్షించారు.

దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ "కల్వకుంట్ల కవిత నాకు ఉద్యమం ఇచ్చిన సోదరి. అధికారంలో ఉన్నవారికి, ప్రభుత్వంలో ఉన్న వారికి సాహిత్యం అంటే మక్కువ ఉండటం చాలా అరుదుగా చూస్తాం. ఇవాళ ఒక సాహిత్య సభలో కూర్చుని సావకాశంగా సాహిత్య విశ్లేషణ వింటూ, సమాజంలో సాహిత్యాని కున్న ప్రాముఖ్యతను గుర్తిస్తూ, భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకుంటూ కల్వకుంట్ల కవిత కనబరుస్తున్న నిబద్ధత నిమగ్నత అభినందనీయం. కవిత్వం జీవితానికి దగ్గరగా ఉండాలి. జీవితాన్ని ప్రతిబింబించాలి. మనిషి అనుభవిస్తున్న సంవేదనని సాహిత్యం పలకాలి. అది ఆ యుగస్వరం అవుతుంది. కాళ్ళ కింద నలుగుతున్న చీమల కాళ్ళు విరుగుతున్న శబ్దాన్ని వినగల సూక్ష్మ గ్రహణ శక్తి కలిగిన కవులు కావాలి. భారత జాగృతి బలహీనుల గొంతుకగా ప్రతిధ్వనించాలని కోరుకుంటున్నాను" అని ఆకాంక్షించారు.

భారత్ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ కేసీఆర్ అంటే కళాకారులు చరిత్రకారులు రచయితలని అందుకే 'ప్రాజెక్టు కేసీఆర్" కార్యక్రమం ద్వారా తెలంగాణ కళలు, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తా మని వెల్లడించారు. నిర్వహించిన సాహిత్య సదస్సులు తెలంగాణ సాహితీ వైభవం కండ్లకు కట్టిందని రెండు రోజులపాటు తెలంగాణ సాహిత్య వికాసంపై గంభీరమైన చర్చ జరిగిందని తెలిపారు. పిల్లలలో సాహిత్య అభినివేశం పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాఠశాలల్లో పిల్లలకు సాహిత్యం మీద పట్టు కోసం కృషి చేస్తామని తెలిపారు. అమరవీరులను పూజించే సంస్కృతి తమదని ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన అమరవీరుల స్మారక చిహ్నం ఆవిష్కరణ తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సందర్భమని ఆమె అన్నారు. ప్రతి ఏటా తెలంగాణ సాహిత్య సభలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా సాహిత్య సభలను విజయవంతం చేసిన సాహితీవేత్తలకు, సాహిత్య అభిమానులకు కవిత కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధక పత్రాలను సమర్పించిన సాహితీమూర్తులను, తెలంగాణ వ్యాప్తంగా జిల్లాల్లో సాహిత్య సేవలు అందిస్తున్న వివిధ సాహిత్య సంస్థల అధ్యక్షులను కల్వకుంట్ల కవిత ఘనంగా సన్మానించారు.

## వడ్డేపల్లి కృష్ణ తెలంగాణ ప్రముఖ కవులు - కావ్యాలు, గ్రంథ పరిచయ కార్యక్రమం



వడ్డేపల్లి కృష్ణ రచించిన ప్రముఖ కవులు కావ్యాలు గ్రంథం తెలుగు సాహిత్యానికి అత్యంత ఉపయోగకరం అన్నారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు. జూన్ 30న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కలహంసి ఆర్ట్స్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన ఈ గ్రంథపరిచయ సభ జరిగింది. ఈ సభకు గౌరవ అతిథులుగా జూలూరు గౌరీ శంకర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, అయినంపూడి శ్రీలక్ష్మి, చిక్కా రామదాసు, చొడూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. గ్రంథ రచయిత వడ్డేపల్లి కృష్ణని సభకు హాజరైన అతిథులు ఘనంగా సత్కరించారు



## "మహబూబాబాద్ జిల్లా సమగ్ర చరిత్ర" ఆవిష్కరణ

జులై 2న తెలంగాణ సారస్వత పరిషత్ వారి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మహబూబాబాద్ జిల్లా సమగ్ర చరిత్ర ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది, రచయిత విశ్వజంపాల (పోరాటాల పురిటిగడ్డ - వ్యాస రచయిత) గారిని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కె. శశాంక, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ సన్మానించారు.

స్వీకారం



## ప్రేమ పవనాలు - మానవతా సౌరభాలు

గులాబీల మల్లారెడ్డి

**జి.యమ్.ఆర్. పేటల్**
కరీంనగర్
ఫోన్ : 9440041351
వెల : రూ. 200/-



## నేను సావిత్రిబాయి పూలే మాట్లాడుతున్నాను

డా॥ దామెర రాములు

**తెలంగాణ సాహిత్య అకాడమి**
ఫోన్ : 040-29703142
వెల : రూ. 50 /-



## బడి బువ్వ

గరిపెల్లి అశోక్
సిద్ధిపేట

వెల : రూ. 80/-
సెల్ : 98496 49101



## సర్వేంద్రియాణాం నయనం ప్రధానం

డా॥ వైరాగ్యం ప్రభాకర్
సెల్ : 90145 59059

**భవాని సాహిత్య వేదిక**
వెల రూ. 150/-



## ఐదు తరాలు

గులాబీల మల్లారెడ్డి
ఫోన్ : 9440041351

**పాలపిట్ట బుక్స్**
కరీంనగర్
వెల : రూ. 150/-



## త్రిభుజపు నాలుగో కోణం

ఆడెపు లక్ష్మీపతి

**అన్విక్షికి పబ్లిషర్స్ ప్రై. లి.**
ఫోన్ : 970 597 2222
వెల రూ. 250/-



## కథా తిలకం

కుంతి

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
హైదరాబాద్
వెల : రూ.250/-



## తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కె.సి.ఆర్. వేసిన దారులు

డా॥ నన్నపురాజు విజయశ్రీ
హైదరాబాద్
సెల్ : 91004 49884

వెల : రూ.500/-



## చిమమండా న్గోజి అడిచె

పి. సత్యవతి

**అనిశెట్టి రజిత**
సెల్ : 98494 82462
హన్మకొండ
వెల : రూ.100/-

స్వీకారం కోసం మీ పుస్తకాలు ఈ చిరునామాకు పంపించండి వీలైతే సమీక్ష కూడా వేస్తాం.

**భారత జాగృతి :** పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in



జ్ఞానపీఠి

# డా॥ సి. నారాయణ రెడ్డి